www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 14-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 106 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా.12.00 తదుపరి పంచమి; నక్షత్రం: ధనిష్ఠ ఉ.6.49 తదుపరి శతభిషం; వర్జ్యం: మ.1.54-3.28; దుర్ముహూర్తం: మ.12.46-1.38, మ.3.22-4.14; అమృతఘడియలు: రా.11.20-12.55; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయం | భారత లక్ష్యం 193 | ప్రస్తుతం 58/4

అటా.. ఇటా

లార్డ్స్ మైదానంలో ఉత్కంఠ పతాక స్థాయికి చేరింది. ఒక్కో బంతికి ఏం జరుగుతుందోనని ఊపిరి బిగపట్టి చూడాల్సిన పరిస్థితి.. భారత బౌలర్ల ప్రతాపానికి ఆతిథ్య ఇంగ్లండ్‌ను 200లోపే కట్టడి చేశామనే ఆనందం క్రమేపీ ఆవిరవుతోంది. ఎందుకంటే.. ఛేదనలో గిల్ సేన కనీసం 60 పరుగులైనా చేయకముందే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఇక చివరి రోజు సాధించాల్సిన 135 పరుగులే ఇప్పుడు కొండంత లక్ష్యంగా కనిపిస్తోంది. ఇక భారమంతా రాహుల్, పంత్‌లపైనే..

- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 192
- స్పిన్నర్ సుందర్‌కు నాలుగు వికెట్లు



వాషింగ్టన్ సుందర్ (4/22)

లండన్: లార్డ్స్ మైదానంలో బ్యాటింగ్ అంత సులువు కాదని నాలుగో రోజూ నిరూపితమైంది. ఇంగ్లండ్ బ్యాటర్లు తడబడిన మాదిరే.. టీమిండియా కూడా అదే బాటన నడుస్తోంది. పరుగులు సాధించడం కష్టంగా మారిన ఈ పిచ్‌పై భారత్ 193 పరుగుల ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. కానీ పేసర్ కార్స్ (2/11) ధాటికి ఆదివారం ఆట ముగిసే సమయానికి భారత్ 17.4 ఓవర్లలో 4 వికెట్లకు 58 పరుగులు చేసింది. రాహుల్ (33 బ్యాటింగ్) క్రీజులో ఉండగా.. జట్టు ఇంకా 135 పరుగులు వెనుకంజలో ఉంది. దీంతో చివరి రోజు పంత్, నితీశ్, జడేజాల ఆటపైనే విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. స్టోక్స్, ఆర్చర్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. అంతకుముందు ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 192 పరుగులకు ఆలౌటైంది. రూట్ (40), స్టోక్స్ (33) రాణించారు. స్పిన్నర్ సుందర్‌కు నాలుగు.. బుమ్రా, సిరాజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

పేసర్ల తడాఖా: 2 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్‌కు భారత పేసర్లు పరీక్ష పెట్టారు. పిచ్‌పై అనూహ్య బౌన్స్‌ను ఉపయోగించుకుంటూ కట్టడి చేశారు. దీంతో తొలి గంటలోనే జట్టు రెండు వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా నర్సరీ ఎండ్ నుంచి పేసర్ సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేసి డకెట్ (12), పోప్ (4)ల పనిబట్టాడు. సెషన్ ఐదో ఓవర్‌లోనే తను డకెట్‌ను అవుట్ చేయగా.. కాసేపటికి పోప్‌ను ఎల్బీగా వెనక్కిపంపాడు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించినా.. సిరాజ్ ఒత్తిడి మేరకు గిల్ రివ్యూ కోరాడు. రీప్లే పరిశీలించిన థర్డ్ అంపైర్ అవుట్‌గా ప్రటించాడు. ఇక చక్కగా కుదురుకున్న ఓపెనర్ క్రాలే (22)ను నితీశ్ వెనక్కిపంపాడు. అయితే 50/3 స్కోరుతో కష్టాల్లో పడిన వేళ రూట్‌కు జత కలిసిన బ్రూక్ ఎదురుదాడికి దిగాడు. ఆకాశ్ ఓవర్‌లో తను 4,4,6తో 15 రన్స్ రాబట్టాడు. అయితే ఆకాశ్ ఫుల్ లెంగ్త్ డెలివరీని స్వీప్ షాట్ ఆడి బ్రూక్ బౌల్డయ్యాడు. ఆ తర్వాత మూడు ఓవర్లకే జట్టు 98/4 స్కోరుతో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.

సుందర్ మ్యాజిక్: రెండో సెషన్‌లో రూట్-స్టోక్స్ జోడీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేసింది. పేసర్లు ఒత్తిడి పెంచినా వికెట్ తీయలేకపోయారు. దీంతో ఇద్దరూ క్రీజులో కుదురుకున్నారు. కెప్టెన్ గిల్ ఎట్టకేలకు 37వ ఓవర్ నుంచి స్పిన్నర్లను బరిలోకి దించాడు. సుందర్ పాత బంతితో మ్యాజిక్ చేస్తూ అత్యంత కీలకంగా మారిన ఈ జోడీకి బ్రేక్ వేశాడు. రూట్ స్వీప్ షాట్ ప్రయత్నంలో బౌల్డ్ కావడంతో ఐదో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పడింది. కాసేపటికే స్మిత్ (8)ను సైతం సుందర్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ ఈ సెషన్‌లో 77 పరుగులు చేయగలిగింది. ఇక ఆఖరి సెషన్‌లో ఇంగ్లండ్ ఒక్కసారిగా తడబడింది. సుందర్ ఓవర్‌లో స్వీప్‌కు వెళ్లి స్టోక్స్ వెనుదిరిగాడు. ఇక బుమ్రా తన వరుస ఓవర్లలో కార్స్ (1), వోక్స్ (10)లను బౌల్డ్ చేయగా.. సుందర్ ఆఖరి వికెట్‌ను తీసి ప్రత్యర్థిని 200లోపే కట్టడి చేశాడు.

తడబాటుతో ఆరంభం: లక్ష్య ఛేదనలో భారత్ ఇన్నింగ్స్ సాఫీగా ఏమీ సాగలేదు. రెండో ఓవర్‌లోనే జైస్వాల్‌ను పేసర్ ఆర్చర్ డకౌట్ చేశాడు. ఈ దశలో రాహుల్‌కు జతగా కరుణ్ కాసేపు క్రీజులో నిలిచాడు. అటు రాహుల్ వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలతో స్కోరు పెంచాడు. కానీ మరో ఎండ్‌లో వికెట్ల పతనం సాగింది. పేసర్ కార్స్ తన వరుస ఓవర్లలో కరుణ్, గిల్ (6) వికెట్లను తీసి భారత్‌ను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాడు. ఇక సెషన్ ఆఖరి ఓవర్‌లో ఆకాశ్ (1)ను బౌల్డ్ చేసిన స్టోక్స్ గట్టి ఝలకే ఇచ్చాడు.



సిరాజ్‌కు జరిమానా తప్పదా?

ఆదివారం తొలి సెషన్ ఆరంభంలో పుల్ షాట్ ఆడే ప్రయత్నంలో ఇంగ్లండ్ ఓపెనర్ డకెట్ వెనుదిరిగాడు. అయితే ఈ వికెట్ తీసిన ఆనందంలో పేసర్ సిరాజ్ దూకుడుగా వ్యవహరించాడు. గట్టిగా అరుచుకుంటూ డకెట్ మొహం దగ్గరి దాకా వచ్చి మరీ ఆగ్రహంగా చూస్తూ.. అతడి భుజాన్ని ఢీకొడుతూ వెళ్లాడు. అయితే ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధన 2.5 ప్రకారం.. సిరాజ్ ప్రవర్తన రెచ్చగొట్టే విధంగా ఉండడంతో మ్యాచ్ ఫీజులో కోత విధించే అవకాశం ఉంది.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 387;
భారత్ తొలి ఇన్నింగ్స్: 387;
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (సి) జైస్వాల్ (బి) నితీశ్ 22; డకెట్ (సి) బుమ్రా (బి) సిరాజ్ 12; పోప్ (ఎల్బీ) సిరాజ్ 4; రూట్ (బి) సుందర్ 40; బ్రూక్ (బి) ఆకాశ్ 23; స్టోక్స్ (బి) సుందర్ 33; స్మిత్ (బి) సుందర్ 8; వోక్స్ (బి) బుమ్రా 10; కార్స్ (బి) బుమ్రా 1; ఆర్చర్ (నాటౌట్) 5; బషీర్ (బి) సుందర్ 2; **ఎక్స్‌ట్రాలు: 32; మొత్తం: 62.1 ఓవర్లలో 192 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-22, 2-42, 3-50, 4-87, 5-154, 6-164, 7-181, 8-182, 9-185, 10-192; **బౌలింగ్:** బుమ్రా 16-3-38-2; సిరాజ్ 13-2-31-2; నితీశ్ 5-1-20-1; ఆకాశ్ 8-2-30-1; జడేజా 8-1-20-0; సుందర్ 12.1-2-22-4.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) స్మిత్ (బి) ఆర్చర్ 0; రాహుల్ (బ్యాటింగ్) 33; కరుణ్ (ఎల్బీ) కార్స్ 14; గిల్ (ఎల్బీ) కార్స్ 6; ఆకాశ్ (బి) స్టోక్స్ 1; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 17.4 ఓవర్లలో 58/4. వికెట్ల పతనం:** 1-5, 2-41, 3-53, 4-58; **బౌలింగ్:** వోక్స్ 5-2-11-0; ఆర్చర్ 4-0-18-1; స్టోక్స్ 4.4-0-15-1; కార్స్ 4-1-11-2.

విడిపోయిన సైనా, కశ్యప్

సోషల్ మీడియాలో నెహ్వాల్ ప్రకటన

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్.. తన భర్త పారుపల్లి కశ్యప్ నుంచి విడిపోయినట్టు ప్రకటించింది. ఆదివారం రాత్రి ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియాలో పోస్టు చేసింది. 'జీవితం ఒక్కోసారి మనల్ని భిన్నమైన మార్గాల వైపు నడిపిస్తుంటుంది. ఎంతో ఆలోచించి, చర్చించుకొన్న తర్వాత ఇద్దరం కలసి ఉండలేమని నిర్ణయించుకొన్నట్టు' సైనా రాసింది. పరస్పర అంగీకారంతోనే విడిపోయామని.. తమ వ్యక్తిగత జీవితాన్ని గౌరవించాలని కోరింది. షట్లర్లయిన సైనా, కశ్యప్‌లు 2018లో ప్రేమ వివాహం చేసుకొన్నారు. గోపీచంద్ అకాడమీలోనే వీరిద్దరూ శిక్షణ పొందారు. నెహ్వాల్ ఒలింపిక్ పతకంతో పాటు టాప్ ర్యాంక్‌కు చేరుకోగా.. కశ్యప్ 2014లో కామన్వెల్త్ స్వర్ణం సాధించాడు.



సినర్ కొత్త చరిత్ర




- వింబుల్డన్ నెగ్గిన తొలి ఇటాలియన్
- ఫైనల్లో అల్కారజ్ జోరుకు బ్రేక్

లండన్: డబుల్ డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కారజ్‌ను ఓడించిన టాప్ సీడ్ యానిక్ సినర్.. తొలిసారి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ముద్దాడాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సినర్ 4-6, 6-4, 6-4, 6-4తో రెండో సీడ్ అల్కారజ్ (స్పెయిన్)పై సునాయాసంగా నెగ్గాడు. దీంతో హ్యాట్రిక్ టైటిల్ నెగ్గాలన్న అల్కారజ్ స్వప్నం చెదరగా.. 148 ఏళ్ల టోర్నీ చరిత్రలో టైటిల్ నెగ్గిన తొలి ఇటాలియన్‌గా సినర్ రికార్డు సృష్టించాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అల్కారజ్ చేతిలో ఓడిన సినర్.. గ్రాస్ కోర్ట్‌లో గట్టిగా బదులు తీర్చుకొన్నాడు. మూడు గంటలకుపైగా సాగిన పోరులో అల్కారజ్ తొలి సెట్‌లో నెగ్గినా.. ఆ తర్వాత వరుసగా మూడు సెట్‌లు గెలిచిన సినర్ టైటిల్‌ను దక్కించుకొన్నాడు. మొదటి సెట్ ఐదో గేమ్‌లోనే అల్కారజ్ సర్వీస్‌ని బ్రేక్ చేసిన సినర్ 4-2తో ముందంజ వేశాడు. అయితే, ఎనిమిదో గేమ్‌లో బ్రేక్ పాయింట్ సాధించిన అల్కారజ్ 4-4తో సమం చేశాడు. ఇదే జోరులో వరుసగా రెండు గేమ్‌లు గెలిచి సెట్‌ను తన ఖాతాలో వేసుకొన్నాడు. అయితే, రెండో సెట్‌లో పుంజుకొన్న సినర్ 2-0తో పైచేయి సాధించాడు. మరోవైపు పట్టువదలకుండా పోరాడిన అల్కారజ్ 4-5తో నిలిచాడు. కానీ, చివరి గేమ్‌లో సర్వీస్‌ను నిలబెట్టుకొన్న సినర్..సెట్ నెగ్గి1-1తో స్కోరు సమం చేశాడు. ఇక్కడి నుంచి కార్లోస్ ఆట గతి తప్పింది. మూడో సెట్‌లో ఇద్దరూ తమతమ సర్వీస్‌లను నిలబెట్టుకొంటూ సాగడంతో 4-4తో సమంగా నిలిచారు. అయితే, 9వ గేమ్‌లో అల్కారజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సినర్ 6-4తో మూడో సెట్ గెలిచి ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఇక, నాలుగో సెట్ మూడో గేమ్‌లోనే బ్రేక్ పాయింట్ సాధించిన సినర్ 2-1తో పైచేయిగా నిలిచాడు. కానీ, 8వ గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసే అవకాశాన్ని అల్కారజ్ చేజార్చుకోవడంతో.. సినర్ 5-3తో టైటిల్‌కు చేరువయ్యాడు. 10వ గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకొన్న యానిక్ విజేతగా నిలిచాడు. దీంతో వరుసగా 24 మ్యాచ్‌లు గెలిచిన అల్కారజ్ జైత్రయాత్రకు బ్రేక్ పడింది.

1

టెస్టు ఇన్నింగ్స్‌లో ఏడుగురిని బౌల్డ్ చేయడం.. అలాగే ఓ టెస్టు మ్యాచ్‌లో ఎక్కువ మంది (12) బ్యాటర్లను బౌల్డ్ చేయడం కూడా భారత్‌కిదే తొలిసారి.

ఇంగ్లండ్‌లో జరిగిన టెస్టు సిరీస్‌లో ఎక్కువ పరుగులు (607) సాధించిన బ్యాటర్‌గా గిల్. ద్రవిడ్ (2002లో 602 రన్స్)ను అధిగమించాడు.

ఆస్ట్రేలియా 225 ఆలౌట్

కింగ్‌స్టన్: వెస్టిండీస్‌తో శనివారం ప్రారంభమైన మూడో టెస్ట్ (డే/నైట్) తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 225 పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా ఓ దశలో 157/3తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ ఈ దశలో వెస్టిండీస్ బౌలర్లు విజృంభించడంతో మిగిలిన ఏడు వికెట్లను కేవలం 68 పరుగులకే కోల్పోయింది. స్టీవెన్ స్మిత్ (48), గ్రీన్ (46) మాత్రమే రాణించారు. షామర్ జోసెఫ్ నాలుగు, జస్టిన్ గ్రీవ్స్ జేడెన్ సీల్స్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆతిథ్య జట్టు తొలిరోజు ఆఖరికి వికెట్ నష్టానికి 16 పరుగులు చేసింది. 100వ టెస్ట్ ఆడుతున్న ఆసీస్ పేసర్ స్టార్క్ ఒక వికెట్ దక్కించుకున్నాడు.

ఇంగ్లండ్ ఉత్కంఠ విజయం

- ఐదో టీ20లో గెలుపు
- సిరీస్ 3-2తో భారత్ కైవసం



బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌పై తొలిసారి టీ20 సిరీస్‌లో విజయం సాధించిన భారత మహిళల జట్టు.. ఆఖరి మ్యాచ్‌లో పోరాడి ఓడింది. చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన ఐదో టీ20లో భారత్ 5 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. కానీ, 3-2తో టీ20 సిరీస్‌ను భారత్ సొంతం చేసుకొంది. శనివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో తొలుత భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు చేసింది. షఫాలీ వర్మ (75) మినహా అంతా విఫలమయ్యారు. చార్లీ డీన్ 3, ఎకెల్‌స్టోన్ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఇంగ్లండ్ ఓవర్లన్నీ ఆడి 168/5 స్కోరు చేసి గెలిచింది. దీప్తి శర్మ, అరుంధతి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. చివరి 3 బంతుల్లో 5 పరుగులు అవసరమవగా.. ఎకెల్‌స్టోన్ (4 నాటౌట్) జట్టును గెలిపించింది. తెలుగమ్మాయి శ్రీ **చరణి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'**గా నిలిచింది.

బిజినెస్

25400 పైన బుల్లిష్

(జూలై 14-18 తేదీల మధ్య వారానికి)

టెక్ వ్యూ


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 25150 (-311)

నిఫ్టీ గత వారం 25489-25129 పాయింట్ల మధ్యన కదలాడి 311 పాయింట్ల నష్టంతో 25150 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25361, 25416, 25412, 25152 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25400
బ్రేక్‌డౌన్ స్థాయి: 24800
నిరోధ స్థాయిలు: 25250, 25350, 25450 (25150 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24950, 24850, 24750 (25050 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	493
చిత్తూరు	583	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	88	విజయవాడ	97
వరంగల్	88	గుంటూరు	102
కరీంనగర్	88	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	88	చిత్తూరు	100
కర్నూలు	88	నెల్లూరు	105
విశాఖపట్నం	81	అనంతపురం	105
గోదావరి	97		

జీతాల పెంపుపై టీసీఎస్‌లో అనిశ్చితి

లాభదాయకతే ముఖ్యమన్న సీఎఫ్‌ఓ



ముంబై: జీతాల పెంపుపై ఐటీ దిగ్గజం టీసీఎస్ నోరు మెదపడం లేదు. జీతాల పెంపు ముఖ్యమైన విషయమే అయినా, లాభాలతో కూడిన అభివృద్ధి అంతకంటే ముఖ్యమని కంపెనీ సీఎఫ్‌ఓ సమీర్ సెక్సారియా తేల్చి చెప్పారు. దీంతో టీసీఎస్‌లో జీతాల పెంపు ఎప్పుడు జరుగుతుందనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. సాధారణంగా టీసీఎస్‌తో సహా ప్రధాన ఐటీ కంపెనీలు ఏటా ఏప్రిల్ నుంచి జీతాల పెంపు అమలు చేస్తాయి. అయితే ఈ సంవత్సరం ఏ ప్రధాన ఐటీ కంపెనీ కూడా జీతాల పెంపు గురించి ప్రకటించలేదు.

ఎందుకంటే?

అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఇతర కారణాలతో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో టీసీఎస్ నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కేవలం ఆరు శాతం పెరిగింది. మార్చి త్రైమాసికం సైతం కంపెనీకి పెద్దగా కలిసి రాలేదు. దీంతో ఏప్రిల్ నుంచి అమలు చేయాల్సిన వార్షిక జీతాల పెంపు పక్కన పడింది. 'టీసీఎస్‌లో జీతాలు పెంపు అరుదుగా మాత్రమే వాయిదా పడుతుంది, తిరిగి జీతాల పెంపునకు వెళ్లడమే నా ప్రాధాన్యత' అని సీఎఫ్‌ఓ చెప్పడం విశేషం. దీంతో టీసీఎస్‌లో జీతాల పెంపు ఇప్పట్లో ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

లాభాలకూ గండి: ప్రస్తుతం దేశీయ ఐటీ కంపెనీలు అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలకు తోడు, ట్రంప్ సుంకాల పోటు పరిశ్రమను భయపెడుతోంది. ప్రధాన మార్కెట్లయిన అమెరికా, ఐరోపా నుంచి కొత్త ప్రాజెక్టులు పెద్దగా రావడం లేదు. వచ్చినా అరకొర ప్రాజెక్టులే. దీనికి తోడు చాలినంత ఏఐ నైపుణ్యాలున్న నిపుణులు దొరక్క, అనేక కంపెనీలు ఉన్న ప్రాజెక్టులనే సక్రమంగా పూర్తి చేయలేకపోతున్నాయి. టీసీఎస్‌ని కూడా ఇవే సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో జూన్ త్రైమాసికంలో 24.5 శాతానికి పడిపోయిన స్థూల లాభాన్ని మళ్లీ 26 నుంచి 28 శాతానికి పెంచడమే తమ ముందున్న ప్రాధాన్యత అని సెక్సారియా స్పష్టం చేశారు.

డిమాండ్‌ను బట్టే నియామకాలు

డిమాండ్ పెరిగితే తప్ప నియామకాలు పెంచే యోచన లేదని కూడా టీసీఎస్ సీఎఫ్‌ఓ స్పష్టం చేశారు. లేకపోతే కంపెనీ లాభాలు మరింతగా తగ్గే ప్రమాదం ఉందన్నారు. కొత్త ప్రాజెక్టులు పెద్దగా లేకపోవడంతో ఉన్న ఉద్యోగులనే సరిగా ఉపయోగించుకోలేకపోతున్నట్టు చెప్పారు. ఉద్యోగుల వినియోగం తమ చేతుల్లో ఉన్నా, డిమాండ్ మాత్రం తమ చేతుల్లో లేదన్నారు. ఉన్న ఉద్యోగులను సక్రమంగా వినియోగించుకోవడం, డిమాండ్ పుంజుకోవడం రెండూ తమకు ముఖ్యమేనని సెక్సారియా స్పష్టం చేశారు.

2030 నాటికి రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడులు

- పునరుత్పాదక, హరిత ఇంధనంపై దృష్టి
- ఎన్‌ఎల్‌సీ ఇండియా సీఎండీ



హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని ఎన్‌ఎల్‌సీ ఇండియా పెద్ద ఎత్తున వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందుకోసం 2030 నాటికి రూ.1.25 లక్షల కోట్లు ఖర్చు చేయనుంది. కంపెనీ ఎండీ, సీఈఓ మోటుపల్లి ప్రసన్న కుమార్ పీటీఐ వీడియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం వెల్లడించారు. దీంతో తమ స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుత 6,700 మెగావాట్ల నుంచి 2030 నాటికి 20,000 మెగావాట్లకు చేరుతుందన్నారు. వచ్చే ఐదేళ్లలో కంపెనీ ఖర్చు చేసే రూ.1.25 లక్షల కోట్లలో రూ.65,000 కోట్లు పునరుత్పాదక, హరిత ఇంధన ప్రాజెక్టులపై ఖర్చు చేస్తామన్నారు. మిగతా రూ.60,000 కోట్లలో రూ.45,000 కోట్లు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల కోసం, మిగతా రూ.15,000 కోట్లు గనుల అభివృద్ధి కోసం ఖర్చు చేయబోతున్నట్టు ఆయన చెప్పారు. పునరుత్పాదక, హరిత ఇంధన ప్రాజెక్టులపై చేసే రూ.65,000 కోట్ల ఖర్చులో రూ.15,000 కోట్లు బ్యాటరీ స్టోరేజి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయబోతున్నట్టు వెల్లడించారు.

ఇతర ముఖ్యాంశాలు

- తెలంగాణకు 200 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సరఫరా ఒప్పందంపై సంతకాలు.
- అంతర్గత వనరులు, దేశ, విదేశీ రుణాలు, ఐపీఓ ద్వారా విస్తరణ ప్రాజెక్టులకు నిధుల సమీకరణ.
- ఈ ఆర్థిక సంవత్సరంలోనే అనుబధ సంస్థ ఎన్‌ఎల్‌సీ ఇండియా రెన్యూవబుల్స్ లిమిటెడ్ (ఎన్‌ఐఆర్‌ఎల్) ఐపీఓ.
- ఎన్‌ఐఆర్‌ఎల్ ప్రాజెక్టుల్లో రూ.3,720 కోట్ల పెట్టుబడులకు సూత్రప్రాయ ఆమోదం
- మాలిలో లిథియం ఖనిజ ప్రాజెక్టు కోసం రష్యా కంపెనీలో ఈక్విటీ వాటా
- కాంగోలో కాపర్, కోబాల్ట్ ఖనిజ గనుల కోసం చర్చలు

25000 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కరెక్షన్‌లో కొనసాగుతూ వారం మొత్తానికి 300 పాయింట్ల పైగా నష్టంతో 25,150 వద్ద ముగిసింది. ముందువారంలో 25,000 వద్ద ఏర్పడిన బ్రేకౌట్‌కు ఇది పుల్‌బ్యాక్ రియాక్షన్‌గా భావించాలి. ఫలితంగా మరోసారి 25,000 సమీపంలోకి వచ్చింది. అలాగే మిడ్‌క్యాప్-100, స్మాల్ క్యాప్-100 సూచీలు కూడా గరిష్ఠ స్థాయిల నుంచి రియాక్షన్ సాధిస్తున్నట్టు కనిపిస్తోంది. టెక్నికల్‌గా ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉన్నప్పటికీ భద్రత కోసం 25,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ ప్రధాన నిరోధ స్థాయి 25,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 25,550. ఇదే స్వల్పకాలిక నిరోధ స్థాయి కావడం వల్ల స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: మరింత బలహీనపడినా భద్రత కోసం 25,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి.

బ్యాంక్ నిఫ్టీ: గత రెండు వారాల్లో మైనర్ కరెక్షన్ సాధిస్తూ వచ్చిన ఈ సూచీ గత వారం 277 పాయింట్ల నష్టంతో 56,750 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధం 57,300. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 57,650. బలహీనపడినా ప్రస్తుత మద్దతు స్థాయి 56,600 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత తప్పదు. ప్రధాన మద్దతు స్థాయి 56,000.

పాటర్న్: నిఫ్టీకి 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద గట్టి మద్దతు ఉంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. ప్రస్తుతం మార్కెట్ 25 డీఎంఏ కన్నా దిగువకు వచ్చి 25,000 సమీపంలో ఉన్న 50 డీఎంఏకు చేరువవుతోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళ, గురువారాల్లో మైనర్ రివర్సల్స్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25230, 25300
మద్దతు	25000, 24940

పసిడి ధర మరింత ముందుకే

త్వరలోనే మళ్లీ రూ.లక్షకు

ముంబై: పసిడి ధర ఈ వారం మరింత ముందుకు కదిలే సూచనలు కనిపిస్తున్నట్టు విశ్లేషకుల అంచనా. గత వారం ప్రారంభంలో ఎంసీఎక్స్‌లో రూ.94,951 వద్ద ప్రారంభమైన 10 గ్రాముల మేలిమి బంగారం ధర, వారాంతానికి రూ.97,830 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర 2.8 శాతం పెరిగింది. గత వారం అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో ఆగస్టులో డెలివరీ ఇచ్చే ఔన్స్ బంగారం ధర ఒక దశలో 3,364 డాలర్లకు చేరింది. ప్రస్తుతం స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ పసిడి ధర 3,356.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇది త్వరలోనే 3,500 డాలర్లకు చేరే అవకాశం ఉందని ఏంజెల్ వన్ బ్రోకరేజి సంస్థ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ ప్రతమేస్ మాల్యా అంచనా. ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల పసిడి ధర వచ్చే కొద్ది రోజుల్లో రూ.లక్షకు చేరుతుందని మార్కెట్ వర్గాల అంచనా.

భారత్-రష్యా చమురు వాణిజ్యంలో భారీ పెరుగుదల

11 నెలల గరిష్ఠ స్థాయికి దిగుమతులు

న్యూఢిల్లీ: భారత రిఫైనరీలు పశ్చిమాసియాపై ఆధారనీయతను తగ్గించుకుంటూ రష్యా నుంచి ముడిచమురు దిగుమతులను మరింత పెంచుతున్నాయి. చమురు నిల్వలను పెంచేందుకు అవి చురుగ్గా కొనుగోళ్లకు దిగిన నేపథ్యంలో జూన్ నెలలో రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు గత 11 నెలల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. రోజుకు 20.8 లక్షల బ్యారెళ్ల సరఫరాతో రష్యా మళ్లీ భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా నిలిచింది. అంతర్జాతీయ కమోడిటీ సంస్థ కెప్లర్ వెల్లడించిన గణాంకాల ప్రకారం జూన్‌లో దేశానికి మొత్తం ముడిచమురు దిగుమతులు 6 శాతం తగ్గినప్పటికీ, రష్యా నుంచి వచ్చే చమురు పరిమాణం మాత్రం నెలవారీగా 8 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది 2024 జూలై తర్వాత అత్యధిక స్థాయి కావడం గమనార్హం.

థర్మల్ ప్లాంట్లకు ఊరట

న్యూఢిల్లీ: బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వ స్వల్ప ఊరట ఇచ్చింది. ఈ ప్లాంట్ల నుంచి వెలువడే వాయువుల్లో గంధకం (సల్ఫర్) శాతాన్ని నియంత్రించేందుకు ఉద్దేశించిన ఫ్లూ గ్యాస్ డిసల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) యంత్ర పరికరాల ఏర్పాటు నుంచి కొన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు మినహాయింపు ఇచ్చింది. పది లక్షలకు మించి జనాభా ఉన్న నగరాలకు 10 కిలోమీటర్ల పరిధిలోని థర్మల్ ప్లాంట్లకు మాత్రమే ఈ నిబంధనను పరిమితం చేసింది. దీని వల్ల యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చులు 25 పైసల నుంచి 30 పైసల వరకు తగ్గుతాయని తెలిపింది. దీనికి సంబంధించి ఆదివారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది.

మెర్సిడెస్ కార్ల ధర మరోసారి పెంపు

న్యూఢిల్లీ: మెర్సిడెస్ బెంజ్ ఇండియా మరోసారి కార్ల ధరలు పెంచనుంది. సెప్టెంబర్‌లో తమ కార్ల ధరలను 1 నుంచి 1.5 శాతం వరకు పెంచే యోచనలో ఉన్నట్టు కంపెనీ తెలిపింది. యూరోతో పోలిస్తే రూపాయి బలహీనత నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ తెలిపారు.

11 సంవత్సరాల్లో 474% పెరిగిన ఐటీ రిఫండ్లు

న్యూఢిల్లీ: గతంతో పోల్చితే ఆదాయపు పన్ను రిఫండ్లలో వేగం పెరిగింది. గత 11 సంవత్సరాల కాలంలో ఐటీ రిఫండ్లు 474% పెరిగి 2024-25 సంవత్సరం నాటికి రూ.4.77 లక్షల కోట్లకు చేరాయి. ఇదే కాలంలో పన్ను వసూళ్లలో ఏర్పడిన వృద్ధి 274 శాతంతో పోల్చితే రిఫండ్లలో వృద్ధి గణనీయంగా ఉంది. ఐటీ రిఫండ్ల కాల వ్యవధి 2013 సంవత్సరంలో 93 రోజులుండగా 2024 నాటికి 17 రోజులకు తగ్గింది. పన్ను యంత్రాంగంలో సమర్థత పెరగడంతో పాటు రిటర్న్‌ల ఫైలింగ్ నుంచి ఐటీఆర్‌ల ప్రాసెసింగ్ వరకు డిజిటల్ మౌలిక వసతుల వినియోగం పెరగడం రిఫండ్లలో గణనీయమైన వృద్ధికి కారణమని ఐటీ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా ముందుగానే నింపిన రిటర్న్‌లు అందుబాటులోకి తేవడం, రిఫండ్ ప్రాసెసింగ్‌లో ఆటోమేషన్, రియల్ టైమ్ టీడీఎస్ సర్దుబాట్లు ఈ మెరుగుదలకు దోహదపడ్డాయి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 14-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 106 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: చవితి రా.12.00 తదుపరి పంచమి; నక్షత్రం: ధనిష్ఠ ఉ.6.49 తదుపరి శతభిషం; వర్జ్యం: మ.1.54-3.28; దుర్ముహూర్తం: మ.12.46-1.38, మ.3.22-4.14; అమృతఘడియలు: రా.11.20-12.55; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.49

'విద్య'కు రూ.15,396 కోట్ల రుణం!

ఏడీబీ, ఏఐఐబీ నుంచి సేకరణకు సర్కారు ఏర్పాట్లు
యంగ్ ఇండియా గురుకులాల నిర్మాణం, విద్యార్థులు-టీచర్లకు శిక్షణ కోసం రూ. 5వేల కోట్లు
బడుల్లో మౌలిక సదుపాయాలకు రూ. 10,396 కోట్లు
సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కార్యక్రమం కింద చర్యలు
విదేశాంగ శాఖ, నీతి ఆయోగ్‌తో చర్చలు
రుణ సేకరణకు అనుమతుల కోసం విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం, టీచర్లకు శిక్షణతోపాటు పాఠశాల, ఉన్నత విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ)4 కార్యక్రమం కింద ప్రత్యేకంగా రూ.15,396 కోట్లు రుణంగా తీసుకోనున్నట్లు

మిగతా 3వ పేజీలో...

కవిత X మల్లన్న

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆఫీసుపై దాడి

కల్వకుంట్ల కవితపై మల్లన్న వ్యాఖ్యలతో జాగృతి కార్యకర్తల ఆగ్రహం 11
కార్యాలయం అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం.. మల్లన్నపైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నం
అడ్డుకున్న గన్‌మెన్, కార్యాలయ సిబ్బంది.. తీవ్ర తోపులాట.. పలువురికి గాయాలు
గన్‌మెన్ కాల్పులు.. ఇరు వర్గాలపై కేసులు.. జాగృతి కార్యకర్త ఒకరికి ఆస్పత్రిలో చికిత్స
నాపై హత్యాయత్నం చేయించిన కవిత.. ఆమె ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి: మల్లన్న


మల్లన్నపై మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న కవిత


కాల్పులు జరుపుతున్న మల్లన్న గన్‌మ్యాన్


ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, కల్వకుంట్ల కవిత మధ్య తీవ్ర వివాదం చెలరేగింది. బీసీల రిజర్వేషన్లపై మాట్లాడేందుకు కవిత ఎవరంటూ ఆమెపై మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేయడంతో జాగృతి కార్యకర్తలు ఆయన కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. వారిని అడ్డుకునేందుకు మల్లన్న గన్‌మెన్ కాల్పులు జరపడంతో పలువురికి గాయాలయ్యాయి. మరోవైపు తనపై దారుణమైన వ్యాఖ్యలు చేసిన మల్లన్నను ఎమ్మెల్సీ పదవికి అనర్హుడిగా ప్రకటించాలంటూ మండలి చైర్మన్‌కు కవిత ఫిర్యాదు చేశారు. అయితే తనపై కవిత హత్యాయత్నం చేయించారని మల్లన్న ఆరోపించారు. ఆమె ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు.

అనర్హుడిగా ప్రకటించాలి

ఎమ్మెల్సీ మల్లన్నపై మండలి చైర్మన్‌కు కవిత ఫిర్యాదు
నన్నే ఇలా అంటే సాధారణ మహిళల పరిస్థితేంటి?
దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకుంటే మల్లన్నతో ఆయనే మాట్లాడించినట్లు భావించాల్సి వస్తుంది
నిరసన తెలిపితే కాల్పులు జరుపుతారా?: కవిత
మల్లన్న, ఆయన గన్‌మెన్‌పై హత్యాయత్నం కేసు పెట్టాలి
డీజీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కవిత ఫిర్యాదు 11
కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యల్ని ఖండిస్తున్నాం
ఆయన ఆఫీసుపై దాడి చట్ట వ్యతిరేకమే: మహేశ్ గౌడ్
కవిత ఎపిసోడ్‌పై స్పందించని బీఆర్ఎస్ పెద్దలు!






గణేశ్ చిత్రంలో విలన్‌గా..

అహ నా పెళ్లంట సినిమాలో పిసినారి లక్ష్మీపతిగా కోట శ్రీనివాసరావు

కోట తెరాభినిష్క్రమణం

అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే తుది శ్వాస విడిచిన కోట శ్రీనివాసరావు

అద్భుత నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న విలక్షణ నటుడు
4 దశాబ్దాల సినీ ప్రయాణం.. 750కి పైగా చిత్రాల్లో నటన
కడసారి చూపునకు తరలివచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు
ఆయన పార్థివ దేహాన్ని చూసి కన్నీటిపర్యంతమైన తోటి నటులు
ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురి నివాళులు
కోట భౌతికకాయానికి చంద్రబాబు, పవన్ పుష్పాంజలి
జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు
కోటకు 9 నంది అవార్డులు.. 2015లో పద్మశ్రీ పురస్కారం


కోట శ్రీనివాసరావు పార్థివదేహం వద్ద రోదిస్తున్న బాబూమోహన్

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్/రాయదుర్గం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): హాస్యమైనా.. హడలెత్తించే విలనీ అయినా.. భావోద్వేగమైనా.. భయపెట్టే డైలాగైనా.. పాత్ర ఏదైనా, మాండలికమేదైనా.. వెటకారం, కపటత్వం.. మంచితనం, మమకారం.. అన్నిటినీ అలవోకగా పలికించే విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు (83) ఇక లేరు! రంగస్థలంపై తన నటజీవితాన్ని ప్రారంభించిన ఆయన.. వెండితెరపై నాలుగున్నర దశాబ్దాలపాటు వెలిగి.. ఎనిమిది పదుల వయసులో జీవన రంగస్థలం నుంచి శాశ్వతంగా నిష్క్రమించారు! దాదాపు 750 సినిమాల్లో తనదైన నటనతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన కోట.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే

మిగతా 9వ పేజీలో...

భాయ్.. బచ్చా ఆగయా..!

గంజాయి స్మగ్లర్ల కోడ్ భాష 12
గచ్చిబౌలిలో ఈగల్ స్కెచ్
14 మంది కొనుగోలుదార్ల అరెస్టు
స్పాట్‌లో పరీక్ష.. అందరికీ పాజిటివ్
స్మగ్లర్ సందీప్ ఫోన్లో 100 నంబర్లు
మిగతా వారు లొంగిపోవాలి: ఈగల్

పదవితో అహంకారం

2
ఇతరులపై ఆధిపత్యానికి యత్నం
కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు
బీజేపీ అధిష్ఠానం గురించే: విపక్షాలు



రేపటి నుంచి యూకే ఈ-వీసా

పాస్‌పోర్టుతో డిజిటల్‌గా వీసా లింక్
యూకేవీఐ ఖాతా, అప్‌డేట్లు తప్పనిసరి
కంపెనీలు, వర్సిటీలకు యూకేవీఐని పరిశీలించే వెసులుబాటు 2
వృత్తి నిపుణుల వీసాల్లో కఠిన షరతులు

ఆరేళ్లు సహజీవనం చేసి.. హతమార్చాడు!

ఇద్దరికి లక్ష సుపారీ ఇచ్చిన మదన్
ఖమ్మం జిల్లా కొణిజర్ల నుంచి తీసుకెళ్లి సూర్యాపేట జిల్లా కిష్టాపురంలో హత్య
మహిళ అదృశ్యం కేసులో వీడిన మిస్టరీ
కిష్టాపురం అడవుల్లో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభ్యం 12
సహజీవనం చేస్తూ మరొకరితో మదన్ పెళ్లి.. ఇద్దరితో ఒకే ఇంట్లో



భక్త జనసంద్రమైన లష్కర్

3
మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్

నేటి నుంచే కొత్త రేషన్‌కార్డులు

సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో పంపిణీ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
సాయంత్రం బహిరంగ సభలో ప్రసంగం
రేపు ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్
పీవీ సంస్మరణ సభలో పాల్గొనే చాన్స్
అక్కడే ఏపీ సీఎం చంద్రబాబుతో వేదిక పంచుకోనున్న రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సూర్యాపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం నుంచే కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం కానుంది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం అక్కడే నిర్వహించనున్న బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఈ మేరకు సీఎం పర్యటన, సభ కోసం అధికారులు ఏర్పాట్లు

మిగతా 3వ పేజీలో...

ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం వల్లే!

కల్తీ కల్లు విక్రయాలకు బాధ్యులు వారే!
హైదరాబాద్‌లో 90 శాతం కల్లు కల్తీయే
కూకట్‌పల్లి ఘటనకు ముందు 20 కల్లు నమూనాలు పరీక్షిస్తే అన్నిట్లో అల్ప్రాజోలం
అయినా.. కళ్లు మూసుకున్న ఆబ్కారీ శాఖ
దుర్ఘటన తర్వాత పరీక్షల్లోనూ అల్ప్రాజోలమే
కఠిన చర్యలు తీసుకునే యోచనలో సర్కారు
పదికి చేరిన 'కల్తీ కల్లు' మృతుల సంఖ్య!

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనకు ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలు వస్తున్నాయి. హైదరాబాద్‌లో పలుచోట్ల ప్రమాదకరమైన మత్తు పదార్థాలతో కల్లు తయారు చేసి విక్రయిస్తున్నట్లు తెలిసినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోలేదని తెలుస్తోంది. అందుకే కల్తీ కల్లు విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, కూకట్‌పల్లిలో 8 మంది

మిగతా 12వ పేజీలో...

ఓటర్ల జాబితాల తనిఖీ ఇక దేశమంతటా

బిహార్ తరహాలో ఆగస్టులో చేపట్టనున్న ఈసీ
తొలుత అసోం, కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిల్లో.. 2
రాష్ట్రాల్లో యంత్రాంగం క్రియాశీలం
బిహార్ జాబితాల్లో భారీగా విదేశీయులు
బంగ్లా, మయన్మార్, నేపాలీలకూ ఓట్లు

రైలు బోగీల్లో సీసీ కెమెరాలు

2
ఒక్కో కోచ్‌లో 4 చొప్పున ఏర్పాటు
దేశవ్యాప్తంగా 74 వేల బోగీల్లో..
లోకోమోటివ్‌ల్లో కూడా రెండేసి..
నార్తర్న్ రైల్వే పరిధిలో పైలట్ ప్రాజెక్టు
రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదం

దేశమంతటా ఓటర్ల జాబితాల తనిఖీ



బిహార్ తరహాలో వచ్చే నెలలో చేపట్టనున్న ఈసీ!

- రాష్ట్రాల్లో క్షేత్ర స్థాయి యంత్రాంగం క్రియాశీలం
- బిహార్ జాబితాల్లో భారీగా విదేశీయులు

న్యూఢిల్లీ/పట్నా, జూలై 13: బిహార్లో మాదిరిగా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత తనిఖీ చేపట్టాలని ఎన్నికల కమిషన్ (ఈసీ) నిర్ణయించింది. ఈ ఏడాది అక్టోబరు-నవంబరుల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అనర్హులైన ఓటర్లను తొలగించేందుకు తనిఖీలు చేపట్టే అధికారం ఈసీకి ఉందని, అది దాని రాజ్యాంగ కర్తవ్యమని సుప్రీంకోర్టు స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమీక్ష, తనిఖీ రాజ్యాంగవిరుద్ధమని, ఓటర్ల ఓటుహక్కును హరించేదిగా ఉందంటూ వివిధ ప్రతిపక్షాలు వేసిన పిటిషన్‌పై ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ నెల 28న ఆ పిటిషన్‌పై మరోసారి విచారణ జరుగనుంది. ఆ తర్వాత వచ్చే నెలలోనే దేశవ్యాప్తంగా ఈ తనిఖీలు నిర్వహణకు ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసే వీలుంది. ముందుగా వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన అసోం, కేరళ, బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిల్లో ఈ ప్రక్రియ చేపడతారు. విపక్షాలు పిటిషన్ వేసిన మర్నాడే.. అంటే ఈ నెల 5న జాబితాల సమీక్షకు సన్నాహాలు మొదలుపెట్టాలని ఆదేశిస్తూ ఈసీ అన్ని రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారు(సీఈవో)లకు లేఖ రాసింది. వచ్చే ఏడాది జనవరి 1కల్లా ఈ ప్రక్రియ పూర్తిచేయాలని.. 18 ఏళ్లు నిండినవారికి ఓటు హక్కు కల్పించాలని స్పష్టంచేసిందని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వెల్లడించింది.

బంగ్లా, మయన్మార్, నేపాలీలకు ఓట్లు

బిహార్లో చేపట్టిన ప్రత్యేక విస్తృత తనిఖీల్లో.. పెద్దసంఖ్యలో విదేశీయులు ఉన్నట్లు తేలింది. నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ జాతీయుల పేర్లు ఓటర్ల జాబితాల్లో ఉన్నాయని.. తనిఖీలు పూర్తయ్యాక తొలగిస్తామని ఈసీ వర్గాలు తెలిపాయి. గత నెల 25 నుంచి ఈ రాష్ట్రంలో తనిఖీలు మొదలయ్యాయి. 77 వేల మంది బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు).. 7.8 కోట్ల మంది ఓటర్లున్న జాబితాలను ఆగస్టు 1 నుంచి లోతుగా పరిశీలించనున్నారు. తనిఖీల అనంతరం వారి పేర్లు తొలగించి తుది జాబితాలను సెప్టెంబరు 30న ప్రచురిస్తారు. ఓటర్లు తమ పౌరసత్వాన్ని నిరూపించుకునే డాక్యుమెంట్లు సమర్పించాలని ఈసీ ఇప్పటికే ఆదేశించింది. డాక్యుమెంట్లు చూపలేకపోతే ఓట్లు తీసేస్తారని విపక్షాలు ఆందోళన వ్యక్తంచేయడంతో ఇందుకోసం ఆధార్, ఈసీ జారీచేసిన ఫొటో ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

భారత్‌కు సౌదీ అరేబియా ఎరువులు

- సౌదీలో పర్యటించిన కేంద్ర మంత్రి నడ్డా

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఖరీఫ్ సీజన్‌లో ఏర్పడిన కొరతను తీర్చేందుకు సౌదీ అరేబియా.. భారత్‌కు ఎరువులు సరఫరా చేయనుంది. కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రి జేపీ నడ్డా ఆదివారం సౌదీ అరేబియాలో పర్యటించారు. అత్యధికంగా యూరియాతోపాటు ఇతర ఎరువులను ఉత్పత్తి చేసే క్రిబ్కో, ఇతర సంస్థల ప్రతినిధి బృందం, భారతీయ రాయబారి సోహైల్ అహ్మద్ ఖాన్‌తో కలిసి రాస్ అల్ ఖైర్ ప్రాంతంలో ఉన్న గనులు, ఎరువుల సంస్థ మాదెన్‌కు చెందిన ఫ్యాక్టరీని సందర్శించారు. శుక్రవారం రాత్రి సౌదీకి వచ్చిన మంత్రి ఇక్కడి అధికారులు, వ్యాపారవేత్తలతో సమావేశమయ్యారు. ఎరువుల ఉత్పత్తి, సరఫరాల తదితరాలపై వారితో చర్చించారు. యూరియా, ఇతర ఎరువులను మాదెన్.. భారత్‌కు ఎగుమతి చేస్తుంది. భారత్‌లో ఈ ఖరీఫ్ సీజన్‌లో కేంద్రం 52లక్షల టన్నుల యూరియా వినియోగాన్ని అంచనావేయగా, ఇంకా నాట్లు పూర్తవకముందే 48లక్షల టన్నుల విక్రయం జరిగిందని, పంట చేతికొచ్చే సరికి యూరియా ఇంకా అవసరమవుతుందని ప్రభుత్వం అంచనావేస్తోంది. ప్రతి సీజన్‌లో రాష్ట్రాల నుంచి ఎరువులకు అనూహ్యమైన డిమాండ్ ఏర్పడడంతో ఎరువులు ప్రత్యేకించి.. యూరియా, పొటాష్ సమస్యను పరిష్కరించే దిశగా మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్ సౌదీ అరేబియాతో అనేకసార్లు చర్చలు జరిపి వెళ్లారు కూడా. రష్యా, మొరాకో, జోర్డాన్, ఈజిప్టు, చైనా దేశాలు భారతీయ ఎరువుల ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకును అందిస్తున్నా భౌగోళికరీత్యా ధర, సమయం కారణాన భారత్.. సౌదీ వైపు మొగ్గు చూపుతోంది. సౌదీ, ఇతర అరబ్బు దేశాల నుంచి ఎగుమతయ్యే ఎరువుల్లో అత్యధిక భాగం కాకినాడ, విశాఖపట్టణం, పారాదీప్ నౌకాశ్రయాలకు చేరుకుంటాయి.

పదవితో అహంకారం పెరుగుతుంది: గడ్కరీ

ముంబై, జూలై 13: పదవులు, సంపద, విజ్ఞానం, అందం లభించినప్పుడు వ్యక్తుల్లో అహంకారం పెరిగిపోతుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. శనివారం ఆయన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజలు అంగీకరించిన నాయకులు ఎన్నడూ ఆధిపత్య ధోరణిని ప్రదర్శించరని గడ్కరీ పేర్కొన్నారు. "అధికారంతో తాము అత్యంత తెలివైన వాళ్లుగా మారామని భావించడం మొదలయ్యాక.. ఇతరులపై ఆధిపత్యానికి ప్రయత్నిస్తారు. వినయాన్ని చూపే నాయకులు సహచరుల్లో గౌరవభావంతో ఉంటారు. ఈ చర్య బృంద సహకారానికి దోహదపడుతుంది. విభిన్న ఆలోచనలకు అవకాశమిస్తుంది"అన్నారు. విద్యాశాఖలో ఉపాధ్యాయుల నియామకాల కోసం కొందరు లంచాలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. అయితే గడ్కరీ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. విపక్షాలు ఆ వ్యాఖ్యలను బీజేపీ అధిష్ఠానంపై గురిపెట్టిన మాటలుగా పేర్కొంటున్నాయి.

డిసెంబరులో 'గగన్‌యాన్'

- మానవరహిత రాకెట్ ప్రయోగం : ఇస్రో చైర్మన్ నారాయణన్

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మానవులను అంతరిక్షంలోకి పంపే గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా వచ్చే డిసెంబరులో మానవరహిత రాకెట్ ప్రయోగం జరపనున్నట్లు ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ప్రకటించారు. తమిళనాడులోని కన్నియాకుమారి జిల్లా కులశేఖర పట్టణంలో యువ శాస్త్రవేత్తల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా నారాయణన్ మీడియాతో మాట్లాడుతూ.. 'గగన్‌యాన్ మిషన్ ద్వారా ఒక భారతీయుడిని ఏవోజీ పద్ధతి ప్రకారం రాకెట్‌లో అంతరిక్షానికి పంపి.. అక్కడ పరిశోధనల అనంతరం మళ్లీ భూమి మీదకు తీసుకురానున్నామని చెప్పారు. వచ్చే డిసెంబరులో మానవరహిత రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపుతామని, ఆ తర్వాత మరో రెండు రాకెట్లను పంపి పరిశోధనలు పూర్తి చేశాక.. 2027లో అంతరిక్షంలోకి మనిషిని పంపే గగన్‌యాన్ మిషన్‌ను చేపడతామని నారాయణన్ తెలిపారు. 2040లో చంద్రుడిపై భారతీయులు అడుగుపెట్టేలా మిషన్‌ను రూపొందించే ప్రయత్నాలను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.



రైలు బోగీల్లో సీసీ కెమెరాలు

- రైల్వేశాఖ నిర్ణయం.. కేంద్ర మంత్రి ఆమోదం

న్యూఢిల్లీ, జూలై 13: ప్రయాణికుల భద్రతను పెంచే దిశగా రేల్వే శాఖ కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 74 వేల ప్యాసింజర్ కోచ్‌లతో పాటు 15 వేల లోకోమోటివ్‌లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టుకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఆమోదం తెలిపారు. నార్తర్న్ రైల్వే పరిధిలో లోకో ఇంజన్లు, కోచ్‌లలో ప్రయోగాత్మకంగా సీసీటీవీ కెమెరాలను అమర్చి, వాటి పనితీరును పరిశీలించిన తరువాత ఈ వ్యవస్థను దేశవ్యాప్తంగా విస్తరించాలని నిర్ణయించారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో రైళ్లలో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని రైల్వే శాఖ భావిస్తోంది.

సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఇలా..

ప్రతి ప్యాసింజర్ కోచ్‌లో నాలుగు డోమ్- రకం సీసీటీవీ కెమెరాలు (ప్రతి ప్రవేశ మార్గంలో రెండు) ఉంటాయి. ప్రతి లోకోమోటివ్ కోచ్‌లలో ముందు, వెనుక, రెండు వైపులా ఒక్కో కెమెరా ఉంటుంది. ప్రతి లోకోమోటివ్ క్యాబ్‌లో (ముందు, వెనుక) ఒక డోమ్ సీసీటీవీ కెమెరా, రెండు డెస్క్ మౌంటెడ్ మైక్రోఫోన్‌లు అమరుస్తారు. గంటకు 100 కి.మీ వేగంతో వెళ్తున్న రైలులో, తక్కువ వెలుతురులోనూ స్పష్టమైన, అధిక నాణ్యత గల ఫుటేజీని అందించేలా కెమెరాలు ఉండాలని అధికారులను రైల్వేశాఖ ఆదేశించింది. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో ప్రయాణికుల గోప్యతకు భంగం కలగకుండా తలుపుల వద్ద మాత్రమే వాటిని అమర్చనున్నారు. ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడానికే ఈ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఈ ఆధునికీకరణ ప్రయత్నాలు భారతీయ రైల్వే ప్రయాణికులకు సురక్షితమైన, పటిష్ఠమైన ప్రయాణ అనుభవాన్ని అందించాలనే నిబద్ధతకు నిదర్శనం అని అధికారులు పేర్కొన్నారు.

రైల్వే రిక్రూట్‌మెంట్‌లో ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు

ఉద్యోగ నియామక ప్రక్రియను మరింత పారదర్శకంగా రూపొందించాలని రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్ణయించింది. రాబోయే నాలుగు నెలల్లో రైల్వేలోని అన్ని నియామక కేంద్రా ల్లో ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు సాంకేతికతను ప్రవేశపెట్టనుంది. దీంతో రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో మోసాలను అరికట్టడమే ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ వ్యవస్థ ఆధార్ ఈ-కేవైసీని ఉపయోగించుకుని, అభ్యర్థుల గుర్తింపును పలు దశల్లో ధ్రువీకరిస్తుంది. దరఖాస్తుల సమర్పణ సమయంలో, పరీక్ష రోజున, చివరికి పరీక్ష పూర్తయ్యాక కూడా.. పరీక్షకు హాజరైన వ్యక్తి, దరఖాస్తు చేసుకున్న వ్యక్తి ఒకరేనా, కాదా అని దీని ద్వారా నిర్ధారిస్తారు.

రాజ్యసభకు ఉజ్వల్ నికమ్

26/11 ఉగ్ర దాడి కేసులో ఈయనే పీపీ.. పెద్దల సభకు నామినేట్ చేసిన రాష్ట్రపతి

- విదేశాంగ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శృంగ్లాకూ చాన్సు
- కేరళ బీజేపీ నేత సదానందన్ మాస్టర్, చరిత్రకారిణి మీనాక్షి జైన్‌కు కూడా..



ఉజ్వల్ దేవరావ్ నికమ్ | హర్షవర్ధన్ శృంగ్లా | సి.సదానందన్ | మీనాక్షి జైన్

న్యూఢిల్లీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యసభకు నలుగురు ప్రముఖులను నామినేట్ చేశారు. వీరిలో ముంబైపై ఉగ్రవాద దాడి (26/11) కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా ఉన్న ఉజ్వల్ దేవరావ్ నికమ్, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శృంగ్లా, ఢిల్లీకి చెందిన చరిత్రకారిణి 'పద్మశ్రీ' మీనాక్షి జైన్, కేరళ బీజేపీ నేత సి.సదానందన్ మాస్టర్ ఉన్నారు. వీరికి ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. రాజ్యాంగంలోని 80వ అధికరణలోని 1ఏ, 3 క్లాజుల కింద తనకు సంక్రమించిన అధికారాలతో రాష్ట్రపతి రాజ్యసభకు 12 మందిని ఎంపిక చేసే అవకాశముంది. ఈ జాబితాలో ప్రస్తుతం నాలుగు ఖాళీలు ఉండగా.. వాటిని ఆదివారం భర్తీచేశారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. మహారాష్ట్రలోని జల్గావ్‌లో జన్మించిన నికమ్ (73).. ప్రముఖ న్యాయవాది. ఆ రాష్ట్రంలో పలు కీలక కేసుల్లో న్యాయవాదిగా ఉన్నారు. ముంబైపై ఉగ్రదాడిలో పట్టుబడిన అజ్మల్ కసబ్‌కు ఉరిశిక్ష పడడంలో ముఖ్యపాత్ర పోషించారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ముంబై నార్త్ సెంట్రల్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఓడిపోయారు. శృంగ్లా 2020-22 నడుమ విదేశాంగ కార్యదర్శిగా పనిచేశారు. 2023లో జరిగిన జీ-20 సదస్సు సమన్వయకర్తగా వ్యవహరించారు. బీజేపీలో చేరారు. మీనాక్షి జైన్ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' మాజీ సంపాదకుడు గిరిలాల్ జైన్ కుమార్తె. చరిత్రకారిణి అయిన ఈమె మధ్యయుగాల భారతంపై పుస్తకం రాశారు. వాజపేయి ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్‌సీఈఆర్‌టీ ఈ పుస్తకాన్ని పాఠ్యగ్రంథంగా చేసింది. 2004లో యూపీఏ సర్కారు రాగానే ఆమె పుస్తకాన్ని తొలగించింది. ఢిల్లీలోని గార్గి కాలేజీలో చరిత్ర బోధించే మీనాక్షి.. మోదీ ప్రభుత్వ హయాంలో 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్'లో సభ్యురాలిగా నియమితులయ్యారు. 2020లో ఆమెకు పద్మశ్రీ కూడా లభించింది. అయోధ్యలో రామజన్మభూమిపై కూడా ఆమె పుస్తకం రాశారు. ఇక సదానందన్ మాస్టర్ కేరళలోని కన్నూర్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. వామపక్ష నేపథ్యం ఉన్న ఈయన ఆర్ఎస్ఎస్‌లో చేరడంతో సీపీఎం కార్యకర్తలు 1994లో ఆయన కాళ్లు నరికేశారు. 2016, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కూత్తుపరంబలో బీజేపీ తరఫున పోటీ చేసిన మాస్టర్‌ను గెలిపించేందుకు ప్రధాని మోదీ స్వయంగా ప్రచారం చేయడం విశేషం. వచ్చే ఏడాది ఏప్రిల్-మేలో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రీత్యా సదానందన్ ఎంపికకు ప్రాధాన్యం ఏర్పడింది. ఆయన్ను రాజ్యసభకు నామినేట్ చేయడం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల్లో నూతనోత్తేజం నింపుతుందని భావిస్తున్నారు. ఈ నలుగురు నామినేటెడ్ సభ్యులతో కలిపి సభలో అధికార ఎన్‌డీఏ బలం 133కి పెరిగింది. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు జరిగే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కీలకమైన ఆర్థిక బిల్లులను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఇది మోదీ ప్రభుత్వానికి లాభిస్తుందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

ప్రధాని ఏమన్నారంటే..

న్యాయరంగంలో, రాజ్యాంగానికి నికమ్ సేవలు ఆదర్శప్రాయమని.. విజయవంతమైన న్యాయవాది మాత్రమే కాదని.. ముఖ్యమైన కేసుల్లో న్యాయం కోసం ముందువరుసలో నిలుస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శృంగ్లా దౌత్యవేత్తగా, మేధావిగా, వ్యూహాత్మక ఆలోచనాపరుడిగా పేరుగాంచారని.. భారత విదేశాంగ విధానానికి, జీ-20 సదస్సు విజయవంతానికి కృషిచేశారని తెలిపారు. మీనాక్షి జైన్ మేధావి, పరిశోధకురాలు, చరిత్రకారిణిగా ప్రసిద్ధి చెందారని.. విద్య, సాహిత్యం, చరిత్ర, రాజనీతి శాస్త్రంలో ఆమె రచనలు చేశారన్నారు. సదానందన్ మాస్టర్ జీవితం సాహసం, అన్యాయానికి తలొగ్గని వ్యక్తిత్వాన్ని చాటుతోందని తెలిపారు. ఉపాధ్యాయుడిగా, సామాజిక కార్యకర్తగానూ ప్రశంసాత్మక పాత్ర పోషించారని ఆయన కొనియాడారు.

రాజ్యసభలో ప్రస్తుత బలాబలాలు..

మొత్తం సభ్యులు	: 245
ఎన్‌డీఏ (10 మంది నామినేటెడ్ సభ్యులతో కలిపి)	: 133
ఇండీ కూటమి	: 78
ఇతర విపక్షాలు	: 29
ఖాళీలు	: 5

లోకం తీరు



వచ్చే జూన్‌లో రిటైర్ కానున్న ఖర్గే

- దేవెగౌడ, దిగ్విజయ్‌తో పాటు కొందరు కేంద్ర మంత్రులు కూడా..
- ఏపీ నుంచి నలుగురు.. తెలంగాణ నుంచి ఇద్దరు

న్యూఢిల్లీ, జూలై 13: రాజ్యసభలో ఏకంగా 72 స్థానాలకు 2026 ఏప్రిల్, జూన్, నవంబరుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. పలువురు కీలక నేతలు, కొందరు కేంద్ర మంత్రుల పదవీకాలం వచ్చే ఏడాది ముగియనుంది. వీరిలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ (కర్ణాటక), కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్, కేంద్ర మంత్రి జార్జి కురియన్ (మధ్యప్రదేశ్), కేంద్ర మంత్రి రవ్‌నీత్‌సింగ్ బిట్టూ (రాజస్థాన్), జేఎంఎం వ్యవస్థాపకుడు శిబూ సోరెన్ (జార్ఖండ్), కాంగ్రెస్ నేత శక్తిసింగ్ గోహిల్ (గుజరాత్), వైసీపీ ఎంపీలు పరిమళ్ నత్వానీ, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, టీడీపీ ఎంపీ సానా సతీశ్ (ఆంధ్రప్రదేశ్) కూడా జూన్‌లో రిటైర్ కానున్నారు. వీరికి ముందే ఏప్రిల్‌లో ఎన్‌సీపీ-ఎస్‌పీ అధినేత శరద్ పవార్, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే (ఆర్‌పీఐ) సహా మహారాష్ట్ర నుంచి ఏడుగురు పదవీ విరమణ చేయనున్నారు. తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ, బీఆర్ఎస్‌కు చెందిన కేఆర్ సురేశ్‌రెడ్డి కూడా అదే నెలలో రిటైర్ కానున్నారు. మహారాష్ట్ర-7, తమిళనాడు-6, బెంగాల్-5, బిహార్-5, ఒడిసా-4, అసోం-3, తెలంగాణ-2, ఛత్తీస్‌గఢ్-2, హరియాణా-2, హిమాచల్ నుంచి ఒక్కరు చొప్పున ఏప్రిల్‌లో రిటైరవుతారు. ఉత్తరప్రదేశ్ నుంచి 10 మంది, ఉత్తరాఖండ్ నుంచి ఒకరు నవంబరులో పదవీవిరమణ చేస్తారు.

పట్టాలు తప్పి అగ్గి రేగి.. 18 డీజిల్ ట్యాంకర్లు దగ్ధం

రూ.12 కోట్ల ఆస్తి నష్టం


తమిళనాడులోని తిరువళ్లూరు వద్ద ఘటన

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డీజిల్ ట్యాంకర్ల లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పటంతో ట్యాంకర్లు ఒకదానినొకటి ఢీకొని నిప్పంటుకుని భారీ అగ్నిప్రమాదం సంభవించింది. 18 ట్యాంకర్లలో ఉన్న 900 టన్నుల డీజిల్ కాలిపోయింది. రూ.12కోట్ల మేరకు ఆస్తినష్టం సంభవించింది. తమిళనాడులోని తిరువళ్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. చెన్నై శివారు ప్రాంతం మనలిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) సంస్థ నుంచి 52 ట్యాంకర్లలో డీజిల్‌ను నింపుకుని గూడ్స్ రైలు ఆదివారం వేకువజామున కర్ణాటకలోని మైసూరుకు బయలుదేరింది. తిరువళ్లూరు రైల్వే స్టేషన్ దాటగానే రైలింజన్, దాని వెనుకనున్న మూడవ ట్యాంకర్, దాని తర్వాత మరో రెండు ట్యాంకర్లు పట్టాలు తప్పాయి. 70 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన డీజిల్ ట్యాంకర్లు ఒకదానినొకటి ఢీకొనడంతో ఆ రాపిడికి నిప్పురవ్వలు చెలరేగి పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ వెలువడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని సుమారు ఏడు గంటలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదం కారణంగా ఆ రైలు మార్గంలోని సిగ్నల్ బోర్డులు, విద్యుత్ వైర్లు దెబ్బతిన్నాయి.

రేపటి నుంచి యూకే ఈ-వీసా

పాస్‌పోర్టుతో డిజిటల్‌గా వీసా అనుసంధానం.. యూకేవీఐ ఖాతా, అప్‌డేట్లు తప్పనిసరి

- కంపెనీలు, వర్సిటీలకు యూకేవీఐని పరిశీలించే వెసులుబాటు
- ఇళ్లను అద్దెకిచ్చే వారికి కూడా
- వృత్తి నిపుణుల వీసాల్లో కఠిన షరతులు
- సోషల్ కేర్ వీసాలు ఇకపై ఉండవు
- పదేళ్ల తర్వాతే శాశ్వత నివాసానికి చాన్స్



లండన్, జూలై 13: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లో ఈ నెల 15 నుంచి సాధారణ వీసాల స్థానంలో ఈ-వీసాలు అమల్లోకి వస్తాయి. వీసాల జారీ ప్రక్రియలో యూకే ఇమిగ్రేషన్ చేపట్టిన మార్పుల్లో భాగంగా ఈ-వీసాలను పరిచయం చేస్తారు. అంటే.. ఈ నెల 15 నుంచి అన్నిరకాల వీసాలు పొందేవారి పాస్‌పోర్టులతో ఈ-వీసాలు లింక్ అయ్యి.. డిజిటల్ రూపంలో కొనసాగుతాయి. బ్రిటన్ తన వలస విధానంలో భాగంగా ఈ ఏడాది మే నెలలో 'రీస్టోరింగ్ కంట్రోల్ ఓవర్ ఇమిగ్రేషన్ సిస్టమ్' పేరుతో శ్వేతపత్రాన్ని విడుదల చేసిన విషయం తెలిసిందే.! ఆ విధానంలో భాగంగా ఈ నెల 15 నుంచి దశల వారీగా వీసా విధానంలో కీలక మార్పులు అమల్లోకి వస్తాయి. ఇమిగ్రేషన్ ప్రక్రియను గాడిన పెట్టేందుకు ఈ విధానాన్ని తీసుకువస్తున్నట్లు అధికారులు వివరించారు. భారత్ నుంచి విద్యార్థులే ఎక్కువ సంఖ్యలో యూకే వీసాలు తీసుకుంటుంటారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు కచ్చితంగా తమ డిజిటల్, ప్రొసీజరల్ అంశాలను ప్రయాణానికి ముందే సరిచూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇకపై వీసా విగ్నెట్‌ను జారీ చేయరని, దాని బదులు ఈ-వీసా జారీ అవుతుందని పేర్కొన్నారు. ఈ-వీసా అనేది డిజిటల్ ఇమిగ్రేషన్ హోదాను అందిస్తుందని.. కొత్త విధానంలో విద్యార్థులు తమ పాస్‌పోర్టు అప్‌డేట్స్‌ని ఎప్పటికప్పుడు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. "ప్రస్తుతం ఫిజికల్ వీసా స్టిక్కర్లు ఇస్తున్నారు. ఈనెల 15 నుంచి దీన్ని రద్దు చేస్తారు. ప్రయాణికుల పాస్‌పోర్టు నంబర్లకు అనుసంధానించిన సురక్షిత వీసా ఆన్‌లైన్ రికార్డులను పరిచయం చేస్తారు. ఇది బార్డర్ కంట్రోల్(సరిహద్దు నియంత్రణ)ను సులభతరం చేస్తుంది. పేపర్ వర్క్‌ను తగ్గిస్తుంది" అని స్పష్టం చేశారు.

యూకేవీఐ ఖాతా తప్పనిసరి

విద్యార్థులు యూకేవీఐ ఖాతాను తెరిచి, ఈ-వీసాను నిర్వహించుకోవాల్సి ఉంటుందని ఇమిగ్రేషన్ అధికారులు తెలిపారు. వీసా వివరాలు, ఇతర అప్‌డేట్లు, ఇమిగ్రేషన్ స్టేటస్ సమాచారం ఆయా విద్యాసంస్థలకు, కంపెనీలకు చేరవేయడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు యూకేలో బస చేసేందుకు, కోర్సుల్లో చేరే సమయాల్లో ఆయా కంపెనీలు, ఇళ్లను అద్దెకిచ్చేవారు, విశ్వవిద్యాలయాలు కూడా యూకేవీఐ ఖాతాను తనిఖీ చేసుకునే వెసులుబాటు ఉంటుంది.

ఉల్ఫాపై భారత్ సర్జికల్ స్ట్రైక్స్!

- మయన్మార్‌లోని శిబిరాలే లక్ష్యంగా డ్రోన్ దాడులు
- ముగ్గురు సీనియర్లను కోల్పోయిన ఉల్ఫా-ఐ
- 19 మందికి గాయాలైనట్టు ప్రకటన.. ఖండించిన భారత సైన్యం

న్యూఢిల్లీ, గువాహటి, జూలై 13: ఈశాన్య ప్రాంతంలోని వేర్పాటువాద గ్రూపులపై భారత సైన్యం సర్జికల్ దాడులకు దిగింది. మయన్మార్‌లోని తమ శిబిరాలపై భారత సైన్యం డ్రోన్, క్షిపణి దాడులు చేసినట్టు నిషేధిత ఉల్ఫా-ఐ (యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం-ఇండిపెండెంట్) ఆదివారం ప్రకటించింది. ఈ దాడుల్లో ముగ్గురు సీనియర్ నాయకులను కోల్పోయామని, దాదాపు 19 మంది గాయపడ్డారని వెల్లడించింది. మయన్మార్ సైన్యం సహకారంతో ఉల్ఫా-ఐ, ఎన్ఎస్‌సీఎన్-కే (నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్-ఖప్లాంగ్) స్థావరాలపై ఆదివారం తెల్లవారుజామున భారత సైన్యం డ్రోన్ దాడు లు చేసినట్టు సమాచారం. భారత సరిహద్దులోని మయన్మార్‌లో నాగా స్వయం పాలిత ప్రాంతమైన హోయత్ బస్తీలోని ఉల్ఫా-ఐ తూర్పు కమాండ్ ప్రధాన కార్యాలయం, వక్తం బస్తీలోని 779 శిబిరంతోపాటు మరో రెండు శిబిరాలు లక్ష్యంగా రెండు గంటలకు పైగా దాడులు జరిగాయి. ఈ దాడులకు 300కుపైగా డ్రోన్లను వినియోగించినట్టు తెలిసింది. ఈ దాడుల్లో ఉల్ఫా-ఐ అగ్ర కమాండర్ నయన్ మేధి అలియాస్ నయన్ అసోం మరణించినట్టు ఉల్ఫా-ఐ తెలిపింది. పరేశ్ బారువా నేతృత్వంలోని నిషేధిత ఉల్ఫా-ఐ సంస్థకు ఆయన కీలక వ్యూహకర్తగా, సైనిక శిక్షకుడిగా ఉన్నాడు. అలాగే.. ఈ డ్రోన్ దాడుల్లో ఎన్ఎస్‌సీఎన్-కేకు చెందిన శిబిరాలూ దెబ్బతిన్నాయి. కాగా, నయన్ అసోం అంత్యక్రియలు నిర్వహిస్తుండగా తమ శిబిరంపై మరోసారి క్షిపణి దాడి జరిగిందని ఉల్ఫా-ఐ పేర్కొంది. ఆ సమయంలో బ్రిగేడియర్ గణేశ్ అసోం, కల్నల్ ప్రదీప్ అసోం మ రణించారని ప్రకటించింది. ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని స్పష్టం చేసింది. మయన్మార్‌లోని కచిన్ ఇండిపెండెంట్ ఆర్మీ, నాగా తిరుగుబాటుదారు లు, పాక్ గూఢాచార సంస్థ ఐఎస్ఐ, అఫ్గాన్‌లోని ముజాహిదీన్‌లతో ఉల్ఫా-ఐకి సంబంధాలు ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, మయన్మార్‌లోని నిషేధిత ఉల్ఫా-ఐ శిబిరాలపై డ్రోన్ దాడులు చేయలేదని భారత సైన్యం ఆదివారం స్పష్టం చే సింది. ఉల్ఫా-ఐ చేసిన ప్రకటనను భారత సైన్యం ఓ ప్రకటనలో ఖండించింది.

హిందూ వ్యాపారిని కొట్టి చంపి శవంపై చిందులు!

- బంగ్లాదేశ్‌లో దారుణం

ఢాకా, జూలై 13: బంగ్లాదేశ్‌లో హిందూ వ్యాపారిని షాపు నుంచి లాక్కెళ్లిన ఓ పార్టీకి చెందిన యూత్ వింగ్ కార్యకర్తలు.. దారుణంగా దాడి చేసి చంపి అతడి మృతదేహంపై డ్యాన్స్ చేశారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్‌గా మారడంతో బంగ్లాదేశ్ వ్యాప్తంగా మైనారిటీలు ఆందోళనలు చేపట్టారు. అక్కడి తాత్కాలిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనివర్సిటీల్లో విద్యార్థులు నిరసనలతో హోరెత్తించారు. పాత ఢాకా ప్రాంతంలోని మిట్‌ఫోర్డ్ ఆస్పత్రి సమీపంలో హిందువైన లాల్‌చంద్ సోహాగ్ తుక్కు వ్యాపారం చేసేవారు. ఈ నెల 9వ తేదీన అటుగా ర్యాలీగా వచ్చిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) యూత్ ఫ్రంట్‌కు చెందిన కార్యకర్తలు.. షాపు నుంచి అతడిని బయటకు ఈడ్చుకెళ్లి కాంక్రీట్ దిమ్మెలు, ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. అనంతరం అతడు చనిపోయాడని నిర్ధారించుకున్నాక మృతదేహంపై ఉన్మాదుల్లా చిందులు వేశారు. దీనిపై లాల్‌చంద్ సోదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో 19 మంది నిందితుల పేర్లు నమోదు కాగా.. 20 మంది వరకు గుర్తు తెలియని అనుమానితులు కూడా ఉన్నారు. ఇప్పటి వరకు ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

అంతరిక్షం నుంచి భారత్ 'సారే జహా సే అచ్ఛా..'

- వీడ్కోలు సమావేశంలో శుభాంశు శుక్లా వ్యాఖ్య
- నేడు భూమికి తిరుగు ప్రయాణం



న్యూఢిల్లీ, జూలై 13: అంతరిక్షం నుంచి భారత్ ఆశావాదం, నిర్భయత్వం విశ్వాసంతో సగర్వంగా కనిపిస్తోందని ప్రస్తుతం రోదసీ యాత్ర చేస్తున్న గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అన్నారు. యాక్సియం-4 మిషన్ ద్వారా ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లో రెండు వారాల పాటు ప్రయోగాలు చేసిన ఆ మిషన్ సభ్యులు సోమవారం భూమికి తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన వీడ్కోలు సమావేశంలో శుభాంశు మాట్లాడారు. అంతరిక్షం నుంచి భారత్ ఎలా కనిపిస్తోందన్న ప్రశ్నకు 'సారే జహా సే అచ్ఛా' అని సమాధానం ఇచ్చారు. 1984లో తొలిసారిగా అంతరిక్ష యాత్ర చేసిన రాకేశ్ శర్మ అంతరిక్షం నుంచి భారత్ ఎలా కనిపిస్తోందన్న ప్రశ్నకు సారే జహా సే అచ్ఛా అని జవాబిచ్చారు. దానినే ప్రస్తుతం శుభాంశు గుర్తు చేశారు. 'ఆజ్ కా భారత్ స్పేస్ సే నిడార్, గర్వ్ సే పూర్ణ్ దిక్తా హై'..భారత్ గర్వకారణంగా కనిపిస్తోందని తెలిపారు. ఐఎస్ఎస్‌లో ప్రస్తుతం 11 మంది ఉన్నారు. వారిలో ఏడుగురు ఎక్స్‌పెడిషన్-73 ద్వారా వెళ్లిన వారు కాగా, శుభాంశు సహా మరో ముగ్గురు యాక్సియం-4 ద్వారా వెళ్లారు. తిరుగు ప్రయాణంపై నాసా కమర్షియల్ క్రూ ప్రోగ్రాం మేనేజర్ స్టీవ్ స్టిచ్ అమెరికాలో మీడియాతో మాట్లాడారు. సోమవారం ఉదయం 7.05 గంటలకు ఐఎస్ఎస్‌లోని హార్మొనీ మాడ్యూల్ ద్వారా ఆ నలుగురు బయటకు వచ్చి స్పేస్ ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌ను అధిరోహిస్తారని తెలిపారు. కాలిఫోర్నియా సముద్ర తీరంలో దిగుతారని చెప్పారు. భారత కాలమానం ప్రకారమయితే మంగళవారం సాయంత్రం 3.00 గంటలకు భూమి మీదకు వస్తారని కేంద్ర శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన శాఖ మంత్రి జితేందర్ సింగ్ తెలిపారు.

అమ్మో పులి...!

- నివాస గృహాల సమీపంలోకి చిరుతలు
- హడలెత్తిపోతున్న పాలమూరు వీరన్నపేట వాసులు
- పట్టుకునేందుకు అధికారుల ప్రయత్నాలు విఫలం

మహబూబ్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పాలమూరు నగర ప్రజలను చిరుత పులులు హడలెత్తిస్తున్నాయి. ఇన్నాళ్లూ ఒకే చిరుత కనిపించగా, ఆదివారం ఒకేసారి రెండు కనిపించడం.. అవి కూడా నివాస గృహాల సమీపంలోకి రావడంతో బెంబేలెత్తిపోతున్నారు. పాలమూరులోని వీరన్నపేట పక్కనే ఉన్న సక్కనిరాయి గుట్టపై ఓ చిరుత రెండ్రోజుల పాటు ప్రజలకు కనిపించింది. అధికారులు దాన్ని పట్టుకునేందుకు అడవిలో బోను, సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. ఒక చిరుతతోనే జనం భయపడుతుండగా ఆదివారం రెండు చిరుతలు టీడీగుట్ట అటవీప్రాంతం నుంచి ఇళ్ల సమీపం వరకు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. జనం అలికిడితో అవి వెనుదిరిగి కొండపైకి వెళ్లిపోయాయి. ఈ విషయాన్ని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పోలీసులు, అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. చిరుతల ఆనవాళ్లేమీ కనిపించలేదని వారు తెలిపారు. రెండు చిరుతలను తాము చూసినట్లు స్థానికులు చెబుతుం



డగా, అటవీశాఖ అధికారులు మాత్రం ఒకే చిరుత ఉందని, చిరుత పిల్లలు కూడా లేవని చెబుతున్నారు. కాగా, చిరుత ఆచూకీ కోసం అడవిలో బోను ఏర్పాటు చేయడంతో పాటు 5 సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమేరాల ఫుటేజీలో ఎలాంటి దృశ్యాలు నమోదు కాలేదు. డ్రోన్ విజువల్స్ సేకరించినా చిరుతల సంచారం కనిపించలేదు. అయితే అడవికి సమీపంలో ఉండే వీరన్నపేట, టీడీగుట్ట ప్రాంతాల ప్రజలు మాత్రం భయపడుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని, ఆందోళన చెందవద్దని ప్రజలకు అధికారులు సూచిస్తున్నారు. పులి కనిపించినప్పుడు అధికారులు వచ్చి హడావిడి చేస్తున్నారని, ఆ తర్వాత పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పదేళ్లు పాలించినోళ్లు ఒక్క కార్డూ ఇవ్వలేదు

- నేడు 3.54 లక్షల రేషన్ కార్డుల పంపిణీ : పొంగులేటి



నేలకొండపల్లి/హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 3.54 లక్షల మందికి రేషన్ కార్డులను అందిస్తున్నామని, సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సుర్దేపల్లి గ్రామంలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులు మాటలతో కాలయాపన చేశారే తప్ప.. ఒక్క రేషన్ కార్డును కూడా ఇవ్వలేదన్నారు. నాలుగు విడతల్లో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు.

పాలేరు సాగర్ యూటీ నుంచి నేడు నీరు విడుదల

ఖమ్మం జిల్లా పాలేరులోని సాగర్ ఎడమ ప్రధాన కాల్వ అండర్ టన్నెల్ (యూటీ) నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. సోమవారం నుంచి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, ఉదయం 10 గంటలకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం జుజ్జులరావుపేటలో జరుగుతున్న పాలేరు సాగర్ కాల్వ పనులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

బోనమెత్తిన భాగ్యనగరం

హైదరాబాద్‌లో బోనాల శోభ.. భక్త జనసంద్రమైన లష్కర్

- మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి
- గోల్కొండ కోటలో ఘనంగా 6వ బోనం

హైదరాబాద్ సిటీ, సికింద్రాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు ఆదివారం బోనాల శోభతో కళకళలాడాయి. సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో లష్కర్ బోనాల జాతర ఆదివారం ప్రారంభమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం 11.32 గంటలకు మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రేవంత్‌ను అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించారు. అంతకుముందు తెల్లవారుజామున 4 గంటలకు మంత్రి పొన్నంప్రభాకర్ అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. బోనాల సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు, శివసత్తులు, జోగినీలు.. బోనాలు, తొట్టెలు, ఒడి బియ్యం సమర్పిస్తూ అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, దానం నాగేందర్, చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖరరెడ్డి, ముఠా గోపాల్, శ్రీగణేష్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ శైలజా రామయ్యార్, కలెక్టర్ దాసరి హరిచందన, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఉజ్జయినీ మహాకాళి ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే.. గోల్కొండ కోటలోని జగదాంబిక మహాకాళి అమ్మవారి ఆరో బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. వేల సంఖ్యలో భక్తులు అమ్మవారికి బోనాలను, తొట్టెలను సమర్పించారు. మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో, శంబీపూర్‌లో, దుండిగల్‌లోని దుర్గాదేవి గుడిలో బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ముషీరాబాద్‌లోని మహాకాళి ఆలయంలో మొదటి బోనం సమర్పించారు. తాళ్లబస్తీలోని నల్లపోచమ్మ మహంకాళి దేవాలయాలతోపాటు పలు ఆలయాల్లో బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి.



మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో పొంగులేటి, సురేఖ



మహంకాళి అమ్మవారి దర్శనానికి వస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దంపతులు

సీఎం, మంత్రులు, నేతలకు పొన్నం విందు



హైదరాబాద్/బంజారాహిల్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉజ్జయినీ మహంకాళి బోనాల సందర్భంగా ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్.. తన అధికార నివాసంలో విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌కు తన కుటుంబ సభ్యులను పొన్నం పరిచయం చేశారు.

నేటి నుంచే కొత్త రేషన్‌కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేశారు. భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రేషన్‌కార్డుల పంపిణీ, బహిరంగ సభ నేపథ్యంలో ఆదివారం సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ భేటీ అయి చర్చించారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరుమలగిరిలోని సభా ప్రాంగణానికి చేరుకుంటారు. తొలుత కొత్త రేషన్‌కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సభలో ప్రసంగిస్తారు. తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో బహిరంగ సభకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. 11 చోట్ల పార్కింగ్‌ను సిద్ధం చేశారు. ఈ సభ కోసం కాంగ్రెస్ నేతలు భారీగా జన సమీకరణ చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలుతోపాటు మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులను తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిసింది. రేవంత్ సీఎం హోదాలో తొలిసారి సూర్యాపేట జిల్లాకు, తుంగతుర్తి నియోజకవర్గానికి వస్తుండటంతో ఆ ప్రాంతానికి ప్రత్యేకంగా నిధులు, వరాలు ఏమైనా ఇస్తారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తుంగతుర్తిలో జూనియర్ కళాశాలకు భవన నిర్మాణం, వెలుగుపల్లి రుద్రమ్మ చెరువు రిజర్వాయర్‌గా మార్పు, కాల్వలు నిర్మించి దేవాదుల నీటి సరఫరా, డిగ్రీ కళాశాల, ఫైర్‌స్టేషన్, బస్‌డిపో, 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎంఎస్ స్వామినాథన్ శత జయంతికి రూ. 100 నాణెం

న్యూఢిల్లీ: ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, భారతరత్న ప్రొఫెసర్ ఎం.ఎస్ స్వామినాథన్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఓ ప్రత్యేక నాణెం విడుదల చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. రూ.100 విలువ గల నాణెం విడుదల చేస్తూ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ప్రత్యేక నాణెం 44 మిల్లీ మీటర్ల చుట్టు కొలతతో, 35 గ్రాముల బరువుతో ఉంటుంది. ఇది 50 శాతం వెండి, 40శాతం రాగి, 5శాతం నికెల్, 5 శాతం జింక్ మిశ్రమాలతో తయారైంది. అధిక దిగుబడినిచ్చే వంగడాలను ప్రవేశ పెట్టడంలో స్వామినాథన్ చేసిన కృషి కారణంగా దేశం ఆహారోత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించగలిగింది.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



మంచిర్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క తెలిపారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డ్వాక్రా సంఘాలను పూర్తిగా గాలికి వదిలేశారని, మహిళా సంఘాలను మహాలక్ష్మిగా భావించి కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందిస్తోందని అన్నారు. మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఆయన ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. దండేపల్లి మండలం రెబ్బనపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి మాట్లాడారు. రూ. 21,630 కోట్లతో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందజేస్తున్నామని, ప్రతి నెలా 12 నుంచి 25 తేదీ వరకు క్రమం తప్పకుండా మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మూల కారణమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఒక ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టును తిరిగి ప్రారంభించి రైతులకు సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు.

పాలన అంటే శంకుస్థాపనలే కాదు : కేటీఆర్

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పరిపాలన అంటే కేవలం శంకుస్థాపనలు చేయడం మాత్రమే కాదని, అభివృద్ధి, ప్రగతి అంటే రాజకీయ హంగులు ఆర్భాటాలు కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ దూరదృష్టి ఫలితంగా ఈనాడు తెలంగాణ రెండు అద్భుత ఫలితాలను సాధించిందని చెప్పారు. ఒకటి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయితే, రెండవది యాదాద్రి థర్మల్ ప్లాంట్ అని తెలిపారు. సీతారామ ద్వారా ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందుతుందన్నారు. దామరచర్ల అల్ట్రా మెగా థర్మల్ ప్లాంట్‌లోని యూనిట్ వన్ 72 గంటల కోడ్(సీఓడీ)ను విజయవంతంగా పూర్తి చేసిందని తెలిపారు. ఈమేరకు కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

కాళేశ్వరాన్ని కేసీఆర్‌కు అప్పగిస్తే మూడు రోజుల్లో సాగునీరు

- మాజీ మంత్రిజగదీశ్ రెడ్డి

గోదావరిఖని, జూలై 13 (ఆంధ్రజ్యోతి): "కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ చేతకాని రేవంత్ సర్కార్.. రైతాంగానికి నీళ్లు ఇవ్వలేకపోతున్నది. ప్రాజెక్టు నిర్వహణను కేసీఆర్‌కు అప్పగిస్తే మూడు రోజుల్లో ప్రతి ఎకరాకు నీళ్లు ఇచ్చి చూపిస్తారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు సాగి సుభిక్షంగా ఉంటే.. రేవంత్ పాలనలో రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తోంది" అని మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

చామల.. వార్డు మెంబర్‌కు ఎక్కువ, ఎంపీకి తక్కువ!

- బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): చామల కిరణ్ కుమార్ రెడ్డి వార్డు మెంబెర్‌కు ఎక్కువ, ఎంపీకి తక్కువని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. నోరు తెరిస్తే బూతులే మాట్లాడుతున్నారని, గాంధీ భవన్‌ను గలీజ్ భవన్‌గా మార్చారని ఆయన ఆరోపించారు. కోదండరాం, ఆకునూరి మురళి.. కాంగ్రెస్ నేతలకు జ్ఞానం నేర్పాలన్నారు.

టార్గెట్ @ 80 కి.మీ

- ఏటీఏజీఎస్ గన్స్ సామర్థ్యం పెంపు
- ఏడాదిన్నరలో భారత సైన్యం చెంతకు అప్‌గ్రేడ్ చేస్తున్న డీఆర్‌డీవో

న్యూఢిల్లీ, జూలై 13: భారత సైన్యం అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. భారత రక్షణ పరిశోధన సంస్థ(డీఆర్‌డీవో) అప్‌గ్రేడ్ చేస్తున్న అడ్వాన్స్‌డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్(ఏటీఏజీఎస్) 80 కిలోమీటర్ల లక్ష్యాన్ని ఛేదించగలదు. ప్రస్తుతం భారత సైన్యం వద్ద ఏటీఏజీఎస్ ఉన్నా.. అవి 48 కిలోమీటర్ల లక్ష్యాన్ని మాత్రమే తాకగలవు. వీటి సామర్థ్యాన్ని డీఆర్‌డీవో పరిధిలోని ఏఆర్‌డీఈ విభాగం మెరుగుపరుస్తోంది. అంటే.. 155 ఎంఎం తూటాలను ఈ వ్యవస్థ స్మార్ట్‌గా వినియోగించగలదు. నావిక్ నావిగేషన్ మార్గదర్శనంలో.. ఏటీఏజీఎస్ ద్వారా లేజర్ గైడెడ్ షెల్స్‌ను ప్రయోగించవచ్చు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉందని ఏటీఏజీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్పీ పాండే వెల్లడించారు. మరో ఏడాది లేదా ఏడాదిన్నరలో ఇవి పూర్తవుతాయని, నావిక్, లేజర్ గైడెడ్ షెల్స్‌తో పనిచేసేలా ఏటీఏజీఎస్‌ను అభివృద్ధిచేయడానికి నాలుగైదు సంవత్సరాలు పట్టవచ్చని వివరించారు. కాగా.. రామ్‌జెట్ తరహాలో గైడెడ్ షెల్స్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పాండే వెల్లడించారు. ఈ షెల్స్‌ను ఏటీఏజీఎస్‌తో పాటు.. హౌబిట్జ్ ఎఫ్‌హెచ్77, ధనుష్, కే9 వజ్ర-టీ వంటి 155 ఎంఎం ఆర్టిలరీ వ్యవస్థల నుంచి ప్రయోగించేలా రూపొందిస్తున్నామన్నారు.

రేపు హస్తినకు సీఎం రేవంత్

- పీవీ సంస్మరణ సభలో పాల్గొనే అవకాశం
- ఏపీ సీఎం చంద్రబాబుతో వేదిక పంచుకోనున్న రేవంత్

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ఖరారైనట్టు తెలిసింది. మంగళవారం (15న) మధ్యాహ్నమే ఆయన ఢిల్లీ వెళతారని.. 16, 17 తేదీల్లోనూ అక్కడే ఉంటారని సమాచారం. బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలవడంతో పాటు పార్టీ అధిష్ఠానంతో భేటీకానున్నట్టు తెలిసింది. 15న సాయంత్రం ఢిల్లీలో జరిగే మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ సభలో సీఎం పాల్గొనే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఏపీ సీఎం చంద్రబాబు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో.. ఇరు తెలుగు రాష్ట్రాల సీఎంలు ఒకే వేదికను పంచుకునే అవకాశం ఉంది.

స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలి

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సూచన
- నేడు నల్గొండ, రేపు సూర్యాపేట జిల్లాల్లో పర్యటన



రాంనగర్/హైదరాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సూచించారు. బీజేపీ సిద్ధాంతాలు, మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఆదివారం బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో రాంచందర్‌రావును ఆయన నివాసంలో శాలువాకప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు తగిన ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. కాగా, ఆయన సోమవారం నుంచి రెండు రోజులపాటు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు నల్గొండలో వివిధ సంఘాలు, న్యాయవాదులు, వైద్యులతో, అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సూర్యాపేటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అక్కడ పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. రాత్రికి ఆయన స్వగ్రామం కోదాడ నియోజకవర్గంలోని నల్లబండగూడెంలో బస చేస్తారు. మంగళవారం అక్కడ రైతులతో సమావేశమవుతారు. ఉదయం 10 గంటలకు కోదాడలో రైతులతో, మధ్యాహ్నం 1.30గంటలకు చౌటుప్పల్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించే సమావేశాల్లో పాల్గొంటారు.

రాష్ట్రంలో బీసీల రాజకీయ శకం

- 42 శాతం రిజర్వేషన్లకు అడ్డొస్తే సహించం: జాజుల
- భద్రాచలంలో బీసీల సమర శంఖారావం సభ

భద్రాచలం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మెజారిటీ జనాభా ఉన్న బీసీల రాజకీయ శకం ఆరంభమైందని.. రాబోయేది బీసీ రాజ్యమేనని, దాన్ని ఇక ఎవరూ ఆపలేరని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం సాయంత్రం భద్రాచలంలో జరిగిన బీసీల సమర శంఖారావం సభకు హాజరైన ఆయన మాట్లాడారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం దక్కడం లేదని, 60 మంది ఎమ్మెల్యేలు ఉండాల్సిన చోట 18 మంది కూడా లేకపోవడం, అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఒక్క బీసీ ఎమ్మెల్యే, ఎంపీ కూడా లేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వాటా దక్కేంత వరకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు రాజకీయ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీల రిజర్వేషన్‌కు ఎవరు అడ్డొచ్చినా తొక్కుకుంటూ పోతామని హెచ్చరించారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. బీసీలకు తాను అండగా ఉంటానని, రాజకీయ ఎదుగుదలకు సహకరిస్తానన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'విద్య'కు రూ.15,396 కోట్ల రుణం!

(మొదటి పేజీ తరువాయి)

తెలిసింది. ఇందులో యంగ్ ఇండియా గురుకులాల కోసం ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) నుంచి రూ.5వేల కోట్లు... పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) నుంచి రూ.10,396 కోట్లు సేకరించేందుకు చర్యలు చేపట్టింది. ఈ రుణాల సేకరణకు సంబంధించి ఇప్పటికే విదేశాంగ శాఖ, నీతి ఆయోగ్‌లతో ఇప్పటికే చర్చలు జరిపింది. అనుమతుల విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరింది. గురుకులాల కోసం ఏడీబీ నుంచి తీసుకోబోయే రూ.5వేల కోట్ల రుణానికి సంబంధించి ప్రాథమిక ప్రక్రియ పూర్తయినట్టు తెలిసింది. ఇక రూ.10,396 కోట్ల రుణం ఇచ్చేందుకు ఏఐఐబీ ఆసక్తి వ్యక్తం చేసినా, మిగతా అంశాలపై చర్చలు జరగాల్సి ఉందని సమాచారం. ఈ రుణాలకు సంబంధించి బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వమే గ్యారెంటర్‌గా ఉండనున్నట్టు తెలిసింది. ఈ విషయంపైనే విదేశాంగ శాఖతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చర్చలు జరిపిందని అధికార వర్గాలు తెలిపాయి.

కేజీబీవీలు, ఇతర పాఠశాలల అభివృద్ధి కోసం..

రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఏఐఐబీ నుంచి రూ.10,396 కోట్లు రుణం తీసుకోవాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. ఏఐఐబీతో ప్రాథమిక చర్చలు జరిగాయని, త్వరలోనే స్పష్టత వస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.



భారీగా తీసుకోనున్న ఈ రుణంతో ఏయే పనులు చేయాలనేదానిపై సర్కారు ఇప్పటికే కసరత్తు చేసింది. రాష్ట్రంలోని 495 కేజీబీవీలలో అవసరాలను బట్టి రెండు విభాగాలు చేసింది. ఒక విభాగంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవసరమైన డార్మిటరీలు, ఇతర సదుపాయాలను ఏర్పాటు చేయనుంది. రెండో విభాగంలో గ్రంథాలయాల ఏర్పాటు, తరగతి గదుల నిర్మాణం, పాత వాటికి మరమ్మతులు చేపట్టనుంది. ఈ పనులకు సుమారు రూ.2,800 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. ఇక రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లను కూడా 1 నుంచి 6 తరగతి వరకు ఒక గ్రూపుగా, ఆపై రెండో గ్రూపుగా విభజించారు. మొదటి గ్రూప్‌లో ఇంగ్లిష్ మీడియం క్లాసుల ఉన్నతీకరణ, ఇతర పనులను.. రెండో గ్రూపులో తరగతి గదుల నిర్మాణంతో పాటు మరికొన్ని సదుపాయాలను కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.2వేల కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేశారు. కొత్తగా తలపెట్టిన పూర్వ ప్రాథమిక (ప్రీ-ప్రైమరీ) పాఠశాలలకు సుమారు రూ.3వేల కోట్లు అవసరమని భావిస్తున్నారు. మిగతా నిధులతో జిల్లా పరిషత్ బడుల్లో మరుగుదొడ్లు, తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు వంటివి చేపడతారు. దాదాపు 20 వేల బడుల్లో ఇలాంటి పనులు చేయాల్సి ఉందని అంచనా వేశారు.

హబ్ అండ్ స్పోక్ కేంద్రాలుగా..

రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణానికి రూ.21వేల కోట్లు ఖర్చవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటి వరకు 78 గురుకులాలను మంజూరు చేయగా.. 76 చోట్ల నిర్మాణాలకు టెండర్లను ఆహ్వానించారు. వీటి నిర్మాణానికి రూ.15,200 కోట్లు అవసరమని అంచనా. ఇందులో తొలిదశ కింద ఏడీబీ నుంచి రూ.5వేల కోట్లు రుణం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్మాణాలకు రూ.3 వేల కోట్లు, విద్యార్థులకు బోధన, టీచర్లకు శిక్షణ సదుపాయాల కల్పన తదితర అంశాల కోసం రూ.2 వేల కోట్లు అవసరమని ఏడీబీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు అందజేసింది. ఇక యంగ్ ఇండియా గురుకులాలను 'హబ్ అండ్ స్పోక్'గా కేంద్రాలుగా సిద్ధం చేసి.. ఇతర పాఠశాలల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు కూడా ఇది ఉపయుక్తంగా ఉంటుందని.. రుణం కోసం ఏడీబీకి ఇచ్చిన ప్రతిపాదనల్లో పేర్కొన్న లక్ష్యం కూడా నెరవేరుతుందని సర్కారు భావిస్తోంది.

ఓరుగల్లుపై కాంగ్రెస్ ముఖ్య నేతల భేటీ

- స్థానిక ఎన్నికల వ్యూహాలపైనా చర్చ
- ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి అధ్యక్షతన సమావేశం
- హాజరైన మంత్రులు సీతక్క కొండా సురేఖ



భేటీలో మంత్రులు అడ్లూరి, కొండా సురేఖ, సీతక్క, పార్టీ ఎమ్మెల్యేలు

హైదరాబాద్/హనుమకొండ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంపై ఆ పార్టీ ముఖ్య నేతలు గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. ఆదివారం ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపైనా చర్చించారు. భేటీ అనంతరం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ.. సంస్థాగతంగా పార్టీ బలోపేతం, నామినేటెడ్ పోస్టుల భర్తీపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఆయా అంశాలపైన వరంగల్ జిల్లా నేతల అభిప్రాయ సేకరణ జరిగిందన్నారు. నేతల మధ్య భేదాభిప్రాయాలు, క్రమశిక్షణ చర్యల వంటి వాటిపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. కాగా, తెలంగాణ సర్వోదయ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు-స్వదేశీ మేళా గాంధీభవన్‌లో జరిగింది. ఇందులో భాగంగా మహాత్మా గాంధీ విగ్రహాలు, చరఖాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. మంత్రి సీతక్క, డిప్యూటీ స్పీకర్ రాంచందర్ నాయక్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, గిరిజన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యానాయక్ తదితరులు ప్రదర్శనను తిలకించారు. మహాత్ముడి విగ్రహానికి నివాళులర్పించారు.

ఇంద్రగంటి శ్రీకాంత శర్మ పురస్కారం

2025వ సంవత్సరానికి 'ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సాహితీ పురస్కారం' ప్రముఖ కవి విన్నకోట రవి శంకర్‌కి ఇస్తున్నాం. 2020లో ప్రారంభమైన ఈ పురస్కారానికి రవి శంకర్ ఆరవ గ్రహీత. అవార్డు ప్రదానోత్సవ తేదీ, వేదికల వివరాలను త్వరలో తెలియజేస్తాం.

పురస్కార కమిటీ

ముంజూరు కళింగాంధ్ర కవితా వార్షిక

సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో 'ముంజూరు' కళింగాంధ్ర కవితా వార్షిక 2024 గ్రంథాన్ని శ్రీకాకుళం జిల్లా పలాస మండలం హరిపురం గ్రామంలో జులై 18న ఆవిష్కరించనున్నారు. నల్లి ధర్మారావు, దుప్పల రవికుమార్, వినోద్ కుత్తుం, సాంబమూర్తి లండ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 99892 65444.

సిక్కోలు బుక్స్

'కున్నెమ్మ, మరికొన్ని కథలు'

రాజాం రచయితల వేదిక 126వ సాహిత్య సభ జూలై 20న శ్రీవిద్యానికేతన్ పాఠశాల, రాజాం, విజయనగరం జిల్లాలో జరుగుతుంది. ఈ సభలో ప్రొ.కాశీం 'సమాజం–సాహిత్యం–సాంస్కృతిక చైతన్యం' అంశంపై ఉపన్యాసం ఇస్తారు. ఇదే సభలో బాలసుధాకర్ మౌళి కథా సంపుటి 'కున్నెమ్మ – మరికొన్ని కథలు' పుస్తకాన్ని గార రవిప్రసాద్, గార సూర్య శైలజ ఆవిష్కరిస్తారు. సభలో అట్టాడ అప్పల్నాయుడు, గంటేడ గౌరునాయుడు పాల్గొంటారు.

పిల్లా తిరుపతిరావు

చోడగిరి చంద్రరావు కవిత్వం

కోయి కోటేశ్వరరావు సంపాదకత్వం వహించిన 'భీమకవి' చోడగిరిచంద్రరావు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ సభ జూలై 20 ఉ.10 గంటలకు యూ.టి.ఎఫ్ బిల్డింగ్, కాకినాడలో జరుగుతుంది. అధ్యక్షత నేలపూడి బాలరాజు, ఆవిష్కర్త పొనుగుమట్ల విష్ణుమూర్తి, ముఖ్య అతిథి కోరుకొండ బాబ్జీ, విశిష్ట అతిథులు శిఖామణి, జి లక్ష్మీనరసయ్య, చోడగిరి లలితాదేవి, బండి సత్యనారాయణ, కొబ్బరాకు సుధాకర్, అద్దేపల్లి ప్రభు, మాకివీడి సూర్యభాస్కర్ తదితరులు.

సవిలే రాజేష్

'ప్రణామం' కవి సమ్మేళనం

మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో 'ప్రణామం' కవి సమ్మేళనం జులై 20ఉ.10 గంటలకు విజయవాడ బందర్ రోడ్డులో అంబేడ్కర్ స్మృతివనం ఆవరణలో జరుగుతుంది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు భాష, సామాజిక న్యాయం, దేశభక్తి, శాంతి, పర్యావరణం అంశాలపై తమ కవితల్ని వినిపిస్తారు. వివరాలకు 92464 15150.

కలిమిశ్రీ

'విరిజల్లులు' కార్టూన్ల సంకలనం

విశాలాక్షి సాహిత్య మాసపత్రిక నిర్వహించిన జాతీయ స్థాయి కార్టూన్ పోటీలలో వచ్చిన కార్టూన్లతో రూపొందించిన 'విరిజల్లులు' కార్టూన్ సంకలనం ఆవిష్కరణ జూలై 20న నెల్లూరు టౌన్ హాల్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త మండలి బుద్ధప్రసాద్. ఇదే సభలో వివిధ రంగాలలో సాహితీ కృషి చేస్తున్న జీవి పూర్ణచంద్, సంధ్యా శర్మ, ఆత్మకూరు రామకృష్ణ, శ్రీనాథ్ రెడ్డి, వడలి రాధాకృష్ణ, రాయసం దామోదర్ లను విశాలాక్షి పురస్కారాలతో సత్కరిస్తారు.

ఈతకోట సుబ్బారావు

బొమ్మలు: అక్బర్

శతజయంతి ఉత్సవాల సందడేదీ!

తెలుగు మాట వినిపిస్తేనే ఒంటిపై తేళ్ళు పాకినట్లుగా వ్యవహరించిన మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ను ముక్కుసూటిగా "ఓ నిజాము పిశాచమా! కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని" అని ధిక్కరించినవాడు దాశరథి! "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" అని గురజాడ చెప్పిన స్థాయిలో– "ఘోర గహనాటడవులన్ వడగొట్టి, మంచి మాగాణములన్ సృజించి, యముకల్ నుసి చేసి, పొలాలు దున్ని, భోషాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే, తెలంగాణ రైతుదే" అన్నాడు. "ముసలి నక్కకు రాచరికంబు దక్కునే" అని ముష్కర నవాబును ఎదిరించిన కవికి ఎన్ని గుండెలు ఉండాలి.

అలాంటి ప్రజాకవి దాశరథి శతజయంతి ఈ నెల 22వ తేదీన జరగనున్నది. హైదరాబాద్ రాజ్యాన్ని పాలించిన కుటిలమైన రాజుపై క్షేత్రంలో నిలబడి, సామాజిక ఆర్థిక అంశాలు ప్రస్తావిస్తూ, జనసామాన్యాన్ని చైతన్యపరుస్తూ, విప్లవాత్మకంగా పోరాటం చేసిన కవులు తెలుగు సాహితీలోకంలో దాశరథి మినహా మరొకరు లేరు. నిజాం రాజు దుష్టపాలనను ఎత్తిచూపుతూ కవితలు చెప్పటం ఏదో ఒక ఎయిర్ కండీషన్డ్ గదిలో కూర్చుని సినిమా పాటలు రాసినంత, కార్యాచరణ చేతగానివారు శ్రీరంగనీతులు బోధించినంత సులభం కాదు.

దాశరథి కవితలోని చరణం – "నా తెలంగాణ కోటిరత్నాల వీణ" అన్నది తెలంగాణ రాష్ట్ర పోరాటవీరులకు నినాదమైందన్న విషయం విస్మరించరానిది. అది ఏకవాక్యమైనా ప్రత్యేకమైనది, పసందైనది, పండిన కవితకు పరాకాష్ఠ అయింది. కాబట్టి గత ప్రభుత్వం ఆయన స్మృతిని గౌరవించక తప్పలేదు. అయితే ఏటేటా ఆయన స్మారకార్థం ఒక వర్థమాన కవికి పురస్కారం ప్రదానం చేసినంత మాత్రాన ఆయన టీఆర్ఎస్ పార్టీ చెందినవాడైపోడు! పైగా కేసీఆర్ నిజాంను దేవుడులా కొలిస్తే, దాశరథి నిజాంను 'పిశాచి'గా అభివర్ణిస్తూ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిన దేశాభిమాని, ఆత్మాభిమాని మరి.

వాస్తవానికి దాశరథి ఒక జాతీయకవి. కాబట్టే జలగం వెంగళరావు హయాంలో వారిని ఆస్థానకవిగా నియమించి గౌరవించారు. కానీ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్.టి. రామారావు అర్థాంతరంగా ఆయనను ఆ పదవి నుంచి తొలగించారు. అసలు దాశరథి ఎవరో, ఏమిటో ప్రభుత్వాధినేత అర్థం చేసుకుని ఉంటే, ఆయనకు మరొక పదవి కట్టబెట్టి ఆస్థాన కవి పదవి రద్దు చేసేవాడు. ఇలా ఆస్థాన పదవులను నియమించే సంప్రదాయం బ్రిటన్‌లో మూడు వందల సంవత్సరాలుగా కొనసాగుతున్నది. అక్కడ రాజరికం ఉన్నప్పుడూ ఉంది, ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాతా ఉంది. ఆస్థాన కవి పదవి ప్రజాస్వామ్య విరుద్ధమని, రాచమర్యాద అని ఎవరైనా అంటే అంతకన్నా అజ్ఞానం ఉండదు. రెండు వందల సంవత్సరాల పైచిలుకుగా ప్రజాస్వామ్యంగా వర్ధిల్లుతున్న అమెరికా సంయుక్త రాష్ట్రాలలో– దాశరథి ఆస్థానకవిగా కొనసాగిన సమయంలోనే– 19 రాష్ట్రాలలో ఆస్థానకవులు ఉన్నారు. సోషలిస్టు దేశాలలో చూస్తే– తజికిస్తాన్ రాష్ట్రానికి మిర్జో తుర్సునజోదా ఆస్థానకవి. ఇలా ఎన్నో ఉదాహరణలను చూపించవచ్చు.

జాతీయ కవి స్థాయికి అర్హత గల కవిత్వం ఎంతో రాశారు దాశరథి. స్వాతంత్ర్య సమరగీతాలు, జయభారతీ అంటూ దేశభక్తి పొంగిపొర్లే పద్యాలు రాసారు. "జండా ఒక్కటె మూడు వన్నెలది; దేశంబొక్కటే భారతాఖండాసేతు హిమాచలోర్వర; కవీట్కాండమ్ములోనన్ రవీంద్రుండొక్కండె కవీంద్రుండు; ఊర్జిత జగద్యుద్ధాలలో



శాంతికోదండోద్యద్విజయుండు గాంధి ఒకడే, తల్లీ! మహాభారతీ!" అని శిలాక్షరాల్లాంటి పద్యాలెన్నో పాడారు. అందుకే ఆ రోజుల్లో విజ్ఞులైన రాజకీయవేత్తలు – సర్వేపల్లి రాధాకృష్ణన్, బూర్గుల రామకృష్ణరావు, పి.వి. నరసింహారావు, బెజవాడ గోపాలరెడ్డి, మర్రి చెన్నారెడ్డి లాంటి వారు మహానుభావులు దాశరథిని ఎంతో అభిమానించారు, గౌరవించారు.

పశ్చిమబెంగాల్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో మంత్రులకే కాదు శాసనసభ్యులకు కూడా వారి మాతృభాష పట్ల, సాహిత్యం పట్ల, సంస్కృతి పట్ల అపారమైన అభిమానం. బెంగాలీలు జాతీయకవిగా గౌరవించే రవీంద్రనాథ్ ఠాగూర్‌కు, తమిళులు దేశీ కవిగా నెత్తిన పెట్టుకొనే సుబ్రహ్మణ్యభారతికి, కన్నడిగులు రాష్ట్రకవిగా కొలిచే కె.వి. పుట్టప్పలకు ఏమాత్రం తీసిపోకుండా జగత్ కళ్యాణం కోసం అచంచల విశ్వాసంతో దేశభక్తి గీతాలను, అక్షర లక్షలు చేసే అభ్యుదయ కవితలను, ఏ ఇజాల జోలికి పోకుండా మానవతా దృష్టితో పలికిన వైతాళికుడు దాశరథి. అదేమి విచిత్రమో గాని తెలంగాణ లోని రాజకీయనాయకులకు ఆ పరంపర సంక్రమించలేదు.

దాశరథి శతజయంతి ఉత్సవాలు తెలంగాణలోని ప్రతిజిల్లాలో ఘనంగా, స్ఫూర్తిదాయకంగా నిర్వహించవలసిన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంకా కిమ్మనకుండా కూర్చోవడం విచారకరం. తెలంగాణకు పేరుకు సాహిత్య అకాడమీ, సాంస్కృతికశాఖ ఉన్నాయి. కాని ఇలాంటి అంశాలలో అవి అంటీముట్టనట్టుగా ఉన్నాయి. వాస్తవానికి ఈ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సాహిత్య అకాడమీకి రాష్ట్రమంతా వెతికినా సరైన అధ్యక్షుడు దొరకకపోవడం గమనించదగినది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి కనీసం సాంస్కృతిక సలహాదారు ఒకరు ఉన్నా గుడ్డికన్నా మెల్లలా ఉండేది.

> **దాశరథి శతజయంతి ఉత్సవాలు తెలంగాణ లోని ప్రతి జిల్లాలో ఘనంగా, స్ఫూర్తిదాయకంగా నిర్వహించవలసిన తరుణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంకా కిమ్మనకుండా కూర్చోవడం విచారకరం. తెలంగాణకు పేరుకు సాహిత్య అకాడమీ, సాంస్కృతిక శాఖ ఉన్నాయి. కాని ఇలాంటి అంశాలలో అవి అంటీముట్టనట్టుగా ఉన్నాయి.**

ఈమధ్యే దక్షిణ భారత దేశంలోనే తొలుదొలుత జానపద సాహిత్యంపై పరిశోధన చేసి విశ్వవిద్యాలయాల్లో జానపద వాఙ్మయ, కళల ప్రవేశానికి ఆద్యుడైన బిరుదురాజు రామరాజు శతజయంతి జరిగింది. అంతకుముందు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఎంతగానో కృషిచేసిన దివాకర్ల వెంకట అవధాని శతజయంతి జరిగింది. ఇప్పుడు తెలంగాణ మహాకవి దాశరథి శతజయంతి వచ్చింది. శతజయంతి ఉత్సవాలను ఘనంగా, స్ఫూర్తిదాయకంగా నిర్వహించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏమీ పట్టనట్టు మీనమేషాలు లెక్కిస్తే కేంద్రసాహిత్య అకాడమీ రంగంలోకి దిగడం సంతోషమే. కానీ, వారు ఈ జయంతి ఉత్సవాలను "క్లాస్‌రూమ్" స్థాయి కార్యక్రమాలుగా చేసేసి, చేతులు దులుపుకోవడం తెలుగువారిని ఒకసారి ఆలోచించుకోవడానికి దోహదం చేసింది. ఈ దశ లోనూ మహాకవి దాశరథి శతజయంతి ఉత్సవాలు నిర్వహించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం క్రియాశూన్యంగా వ్యవహరిస్తున్నది. ఇంతకూ మన కాలం మహాకవి దాశరథి శతజయంతి ఉత్సవాలు ప్రభుత్వం జరపకుంటే జరగవా?

■ టి. ఉడయవర్లు
98856 86415



మళ్లీ కొలిమి

అవ్వా! గౌండ్లోల్ల భాగవ్వా!
కాయిపాయి కమ్మగ తింటనని
ఇల్లిడిసి ఊరిడిసి ఎగేసుకొచ్చిన్నని
అలిగి అరుగంచుకు కూసున్నవా!
బతుకు మెతుకు తల్లీ! అతుకు బతుకు

మామా! మాసుల్దారి మైసయ్యా!
కడుపు సలసల మసల్తుందిరా అయ్యా
ఇల్లిడిసి పల్లిడిసి శేనిడిసి శెల్కిడిసి
పిడికెడంటే పిడికెడే మెతుకులురా మామా
వందలు వందలు మందలు మందలు
లొందల బొందల బొందల లొందల
బతుకు బందీల వడ్లది మామా

బావా! నీరటి బాల్‌నర్సూ!
వరి కర్రలకు నీళ్ళు తాపుతున్నవా
వట వట కన్నీళ్ళు వడుపుతున్నవా
కట్ట కొమ్ముకు కూసోని
రాయిని చెర్వు మీద భగభగ మండుతున్నవా
మండకు తండ్రీ! పిండకు నాయినా!
కట్ట మైసమ్మ కన్ను తెరిచే ఉంది

పెద్దవ్వా! లేకి రాజవ్వా!
కల్లం అడుగులు మాయమాయెనని
మనాదిల పడకు పునాదిల పడకు
దిగులు పడకు మొగులు అయితది
లేకి బతుకు లేని మెతుకు
ఫికరు తప్ప ఫకరు కాదు
గోదుమకుంట ముత్యాలమ్మ పెద్ద పెద్ద జంగలతోని
సర్రాసుగ నీ ఇంట్లకే నడిచొస్తున్నది

బాపూ! పాండవ కతోల్ల పరంధాములూ!
నీ జీర గొంతు బీరి పోనియ్యకు నాయినా!
పంచ పాండవులు ఏమడుగుతున్నరు?
అయిదూళ్ళడుగుతున్నరా! అయిదు వేళ్ళడుగుతున్నరా!

చిచ్చా! మొల్ల సయ్యదూ!
మర్రి చెట్టెక్కిన దూది పీరి
మల్ల మసీదు ముందట దుంకిందట నిజమేనా!
ఎన్నడు కలువని పాత పీరి కొత్త పీరి
కలిసి సవారీ చేస్తున్నయట నువద్దిగనేనా!
కొంచెమంత ఊదు పోగేసి
నెమలీకల కట్టతోని నెత్తిమీద కొట్టురా అయ్యా!

అల్లుడా! మాదిగ కనుకయ్యా!
'లందల దాగున్న ఎల్లవ్వతల్లి ఏమంటున్నది
బైండ్ల మల్లన్న జమిడిక ఏం పాడుతున్నది
మత్త కొలిపిన మేకపిల్ల ఏమనుకుంటున్నది
సిద్ధులు యోగమడుగుతున్నరా! భోగమడుగుతున్నరా!

బామ్మర్దీ! పసులకాడి బాలయ్యా!
కాళ్ళకు బలపాలు కట్టినవా
కాటగలిసిన బైలిది మూటిల కలిసిందా!
పక్క పక్కలు నడిసే పయ్యది తొవ్వల వడ్డదా!
పసురాలకు పసరిక కంట్లెవడ్డదా
కంచెల తోలి పరాకత్‌గ కన్నుమలుపకురా అయ్యా!
బాహుబలులు బలి కోరుతై.

■ మద్దికుంట లక్ష్మణ్
✆ 94416 77373

"శిల్పం ఎలా ఉన్నా, చదివించే లక్షణం ముఖ్యం!"

– వేమూరి సత్యనారాయణ

వేమూరి సత్యనారాయణ (వేమూరి సత్యం) కథారచయితగా, సినీ రచయితగా ఎన్నదగిన కథలు రాశారు. 'జ్యోతి' మాసపత్రికకు ఎడిటర్‌గా పని చేస్తూ కొన్ని వందల కథలను ఎంపిక చేసి ప్రచురించారు. ఒకప్పుడు ఆంధ్ర దేశాన్ని ఉర్రూతలూగించిన 'మీరా' నవలా రచయిత్రి సత్యంగారి డిస్కవరీనే! అలాంటి సత్యంగారు ఇటీవల ఒక అరుదైన ఫీట్ చేశారు. తన ఎనభయ్ ఏళ్ళ వయసులో 'ఎనభయ్‌లో ఇరవై' అంటూ మొదటి కథాసంపుటిని ప్రచురించారు. ఈ సందర్భంగా ఆయనతో చిన్న సంభాషణ!



ఎనభయ్ ఏళ్ళ వయసులో మొదటి కథా సంపుటి! ఎలా ఉంది మీ అనుభూతి?

అనుభూతి ఆశించి పుస్తకం తీసుకురాలేదు. ఒక స్నేహితుడి ఆలోచన, నా శ్రీమతి ప్రోత్సాహంతో యాంత్రికంగానే మొదలుపెట్టి పుస్తకం తెచ్చాను. పుస్తకం వచ్చి మంచి అనుభూతిని మిగిల్చింది. చివరలో నా ఎనభై ఏళ్ళ ప్రయాణం పేరుతో రాసిన ఒక చిన్న వ్యాసం నా జీవితాన్ని క్లుప్తంగా రికార్డ్ చేసుకునే అవకాశాన్ని ఇచ్చింది. పుస్తకం మొదటి పరిచయ కార్యక్రమం కూడా నా 80వ పుట్టినరోజు వేడుకతో కలిపి కుటుంబ సభ్యుల మధ్య సాహితీ మిత్రుల మధ్య జరగడం దాదాపు ఆనందాశ్రువులు తెచ్చేంత అనుభూతినే మిగిల్చింది. ఐ యామ్ హాపీ!

ఈ పుస్తకంలో మొదటి కథను డెబ్బయ్యవ దశకంలో రాశారు. దాన్ని మళ్ళీ యాభయ్ ఏళ్ళ తరువాత 2024లో తిరగ రాశారు? ఈ కాలంలో రచయితగా మీలోను, మీ దృక్పథంలోను వచ్చిన మార్పును కథ తిరగ రాసినప్పుడు కథలో చోటు చేసుకోకుండా జాగ్రత్త పడ్డారు. దీని వలన మీరు సాధించిన అదనపు ప్రయోజనం ఏదయినా ఉన్నదా?

ఈ సంపుటి ప్రచురించే క్రమంలో నా మొదటి కథ గురించి ఆలోచించినప్పుడు నేను గ్రహించినది ఏమిటంటే, ఒక అనూహ్య సంఘటన నన్ను స్పందింప చేసి ఆ కథగా ఎవాల్వ్ అయింది అని. ఆ కథను రాసినప్పటి ప్రతి ఇప్పుడు లేకపోయినా నాకు స్పష్టంగా గుర్తుండటం వలన తిరగ రాయగలిగాను. ఆ కథ ఎలా వుండి ఉంటుందో జ్ఞాపకం చేసుకుని రాసాను. ఇలా ఎందుకు రాసాను అంటే అప్పటి నా స్పందనను, సంఘర్షణను శాశ్వతం చేసుకోవడానికే. బహుశా మొదటగా రాసి జాగ్రత్త పరచని ఆ కథ ఇప్పటి కథకి దగ్గర గానే ఉంటుంది అనుకుంటున్నాను. ఎందుకంటే నా స్వభావంలో ఎలాంటి మార్పు లేదు గనుక.

మీ కథలు కొన్ని ఓపెన్ ఎండెడ్‌గా ఉంటాయి. అలా ఉంచడం వలన పాఠకుడు తనకు కావలసిన ముగింపు ఏదో తాను వెతుక్కునే సౌలభ్యం ఉంటుంది. కానీ అలా ఓపెన్ ఎండెడ్‌గా వదిలేయడం రచయిత బలహీనత కాదా? తానేం చెప్పదలచుకున్నాడో అది స్పష్టంగా కథలో చెప్పాలి కదా?

ఓపెన్ ఎండెడ్‌గా ఉంచడం ఉంచకపోవడం అనేది ఒక కథ ముగింపుకి రచయిత ఎన్నుకునే వ్యూహం మీద ఆధారపడి ఉంటుంది. ఓపెన్ ఎండెడ్‌గా ఉంచకుండా రచయిత ముగింపు చెప్పినా ఆ ముగింపు నచ్చకపోతే పాఠకుడు తనకు నచ్చిన ముగింపు తాను రాసుకుంటాడు. మరెందుకు అలా ఓపెన్ ఎండెడ్‌గా ఉంచడం అంటే అది రచయిత నిర్ణయం.

మీరు కథ రాసే పద్ధతి?

కథకి సంబంధించిన ఆలోచన అనే మొలక మనసులో పడ్డాక నెమ్మది నెమ్మదిగా ఆకులు తొడుగుతూ, రెమ్మలుగా పెరుగుతూ వస్తుంది వస్తువు. అయితే నాకున్న ఒక ప్రత్యేకమైన అలవాటు వలన, అనుకున్న కథని రాయడానికి ముందే స్నేహితులకి, ఇంట్లో సభ్యులకి కథగా చెప్తాను. ఇలా ఒక నేరేషన్ నుంచి మరొక నేరేషన్ లోకి ప్రయాణించడంలో వాక్యాలు అలవోకగా వచ్చి చేరతాయి, పాత్రలు పుడతాయి, వస్తువు చివరకు ఒక కథగా ఎవాల్వ్ అవుతుంది. అలా ఎవాల్వ్ అయిన కథని రాసి పక్కన పడేసి మరో వారం తరువాత తీరికగా చదువుకుంటాను. లోపాలు సరి చేసుకుంటాను. ఆ తరువాత ఒకరికో ఇద్దరికో చూపించి అభిప్రాయం తీసుకుని మళ్ళీ తిరగ రాస్తాను. మూడోసారి రాసే వెర్షన్ ఫైనల్ కథగా పాఠకుడి ముందుకు వస్తుంది




కథలు సరే, నవల రాసే ఉద్దేశం ఉందా?

అంతకుముందు లేదు. ఇప్పుడు వుంది. యెస్! నా జీవితం, నా అనుభవాలు, నా పోరాటాలు, నా ఆనందాలు, దుఃఖాలు, వీటితో పాటుగా నా జీవితం లోని కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులు, అందరినీ తలచుకుని, ఆ బంధాల మధ్య ఉన్న ఆరోహణా అవరోహణలు అన్నీ గుదిగుచ్చి ఒక నవలగా తేవచ్చేమో! కొంత వాస్తవమూ, కొంత కల్పనా కలిపి నవల రాయగలనేమో! చూడాలి.

ఈ తరానికి మీరిచ్చే సలహా?

ప్రత్యేకంగా ఏమీ లేదు. రాయాలనుకున్నపుడు రాయండి. రాసిన వాటి గురించి మిత్రుల తోనూ, మీ ముందుతరం రచయితలతోనూ చర్చించండి. శిల్పం ఎలా ఉన్నా కథకి చదివించే లక్షణం ముఖ్యం అని నేను నమ్మి చెపుతున్నాను. అలా కాకుండా మరోలా రాసి మెప్పించగల ప్రతిభ మీలో ఉంటే రాయండి. అంతా మీ ప్రతిభ మీద ఆధారపడి ఉంటుంది. ఎంత రాసినా, ఎలా రాసినా చదవడం మాత్రం ఆపొద్దు. నిరంతర పఠనం మిమ్మల్ని పుటం పెడుతుంది.

ఇంటర్వ్యూ **■ వంశీకృష్ణ**



మంచు కరుగుతున్నపుడు...

విగత కాంతి స్ఫురణలా
పాత పరిచయమొకటి

కాకి ఎంగిలిగా పంచుకున్న
కొన్ని ఇష్ట క్షణాల రుచి

మేఘమల్హారానికి అశ్రువృష్టి
ఇదో నిస్తంత్రీ సంవాదం

చపల చెమరింతతో
ఉప్పు పట్టిన వాక్యమొకటి

ఉండుండి వీచే
వెక్కిళ్ళ, నిట్టూర్పుల గాలి

శీతల శ్యామవర్ణపు జర
దేహానికి కొత్తశత్రువు


సవరణల సంక్లిష్ట జీవితం,
వాకిలి అంచున బేలగా

■ మల్లారెడ్డి మురళీమోహన్
✆ 88611 84899

కల్లోల దశాబ్దపు కవిత్వ కలల మేఘం

నా మొదటి పుస్తకం

నారాయణస్వామి వెంకటయోగి



1991 సంవత్సరం అక్టోబర్‌లో, ఒక సాయంత్రం ఖైరతాబాద్ ద్వారకా హోటల్‌లో కలిసినప్పుడు శివారెడ్డి గారు "స్వామీ మొత్తం ఎన్ని పోయెమ్స్ ఉంటాయి?" అని అడిగారు. "వందకు పైనే ఉండొచ్చు సర్. కానీ అన్నీ ఒక చోట లేవు" అని నసిగాను. "ఇప్పటి దాకా నువ్వు రాసినవన్నీ ఒక చోట చేర్చి వాటిలో నీకు నచ్చిన యాభై పోయెమ్స్ తీసుకురా. పదేళ్లు కావస్తోంది. ఇక పుస్తకం రావాల్సిందే" అన్నారు. వెతికితే కొన్ని డైరీలో, కొన్ని అప్పటికే విద్య అందంగా తెలుగులో టైప్ చేసి ఇచ్చిన కాగితాల్లో, కొన్ని అజాగ్రత్తగా 'భద్రపరిచిన' చిత్తు కాగితాల్లో దొరికాయి. అట్లా చాలా వరకు సంపాదించి శివారెడ్డి గారి దగ్గరికి తీసికెళ్లాను. వాటిని వడపోసి నలభై దాకా ఎంపిక చేసి "ఇది బ్రహ్మాండమైన సంపుటి అవుతుంది స్వామీ," అన్నారు ఉత్సాహంగా.

అప్పటికే విరసంలో చురుకైన సభ్యునిగా, కార్యవర్గంలో ఉన్నాను. ఈ పుస్తకాన్ని విరసం సిటీ యూనిట్ ప్రచురణగా తెద్దామని నిర్ణయించుకున్నాను. కరీంనగర్ రైతాంగ పోరాటాలపై నిర్బంధం గురించి రాసిన 'కల్లోల కలల మేఘం' కవిత శీర్షికను సంపుటికి పేరుగా బాగుంటుందనీ, శివారెడ్డి, వరవరరావు గార్లతో ముందుమాట రాయించాలనీ అనుకున్నాను. మిత్రులు విమల, సుధాకిరణ్, సురేష్‌లు కూడా ఏకీభవించి తోడు నిలిచారు. నన్నూ, నా కవిత్వాన్ని 1983 నుంచి దగ్గరగా చూస్తున్న ఆప్తులు రమా మెల్కోటే మేడమ్ "కవర్ మీద కె. లక్ష్మాగౌడ్ గారితో బొమ్మ వేయిస్తే బాగుంటుంది," అన్నారు. బెరుకు బెరుగ్గా లక్ష్మాగౌడ్ గారి దగ్గరికి కవిత్వం తీసుకుని వెళ్లాను. ఆయన ఆప్యాయంగా పలకరించి, కవిత్వం మొత్తం చదివినంక, వారం రోజులకు ఒక అద్భుతమైన రేఖాచిత్రాన్ని గీసిచ్చారు. నా ఆనందానికి అవధుల్లేవు. లక్ష్మా గౌడ్ గారికి బోలెడన్ని ధన్యవాదాలు చెప్పుకుని, సరాసరి శీలా వీర్రాజు గారి దగ్గరికి వెళ్లాను. ఆయన అద్భుతంగా కవర్ డిజైన్ చేశారు. తన అక్షరాలు కాకుండా కంప్యూటర్ ఫాంటే బాగుంటుందని తానే సూచించిన ఉదాత్త స్వభావుడు శీలావీ గారు.

వరవరరావు సర్, శివారెడ్డి గారు ముందుమాటలు ఇవ్వగానే పుస్తకం ప్రెస్ కాపీ సిద్ధమైంది. లక్ష్మాగౌడ్ గారి బొమ్మ చూసాక రాసిన మరో కవిత కూడా చేరింది. మిత్రుడు శేఖర్ కంపోజ్ చేసి, నాని ప్రింటర్స్ గాంధీనగర్‌లో పుస్తకం ప్రింట్ చేయించాడు. కవర్‌ని నలుపు తెలుపుల్లో (అక్షరాలు జేగురు రంగులో) ప్రగతి ప్రింటర్స్ హనుమంతరావు ప్రేమతో అందంగా ముద్రించి ఇచ్చారు. కవర్ వెనుక అట్ట మీద కొత్తగా రాసిన కవితను వేశాను. అది నా కవిత్వానికి మేనిఫెస్టో లాంటి కవిత. నాకు జీవితాన్నిచ్చి అర్థాంతరంగా వెళ్ళిపోయిన బాపుకు, నా కవిత్వానికి చూపునిచ్చిన విప్లవోద్యమం కోసం అమరులైన కృష్ణారెడ్డి, కవి నూతన్‌లకూ అంకితం ఇచ్చాను.

చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగిన ఆవిష్కరణలో శివారెడ్డి ఆవిష్కర్త. విరసం సభ్యులు రామ్మోహన్ సర్, విమల, జనసాహితి కొత్తపల్లి రవిబాబు వక్తలు. విప్లవ కవిత్వం నినాద ప్రాయమని, మూస పద్ధతిలో విప్లవం గురించి రాయడం తప్ప శిల్పం గురించి, జీవితంలోని భిన్న పార్శ్వాలను, పట్టించుకోలేదనే అపవాదు బలంగా ప్రచారంలో ఉండేది. ఆ అపవాదుని, 1990ల్లో వచ్చిన విప్లవ కవిత్వంలో భాగంగా 'కల్లోల కలల మేఘం' కొంతైనా పూర్వపక్షం చేసిందనే అనుకుంటాను. విప్లవోద్యమంతో మమేకమై, విరసం సభ్యునిగా కవిత్వం రాస్తున్నప్పుడు నిబద్ధత, నిమగ్నత ఉండడం సహజం. అవసరం కూడా. అది ఒక ప్రాపంచిక దృక్పథంగా మలుచుకుని అనుభవాలను, మానవ సంబంధాలను, వైరుధ్యాలను కవిత్వీకరించడం వల్ల 'కల్లోల కలల మేఘం' బలమైన సంకలనంగా వచ్చింది. ఒక దశాబ్ద కాలం తెలుగు సమాజపు చరిత్రను సమర్థవంతంగా రికార్డ్ చేసింది.



'అరుణతార'లో ఎన్. వేణుగోపాల్, నా కవిత్వంలోని బలాన్నీ బలహీనతలనూ చాలా ప్రేమతో అయినా, ఆబ్జెక్టివ్‌గా అద్భుతంగా సమీక్షించాడు. హరనాథ్ అనే ఒకాయన మాత్రం, 'విశాలాంధ్ర'లో సమీక్ష చేస్తూ శివారెడ్డి మీద, దేవిప్రియ మీద ఉన్న అక్కసునంతా నా కవిత్వం మీద వెళ్లగక్కాడు. అయితే దానికి జవాబుగా 'నారాయణస్వామి కవిత్వం పావు కాదు పావురమే' అని అఫ్సర్ దీటైన జవాబు ఇచ్చాడు. నా 'వానొస్తద' కవిత్వ సంపుటి వచ్చేంతవరకు 'కల్లోల కలల మేఘం' నాకు ఇంటి పేరులా మారిపోయింది.

ఒక ఆదివారం ఉదయాన్నే శీలా వీర్రాజు, నాళేశ్వరం శంకరం వచ్చి 'కల్లోల కలల మేఘం'కు 1994 ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు ఇవ్వాలనుకున్నాం అని చెప్పారు. ఎటువంటి ప్రలోభాలు కానీ రాజ్య సంబంధాలు కానీ లేకుండా, కవిత్వం మీద అవ్యాజ్యమైన ప్రేమతో ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన ఫ్రీ వర్స్ ఫ్రంట్ అవార్డు నాకు రావడం గొప్ప విషయంగా భావించాను. ఈ విషయాన్ని విరసం సిటీ యూనిట్‌లో చర్చకు పెట్టాను. భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. చివరికి తీసుకోవడం సరైందే అని నిర్ణయమయ్యాక, వీర్రాజు గారికి ఆ విషయం తెలియ జేసాక అవార్డు ప్రకటించారు. 'కల్లోల కలల మేఘం' కవిగా నా సాహిత్య ప్రయాణంలో ఒక గొప్ప మైలు రాయిగా భావిస్తాను. ఆదరించిన తెలుగు సాహిత్య లోకానికి ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటాను. ■



'అమృత్ భారత్' పనులు పట్టాలెక్కేదెప్పుడు ?



- కాజీపేట రైల్వేస్టేషన్ పనులపై ఎందుకింత నిర్లక్ష్యం?
- రెండేళ్లుగా కొనసాగుతున్న సుందరీకరణ పనులు
- ఎస్కలేటర్లు లేక ప్రయాణికుల ఇబ్బందులు

7



గాంధీభవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

సంస్థాగత నిర్మాణానికి బ్రేక్

- స్థానిక ఎన్నికల తర్వాత నిర్ణయం
- డైరెక్టర్ల పదవుల భర్తీకి ఓకే.. చైర్మన్ పోస్టులు ఆ తరువాతే..
- గాంధీభవన్‌లో ఉమ్మడి జిల్లా నేతలతో మంత్రి అడ్లూరి సమావేశం
- టీపీసీసీ పదవులపై కొంత అసహనం.. అధిష్ఠానానికి విన్నవించాలని విజ్ఞప్తి
- స్థానిక ఎన్నికలకు సమన్వయ కమిటీల ఏర్పాటు

హనుమకొండ సిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): సంస్థాగత నిర్మాణానికి కసరత్తు ఆరంభించిన కాంగ్రెస్ పార్టీ.. ప్రస్తుతానికి ఆ ప్రక్రియకు బ్రేక్ వేసింది. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. అయితే నిర్మాణానికి జరుగుతున్న నివేదికల రూపకల్పన, క్షేత్రస్థాయి నుంచి జరిగిన పరిశీలనల రిపోర్టులను మాత్రం యథాతథంగా రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నాటరాజన్ పర్యవేక్షణ కొనసాగనుంది. స్థానిక సంస్థల ఎన్నికల క్రమంలో హైదరాబాద్ గాంధీభవన్‌లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, స్థానిక సంస్థల వరంగల్ జిల్లా ఇన్‌చార్జి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం సమావేశం జరిగింది. మంత్రులు సీతక్క, సురేఖ, ఎంపీలు కడియం కావ్య, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మురళీనాయక్ తదితరులతో టీపీసీసీ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, కత్తి వెంకటస్వామి, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల భర్తీలో భాగంగా ఎన్నికలకు ముందుగా డైరెక్టర్ పోస్టుల భర్తీ ప్రధానాంశాలుగా సమావేశం సాగింది. సంస్థాగత నిర్మాణానికి (మిగతా 6లో...)



- గులాబీ స్థానాలపై పాగా వేయాలని వ్యూహ రచన
- ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జుల నియామకం
- వర్గపోరుతో కిందిస్థాయి నేతల సతమతం
- నేతల మధ్య అధిష్ఠానం సమన్వయ మంత్రం
- హైదరాబాద్‌లో ఇన్‌చార్జి మంతనాలు
- పార్టీ విజయంపై ముఖ్య నాయకులకు దిశా నిర్దేశం

'పరిషత్'లపై హస్తం నజర్

జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల కైవసానికి ప్రణాళిక

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లు కాంగ్రెస్‌లో పరిషత్ ఎన్నికల వేడి మొదలైంది. పార్టీ గుర్తులపై ఎన్నికలు జరుగనుండటంతో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ సవాల్‌గా తీసుకుంటోంది. అధికారంలో ఉండటంతో పాటు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓరుగల్లు కోటను బద్దలు కొట్టాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ వ్యూహరచన చేస్తోంది. 2019లో జరిగిన పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అన్ని జిల్లాల్లో క్లీన్‌స్వీప్ చేసింది. మెజారిటీ ఎంపీపీ పీఠాలు, ఆరు జడ్పీ చైర్మన్ స్థానాల్లో గులాబీ పాగా వేసింది. అయితే బీఆర్ఎస్ రికార్డును బ్రేక్ చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా అసెంబ్లీ, పార్లమెంట్, జిల్లా, ఉమ్మడి జిల్లా స్థాయిలో పార్టీ ఇన్‌చార్జిలను నియమించారు.

గులాబీపై పైచేయి కోసం..

2019లో జరిగిన పరిషత్ ఎన్నికల్లో అప్పటి అధికార బీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లాను క్లీన్‌స్వీప్ చేసింది. ములుగు జిల్లాలోని మంగపేట మినహా మిగతా 70జడ్పీటీసీ స్థానాల్లో 61చోట్ల బీఆర్ఎస్ విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ కేవలం 8చోట్లనే విజయం సాధించింది. ఇందులో 4స్థానాలు మంథని నియోజకవర్గం పరిధిలోని కాటారం డివిజన్‌లోనివే. మహబూబాబాద్‌లో 2 స్థానాలు, ములుగులో ఒకటి, జనగామలో ఒక జడ్పీటీసీని మాత్రమే గెలుచుకుంది. ఆరు జడ్పీ చైర్మన్లు, వైస్‌చైర్మన్‌లను కూడా బీఆర్ఎస్సే గెలుచుకుంది. అలాగే 70 మండల పరిషత్తు అధ్యక్ష (ఎంపీపీ) స్థానాల్లో బీఆర్ఎస్ 53చోట్ల విజయం సాధించింది. కాంగ్రెస్ 12, మూడు చోట్ల ఇండిపెండెంట్లు, ఒకటి ఏఐఎఫ్‌బీ, ఒకటి సీపీఐ గెలుచుకుంది. 90శాతం ఎంపీపీ సీట్లు కూడా బీఆర్ఎస్ ఖాతాలోనే చేరాయి. ఆ తరువాత చాలా మంది కాంగ్రెస్ ఎంపీపీలు గులాబీ కండువా కప్పుకున్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీ ఒక్క చోట కూడా విజయం సాధించలేదు. అయితే గులాబీ పార్టీకి కంచుకోటగా ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ దెబ్బకొట్టింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమితో కూడా గులాబీ శ్రేణులు డీలా పడ్డాయి. కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నారు. ఇద్దరు మంత్రులు కూడా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గులాబీ పార్టీ రికార్డును బ్రేక్‌చేసేలా అన్ని జడ్పీ చైర్మన్ స్థానాలతో పాటు ఎంపీపీలను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.

సమన్వయ మంత్రం

పంచాయతీ ఎన్నికల్లో విజయంపై కాంగ్రెస్‌పార్టీలో ధీమా వ్యక్తం అవుతున్నప్పటికీ.. నేతల మధ్య వర్గపోరుపై అధిష్ఠానాన్ని కలవరానికి గురి చేస్తోంది. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయటంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు అధిష్ఠానం ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నియమించింది. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ అధ్యక్షులు, కీలక నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని విజయపథాన నడిపించేందుకు దృష్టి పెట్టాలని మంత్రి, పార్టీ ఇన్‌చార్జి లక్ష్మణ్‌కుమార్ నేతలకు దిశా నిర్దేశం చేశారు. దీంతో నేతల మధ్య ఉన్న విభేదాలు కొంతవరకైనా తగ్గవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అధిష్ఠానం నేతల మధ్య సయోధ్య కుదుర్చటంతో పాటు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళిక రూపొందిస్తోంది. ప్రధానంగా సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, గ్యాస్‌తో పాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై మహిళల మద్దతు లభించినట్లుగా కాంగ్రెస్ భావిస్తోంది. ఉమ్మడి జిల్లాకు పార్టీ ఇన్‌చార్జితో పాటు ప్రతీ జిల్లాకో పీసీసీ పరిశీలకుడిని నియమించింది. వరంగల్ జిల్లాకు ఆమీర్ ఆలీఖాన్, హనుమకొండ జిల్లాకు కోమటి రెడ్డి వినయ్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లాకు పొట్ల నాగేశ్వర్‌రావు, జనగామ జిల్లాకు అద్దంకి దయాకర్, భూపాలపల్లి జిల్లాకు (మిగతా 6వ పేజీలో...)

2019 ఎన్నికల్లో పార్టీలు గెలుచుకున్న జడ్పీటీసీ స్థానాల వివరాలు

జిల్లా	మొత్తం స్థానాలు	బీఆర్ఎస్	కాంగ్రెస్	ఇతరులు
వరంగల్‌రూరల్	16	16	00	00
వరంగల్ అర్బన్	07	07	00	00
జనగామ	12	11	01	00
మహబూబాబాద్	16	14	02	00
భూపాలపల్లి	11	06	04	01
ములుగు	08	07	01	00
మొత్తం	70	61	08	01

2019 పరిషత్ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు గెలుచుకున్న ఎంపీపీ స్థానాల వివరాలు

జిల్లా	మొత్తం స్థానాలు	బీఆర్ఎస్	కాంగ్రెస్	ఇతరులు
వరంగల్ రూరల్	16	14	02	00
వరంగల్ అర్బన్	07	06	00	01
జనగామ	12	11	01	00
మహబూబాబాద్	16	11	02	03
భూపాలపల్లి	11	06	04	01
ములుగు	08	05	03	00
మొత్తం	70	53	12	05

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించబడుతుందని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

కూలి డబ్బులు ఇవ్వలేదని కిడ్నాప్

- యజమాని బంధువైన బాలుడి అపహరణ
- ముగ్గురిని అరెస్టు చేసిన హనుమకొండ పోలీసులు



నిందితులను అరెస్టు చేసి చూపిస్తున్న హనుమకొండ సీఐ శివకుమార్

వరంగల్ క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : తాను పనిచేసే చోట రోజువారీ కూలీ డబ్బులను యాజమాని చెల్లించకపోవడంతో అతడి బంధువైన బాలుడిని కిడ్నాప్ చేసి డబ్బులు రాబట్టుకోవాలనుకున్న మహిళ.. చివరికి తన ముఠా సభ్యులతో పోలీసులకు చిక్కింది. హనుమకొండ ఏసీపీ నరసిహారావు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ ఏనుగులగడ్డకు చెందిన పూరి పద్మ గతంలో హనుమకొండలోని బ్రహ్మణవాడలో క్యాటరింగ్ చేసే రమణ అనే వ్యక్తి వద్ద దినసరి కూలీగా పనిచేసింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య డబ్బులు విషయంలో వివాదం చోటు చేసుకోగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం ఇల్లంతకుంటకు వెళ్లిపోయింది. రమణ నుంచి రావాల్సిన డబ్బుల కోసం ఆయనకు సమీప బంధువైన బాలుడిని కిడ్నాప్ చేసి బెదిరింపులకు గురిచేస్తే డబ్బులు వస్తాయనే ఆలోచన చేసింది. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఉండే తన కుమారులైన పూరి రాజు, పూరి శ్రీకాంత్, భద్రాద్రి కొత్తగూడెం రేగుబెల్లికి చెందిన జెట్టి జ్యోతితో బాలుడి కిడ్నాప్‌కు పథకం రచించింది. ఈక్రమంలో ఈ నెల 4న ద్విచక్రవాహనంపై నయీంనగర్‌కు వచ్చిన బాలుడిని మహిళా గ్యాంగ్ ఆటోలో బలవంతంగా ఎక్కించుకొని ములుగు నుంచి ఆశ్వాపురానికి చేరుకున్నారు. అక్కడి నుంచి (మిగతా 6లో...)

యూరియా కొరత లేకుండా చూడాలి

అధికారులకు కలెక్టర్ సత్యశారద ఆదేశాలు




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం యూరియా నిల్వలు, సరఫరా లాంటి అంశాలపై వ్యవసాయాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా యూనియా నిల్వల డిమాండ్, సరఫరా వివరాలను సమగ్రంగా విశ్లేషించి సమయానికి ఎరువులు అందేలా చూడాలన్నారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని, అవసరమైన ముందస్తు చర్యలు తీసుకొని సొసైటీలు, ప్రయివేట్ డీలర్ల ద్వారా సరిపడా యూరియా అందించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే రకఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సంబంధిత అధికారులు తరచుగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మీ, వ్యవసాయాధికారి అనురాధ, సహకార అధికారి, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా రుణ ప్రణాళిక రూ.15,455 కోట్లు

- ప్రాధాన్యత రంగానికి రూ.7,999కోట్లు
- ప్రాధాన్యేతర రంగానికి రూ.7,456 కోట్లు
- 2024-25 వార్షిక ప్రణాళికలో 83శాతం మేరకు లక్ష్య సాధన
- లక్ష్యాన్ని మించి పంట రుణాలు



హనుమకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా వార్షిక రుణ ప్రణాళికను అధికార యంత్రాంగం ఖరారు చేసింది. 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలను కలుపుకొని మొత్తం రూ.15,455కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో ప్రాధాన్యత రంగానికి రూ.7,999కోట్లు (52 శాతం). ప్రాధాన్యేతర రంగానికి రూ.7,456కోట్లు (48శాతం)గా నిర్దేశించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలతోపాటు విద్య, గృహ, స్వయం సహాయక సంఘాలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు రుణాలు అందించేలా ప్రణాళికను రూపొందించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగానికి గతేడాదితో పోలిస్తే రూ. 586 కోట్లను అధికంగా పెంచారు.

ప్రాధాన్యత రంగానికి పెద్ద పీట

ప్రాధాన్యత రంగంలో నిర్దేశించిన మొత్తం రూ.7,999 కోట్లలో పంట రుణాలుగా రూ.2,268కోట్లు (14 శాతం) ఇవ్వాలని నిర్ణయించారు. 2024-25 రుణ ప్రణాళికలో నిర్దేశించిన మొత్తం కన్నా రూ.532కోట్లు ఎక్కువ. వ్యవసాయరంగానికి రూ.4,056కోట్లు (26శాతం) నిర్దేశించారు. గత రుణాప్రణాళికలో ఈ రంగానికి ఇచ్చిన రుణాలకన్నా రూ.500కోట్లు ఎక్కువ. పరిశ్రమల రంగానికి రూ.3,320కోట్లు (21 శాతం) కేటాయించారు. గత ప్రణాళికలో నిర్ణయించిన మొత్తానికన్నా రూ.64కోట్లు ఎక్కువ. ఇతర రంగాలకు రుణప్రణాళికలో ఇతర రంగాలకు రూ.622 (4శాతం) కేటాయించారు. ఈ రుణ ప్రణాళికలో రైతుల పంట పొలాల్లో సాగునీటి కల్పన, వ్యవసాయ యాంత్రీకరణ, పాడి పరిశ్రమ, భూముల అభివృద్ధి, విత్తనోత్పత్తి, వ్యవసాయరంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన, స్వయం సహాయక సంఘాలకు విద్య, గృహ రుణాలు అందించేలా రుణ ప్రణాళను తయారు చేశారు.

లక్ష్యం మేరకు అందించేలా చర్యలు

శ్రీనివాసరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్, హనుమకొండ జిల్లా




జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు పెద్దపీట వేశాం. ప్రాధాన్యతరంగంలో ఇవ్వాలని నిర్ణయించిన మొత్తం రుణాల్లో (52శాతం) 40శాతం రూ.6,324 కోట్లను పంట రుణాలు, వ్యసాయం, దాని అనుబంధరంగాలకే కేటాయించాం. ప్రణాళికలో నిర్ణయించిన లక్ష్యం మేరకు రుణాలు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. రుణాలు తీసుకున్నవారు సకాలంలో చెల్లింపు చేపడితే క్రెడిట్ స్కోర్ పెరగడంతో పాటు మళ్లీ రుణాలను పొందడానికి అవకాశం ఉంటుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఎదురైన అనుభవాలను పరిగణలోకి తీసుకొని వార్షిక రుణ లక్ష్యలను నిర్ణయించాం. ఆ మేరకు ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాల్లో లక్ష్యం పూర్తికి ప్రయత్నిస్తాం.

వంద శాతం లక్ష్యం ఎప్పుడు?

వ్యవసాయ, అనుబంధ, ఇతర రంగాలకు రుణ పంపిణీకి ఏటా రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) రుణ ప్రణాళిక రూపొందిస్తుంది. దాని ప్రకారం బ్యాంకుల వారీగా వార్షిక రుణ లక్ష్యాలను నిర్దేశిస్తుంది. ఏటేటా కేటాయింపులు పెంచుతూ ప్రణాళిక ఖారారు చేస్తున్నా.. రుణపంపిణీ మాత్రం నూటికి నూరుశాతం జరగడం లేదు. హనుమకొండ జిల్లా విషయానికి వస్తే వార్షిక రుణ ప్రణాళిక బాగానే ఉన్నా అమలులో కాస్త వెనుకబడిపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా వంద శాతం రుణాలనైనా అందించి జిల్లాలోని రైతులు, యువత, స్వయం సహాయకసంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. జిల్లాలో పేద, మధ్య తరగతి కుటుంబాలలు, వ్యవసాయం, తదితర రంగాల ద్వారా ఆదాయం సమకూర్చుకుంటాయి. అలాంటివారికి రుణాలు ఎంతగానో అవసరం. బ్యాంకుల ద్వారా మంజూరు కాకంటే అధిక వడ్డీకి బయట అప్పుచేసి పెట్టుబడి పెడితే కష్టార్జితం మొత్తం అప్పులకు కట్టే వడ్డీకే సరిపోతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణ ప్రణాళిక తయారు చేయడమే కాదు, వంద శాతం అమలు చేస్తేనే జిల్లా ప్రజలకు ఊరట కలుగుతుంది. జిల్లా కలెక్టర్ బ్యాంకర్లతో నెలకోసారి సమీక్ష నిర్వహిస్తూ వంద శాతం రుణాలు అందించేలా చర్యలు తీసుకోవలసి ఉంది. రుణ మంజూరు విషయంలో బ్యాంకర్లల నిర్లక్ష్యం చూపుతున్నారని, రోజుల తరబడి బ్యాంకర్ల చుట్టూ తిరిగినా ఫలితం ఉండటం లేదని పలువురు రైతులు, యువకులు వాపోతున్నారు. లక్ష్యం మేరకు రుణాలను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆర్యూబీ సైడ్ వాల్స్ తొలగించాలి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- నెక్కొండలో పర్యటన



సైడ్ వాల్స్ తొలగించాలంటూ అధికారులకు తెలుపుతున్న దొంతి మాధవరెడ్డి

నెక్కొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందికరంగా ఉన్న నెక్కొండ ఆర్యూబీ సైడ్‌వాల్స్‌ను వెంటనే తొలగించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారుకు ఆదేశించారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలసి ఆర్యూబీని పరిశీలించారు. ఆర్యూబీకి ఇరువైపులా ఉన్న సైడ్ వాల్స్ ఎక్కువ ఎత్తుగా ఉండటంతో బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న ఇండ్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే వాహనదారులు రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురవుతున్న విషయం అధికారులకు ఎమ్మెల్యే తెలిపారు. ఆర్యూబీకి ఇబ్బంది కలుగకుండా సైడ్‌వాల్స్ తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, పాలాయి శ్రీనివాస్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ సీఈ రాజేశ్వర్‌రావు, ఈఈ రమేశ్, రమాదేవి, ఏఈ గోపి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, పట్టణ అధ్యక్షుడు ఈదునూరి సాయి కృష్ణ, నేతలు కుసుమ చెన్నకేశవులు, ఆవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోదావరి తగ్గుముఖం



కాళేశ్వరం వద్ద మెట్ల దిగువన ప్రవహిస్తున్న గోదావరి నది

మహదేవపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం ఆదివారం తగ్గుముఖం పట్టింది. కొద్ది రోజులుగా గోదావరి ఉవ్వెత్తున ప్రవహిస్తున్న విషయం తెలిసిందే. ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో పుష్కర ఘాట్ల మెట్లకు దిగువన గోదావరి ప్రవాహం వెళ్తోంది. ప్రాణహిత వరద తగ్గుముఖం పట్టినట్లు అధికారులు తెలిపారు. గోదావరి నీటిమట్టం 7.27 మీటర్లు నమోదైనట్లు వారు పేర్కొన్నారు.

బుద్ధుడి మార్గమే సమాజానికి దిక్సూచి



గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు బుద్ధ వందనం చేస్తున్న నేతలు

వడ్డేపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బుద్ధుడి మార్గమే సమాజానికి దిక్సూచి అని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు పరందాములు, లలితా ఫౌండేషన్ చైర్మన్ కేకే రాజు, డీబీఎఫ్ జాతీయ ప్రతినిధి శంకర్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో భారతీయ బౌద్ధ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క సుదర్శన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మల్ల అంబేద్కర్ ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సాంస్కృతిక చైతన్య యాత్ర హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బుద్ధుడితో నా ప్రయాణం - డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నృత్య రూపకం(నాటకం) ప్రదర్శించారు. ఈ నాటకంలోని నటులు పాత్రలకు జీవం పోసి ఆద్యంతం అలరింపచేసి రక్తికట్టించారు. బుద్ధుడి బోధనలు, ప్రవచనాలను నాటకంలో ఉటంకిస్తూ ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, బీఎస్ఐ, అంబేద్కర్ సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు జవ్వాజి కిషన్, అంకేశ్వరపు కుమార్,కృష్ణ స్వామి, సాంబయ్య, మిద్దెపాక ఎల్లయ్య, చిట్యాల బాబు, మన్నె బాబురావు, యాడాల రవీందర్, కొమురయ్య, గద్ద నర్సయ్య, చుంచు రాజేందర్, వెలిగొండ రాములు తదితరులు పాల్గొన్నారు.

‘పరిషత్’లపై హస్తం నజర్

(5వ పేజీ తరువాయి)

ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ములుగు జిల్లాకు కొండేటి మల్లయ్యలను టీపీసీసీ పరిశీలకులుగా నియమించారు. అలాగే వరంగల్ పార్లమెంట్ స్థానానికి చిట్ల సత్యనారాయణ, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి పొట్ల నాగేశ్వరావును పార్టీ ఇన్‌చార్జిలుగా అధిష్ఠానం నియమించింది. ఆయా నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి పార్టీ సంస్థాగత ఎన్నికలతో పాటు పంచాయతీ, పరిషత్తు ఎన్నికల్లో విజయం కోసం వ్యూహరచన చేస్తున్నారు.

స్థానిక స్థానాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,708 గ్రామపంచాయతీలు ఉండగా, 15,006 వార్డులు ఉన్నాయి. అలాగే 75 జడ్పీటీసీ స్థానాలతో పాటు 775 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 22,26,017మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇంకా ఓటర్ల సంఖ్య పెరగనుంది. బీసీ రిజర్వేషన్‌లపై ఆర్డినెన్స్ జారీ చేస్తుండటంతో ఇక స్థానిక ఎన్నికల నిర్వహణ పక్కా అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 2019లో 71 మండలాలు ఉంటే.. రిజర్వేషన్ల కారణంగా ములుగు జిల్లా మంగపేట మండలంలో ఎన్నికలు నిర్వహించలేదు. తాజాగా మండల సంఖ్య పెరిగింది. కొత్తగా మహబూబాబాద్ జిల్లాలో పెద్దవంగర, ఇనుగుర్తి మండలాలను కొత్తగా ఏర్పాటు చేశారు. అలాగే భూపాలపల్లి జిల్లాలో గోరికొత్తపల్లి, ములుగు జిల్లాలో మల్లంపల్లి మండలాన్ని ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం మండల పరిషత్తుల సంఖ్య 75కు చేరింది. గతంలో వరంగల్ రూరల్ జిల్లాలో 16 మండలాలు, వరంగల్ అర్బన్ జిల్లాలో 7 మండలాలు ఉండేవి. అయితే 2021 ఆగస్టు 12న వరంగల్ అర్బన్ జిల్లాను హనుమకొండ జిల్లాగా 14మండలాలతో ఏర్పాటు చేశారు. వరంగల్‌రూరల్ జిల్లాను వరంగల్ జిల్లాగా 13మండలాలతో ఏర్పాటు చేశారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్, ఖిలావరంగల్ మండలాలు పూర్తిగా పట్టణ ప్రాంతంలో హనుమకొండ జిల్లాలో 12, వరంగల్ జిల్లాలో 11 మండలాలకు జడ్పీటీసీలు, ఎంపీటీల ఎన్నికలు జరుగనున్నాయి.

మహిళ అదృశ్యం

మడికొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట మండలం బోడగుట్టలో శనివారం ఓ మహిళ అదృశ్యం అయింది. మడికొం డ ఎస్సై పి.రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట బోడగుట్టలో శనివారం రాత్రి జీనత్ అనే మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. పింక్ కలర్ పంజాబీ డ్రెస్, నలుపు రంగు బుర్ఖా ధరించింది. జీనత్ భర్త ఎండి.మహమూద్ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 97050 55434, 99898 39746 నంబర్లకు లేదా మడికొండ పోలీస్ స్టేషన్‌లోనైనా సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

హెచ్‌సీఏ గుర్తింపును రద్దు చేయాలి

- తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌గా మార్చాలి
- డబ్ల్యూసీఏ మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు



సమావేశంలో మాట్లాడుతున్న మార్నేని ఉదయభానురావు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో జరుగుతున్న అవినీతి, అక్రమాల పట్ల వస్తున్న ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం, బోర్డ్ ఆఫ్ క్రికెట్ కంట్రోల్ ఇన్ ఇండియా(బీసీసీఐ) కలుగజేసుకొని హెచ్‌సీఏ గుర్తింపును పూర్తిగా రద్దుచేసి, ఆ స్థానంలో తెలంగాణ రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌గా ప్రకటించాలని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్(డబ్ల్యూసీఏ) మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు అన్నారు. ఆదివారం హనుమకొండ సుబేదారిలోని రామారావు క్రికెట్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉదయభానురావు పాల్గొని మాట్లాడారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావుపై రెండు రోజుల కిందట వచ్చిన పలు ఆరోపణలపై ప్రభుత్వం తీసుకున్న చర్యల విషయాలను పలు ప్రచార మాధ్యమాల్లో, వార్తా పత్రికలలో చూశామన్నారు. 13ఏళ్ల కిందట వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేసిన కాలంలో జిల్లా క్రికెట్ అభివృద్ధిపై పలువిషయాలను హెచ్‌సీఏ దృష్టికి తీసుకెళ్లగా కంటి తుడుపు చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారన్నారు. హెచ్‌సీఏను తెలంగాణ రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌గా పేరు మార్చాలని ఉదయభానురావు కోరారు. కొందరు స్వార్థపరులు హెచ్‌సీఏను గుప్పిట్లో పెట్టుకొని తెలంగాణ ప్రాంతంలోని ప్రతిభ కలిగిన క్రికెట్ క్రీడాకారులకు అవకాశాలు ఇవ్వకుండా అడ్డుకుంటూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 70 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెట్ క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఎలాంటిఅవకాశాలు కల్పించకుండా చిన్నచూపు చూస్తూ హెచ్‌సీఏలోని కొందరు వ్యక్తులు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో డబ్ల్యూసీఏ మాజీ సంయుక్త కార్యదర్శి బండారి ప్రభాకర్, మాజీ కార్యవర్గసభ్యులు మట్టెడ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ర్యాంకు సాధించా..

- సివిల్స్‌లో 11వ ర్యాంకు సాధించిన సాయిశివాని



సాయిశివానిని సన్మానిస్తున్న పరకాల ఆర్డీవో నారాయణ

ఆత్మకూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రుల కష్టాలను చూసి పట్టుదలతో చదివి సివిల్స్‌లో ఆల్ ఇండియా ర్యాంకు సాధించానని ఇట్టబోయిన సాయిశివాని అన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామంలోని పెరిక సంఘం ఆధ్వర్యంలో సివిల్ ఫలితాల్లో ఆల్ ఇండియా 11వ ర్యాంకు సాధించిన ఇట్టబోయిన సాయిశివానిని రైతు వేదికలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. ముందుగా గ్రామంలో పరకాల ఆర్డీవో నారాయణతో కలిసి మొక్కలు నాటారు. సాయిశివానిని ఆర్డీవో నారాయణ, ఫెస్టిసైడ్ జిల్లా అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు విశిష్ట అతిథి పరిటాల బాలకృష్ణమూర్తి, మెడ ప్రవీణ్, మాజీ సర్పంచ్ అక్కల కుమార్‌లు ఘనంగా సన్మానించారు.

అనంతరం సాయిశివాని మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కష్టాలను చూసి తనలో పట్టుదల పెరిగిందన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎక్కడ కోచింగ్ తీసుకోకుండా ఇంట్లోనే ఉండి పట్టుదలతో చదివి ర్యాంకు సాధించానని తెలిపింది. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత నిరుపేదలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అలాగే తమ అమ్మవారి ఊరు అయిన నీరుకుళ్ల గ్రామంతో పాటు, చెన్నకేశవస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పరకాల ఆర్డీవో నారాయణ మాట్లాడుతూ.. పట్టుదల ఉంటే సాధించనిది ఏదీ లేదన్నారు. కృషి పట్టుదల, క్రమశిక్షణ ఉంటే అనుకున్న రంగంలో రాణించవచ్చన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతోపాటు పట్టుదల ఉండాలని అప్పుడే ర్యాంకులు సాధించవచ్చన్నారు. నిరుపేద విద్యార్థులు సాయిశివానిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు.

కడుపు నొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య

వర్ధన్నపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం వర్ధన్నపేట పట్టణంలోని ఫిరంగిగడ్డ ప్రాంతంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యు ల కథనం ప్రకారం.. వర్ధన్నపేట పట్టణానికి చెందిన రాజబోయిన ఎల్లయ్య కుమార్తె రాజశ్రీదేవి (15) వర్ధన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతుంది. 15రోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందింది. 4రోజులుగా కడుపునొప్పి తీవ్రంగా రావడంతో బాధ భరించలేక, కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా, ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వర్ధన్నపేట ఎస్ఐ రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని సందర్శించారు.

కూలీ ఇవ్వలేదని కిడ్నాప్ చేశారు..

(5వ పేజీ తరువాయి)

ముఠా సభ్యులు బాలుడితో అతడి తల్లికి ఫోన్ చేయించి రమణ నుంచి రూ.12లక్షలు ఇప్పిస్తే బాలుడిని వదిలేస్తామని బెదిరించారు. బాలుడి కుటుంబసభ్యుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో బాలుడిని కర్కగూడెం, కొత్తగూడెం, మంగపేటలోని పరిచయస్తులలో ఇళ్లలో ఉంచుతూ మరణాయుధాలతో చిత్రహింసలకు గురిచేశారు. పెట్రోల్ పోసి చంపుతామని బెదిరించారు. చివరికి రమణను కిడ్నాప్ చేస్తేనే తన డబ్బులు తిరిగి వస్తాయని హనుమకొండకు వచ్చారు. ఆదివారం హనుమకొండ యాదవనగర్ పెట్రోల్ పంపు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయతిస్తుండగా పద్మ, రాజు, జ్యోతిలను పట్టుకోగా శ్రీకాంత్ పారిపోయాడు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితుల నుంచి ఒక ఆటో, కత్తి, రెండు పెట్రోల్ బాటిళ్లు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకోని బాలుడిని సురక్షితంగా కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన హనుమకొండ సీఐ శివకుమార్, ఎస్సై కిషోర్, ఏఎఎస్ సల్మాన్ పాషా, కానిస్టేబుల్స్‌ను ఏసీపీ అభినందించారు.

ఆలయాల్లో టీపీసీసీ అధ్యక్షుడి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్

సంగెం/గీసుగొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి గాంచిన ఆలయంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం చింతలపల్లిలోని కాకతీయ రాజులు నిర్మించిన భవానీశంకర ఆలయంలో ప్రధాన పూజారి సముద్రాల సుదర్శనాచార్యుల నేతృత్వంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్సీటీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ కుటుంబసభ్యులతో పాల్గొన్నారు. ఆలయంలో కాలభైరవ అభిషేకం, రుద్రాభిషేకం పూజలు చేశారు. ఈసందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్‌కు ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికారు. ఆలయ పూజారులు సుదర్శనాచార్యులు, హర్షచార్యులు, వేద పండితులు గుజుమిళ్ల విజయ్‌కుమారాచార్యులు, వేణుగోపాలాచార్యులు, రాజేషాచార్యులు ఆలయ మర్యాదాలతో పూర్ణకుంబంతో ఆలయంలోకి తీసుకువెళ్లారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య మహేష్‌కుమార్, భార్య సంధ్యారాణి, కుమారులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఊకల్ నాగేంద్రస్వామి ఆయలంలో జరిగిన పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేత శ్రీనివాసాచార్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ ఇండ్ల రవి కుమార్, మార్కెట్ డైరెక్టర్ అచ్చ నాగరాజు, నాయకులు కందకట్ల నరహరి, బండి రాధిక, మాజీ ఎంపీటీసీ పావని, ఆలయ కమిటీ చైర్మన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. ఆదేవిధంగా గ్రామ గౌడ సంఘం నాయకులు మహేష్‌కుమార్‌ను సత్కరించారు.

యూరియా ఇవ్వలేదని పెట్రోల్‌తో రైతుల నిరసన

- అక్రమంగా నిల్వ చేశాడని రైతుల ఆరోపణ



నల్లబెల్లిలో రైతుల వద్ద పెట్రోల్ బాటిల్‌ను తీసుకుంటున్న పోలీసులు

నల్లబెల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాపు యాజమాని యూరియాను ఇవ్వకుండా అక్రమంగా గోదాంలో నిల్వ చేశాడని రైతులు గోదాం ముందు పెట్రోల్ బాటిల్‌తో నిరసన చేసిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. రైతులు జుంకీలాల్, ధన్‌రాజ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఫర్టిలైజర్ షాపు యాజమాని కర్ర మల్లారెడ్డి దుకాణానికి రైతులు వెళ్లి రెండు యూరియా బస్తాలు అడిగారు. దీంతో మల్లారెడ్డి యూరియా బస్తాలు ప్రస్తుతం స్టాక్‌లేవని చెప్పారు. అనంతరం రైతులు మల్లారెడ్డి గోదాంకు వెళ్లి చూడగా, గోదాంలో నిండుగా యూరియా బస్తాలు ఉన్నాయి. దీంతో యాజమానిని రైతులు యూరియా బస్తాలు గోదాంలో ఉన్నాయిగా అని ప్రశ్నించారు. యాజమాని మాటను దాటవేయడంతో.. రైతులు పెట్రోల్‌తో గోదాం వద్ద నిరసనకు దిగారు. వెంటనే సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలి వద్దకు చేరుకొని బాధిత రైతుల వద్ద నుంచి పెట్రోల్ బాటిల్‌ను గుంజుకున్నారు. అనంతరం వ్యవసాయాధికారితో ఫోన్‌లో మాట్లాడారు. యూరియా నిల్వ ఉంటే యాజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాక, ఘటన స్థలి వద్దకు ఎస్సై గోవర్ధన్ వచ్చి రైతులతో మాట్లాడి, న్యాయం చేస్తామని పంపించారు.

సంస్థాగత నిర్మాణానికి బ్రేక్

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతానికి బ్రేక్‌వేసి పూర్తిస్థాయిలో ఎన్నికల సంసిద్ధతపై దృష్టి సారించాలని సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు వరంగల్ ఇన్‌చార్జి, మంత్రి లక్ష్మణ్‌కుమార్ తొలుత జిల్లా నేతల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఆపై ఎన్నికల అంశంపై దిశా, నిర్దేశం చేశారు. నామినేటెడ్ భర్తీలో చైర్మన్ పోస్టులు ఎన్నికల తదుపరి భర్తీ జరుగుతుందన్నారు. అయితే డైరెక్టర్ల పోస్టుల భర్తీ ఉంటుందని ఈ మేరకు ప్రతిపాదనలు ఇవ్వాలని జిల్లా నేతలకు సూచించారు.

సమన్వయంతో పని చేయండి..

స్థానిక ఎన్నికల నేపథ్యంలో సమన్వయంతో పని చేయాలని జిల్లా నేతలకు అడ్లూరి లక్ష్మణ్ సూచించారు. వర్గ విభేదాలను పక్కన పెట్టి ఎన్నికల ఫలితాలను వందశాతం రాబట్టాలని ఆదేశించారు. గ్రామీణ నుంచి జిల్లాస్థాయి నేతలంతా ఒక్కటవ్వాలని, కార్యకర్తలతో మమేకం కావాలన్నారు. ఏ అవకాశాన్ని వదులుకోకుండా, నిర్లక్ష్యం చేయకుండా పని చేయాలని స్పష్టం చేశారు. బాధ్యతల విషయంలో ముఖ్య నేతలపై అధిష్ఠానం దృష్టి ఉంటుందన్నారు. నిర్లక్ష్యం చేయకుండా సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. పార్టీ ఆదేశాలకు లోబడి పని చేయాలని, ఎవరికి వారు సొంతంగా ప్రకటనలు చేయరాదని లక్ష్మణ్‌కుమార్ నర్మగర్భంగా నేతలకు స్పష్టం చేశారు.

మరిన్ని కమిటీల ఏర్పాటు

స్థానిక ఎన్నికల దృష్ట్యా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధిష్ఠానం మరిన్ని ప్రత్యేక కమిటీలను నియమించనున్నట్లు మంత్రి లక్ష్మణ్ తెలియచేశారు. ఇప్పటికే ఇన్‌చార్జిలు, పరిశీలకుల నియామకం జరిగిన క్రమంలో గ్రామ నుంచి జిల్లాస్థాయి వరకు సమన్వయ, పర్యవేక్షణ తదితర మరిన్ని కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా నేతలకు వెల్లడించారు.

టీపీసీసీ పదవులపై అసహనం

ఇటీవలే ప్రకటితమైన టీపీసీసీ కమిటీపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మరికొందరు నేతలు సమావేశంలో కొంత అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కీలకంగా ఉన్న తమను కమిటీకి పరిగణించలేదని మంత్రి లక్ష్మణ్‌కు స్పష్టం చేసినట్లు సమాచారం. కమిటీ నిర్మాణానికి ముందు తమ ప్రతిపాదనలను కూడా స్వీకరిస్తే సముచితంగా ఉండేదని కొందరు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని టీపీసీసీ దృష్టికి తీసుకెళ్లాలని, మరోసారి ఇలా జరగకుండా ఉండేందుకు అవకాశంగా ఉంటుందని ఇన్‌చార్జి లక్ష్మణ్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది.

గణితంలో హారికకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ గణితశాస్త్రంపరిశోధకురాలు బొల్లెడ్ల హారిక డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఆదివారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ హారికకు డాక్టరేట్ ప్రకటించారు 'ఇన్వెస్టిగేషన్ ఆఫ్ స్టడీ స్టేట్ ప్రొబలిటీ వెక్టర్ ఆఫ్ పాజిటివ్ డిఫైనెట్ రెగ్యూలరైజ్డ్ లీనియర్ సిస్టమ్ ఆఫ్ సోర్హాస్టిక్ మ్యాట్రిక్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు హారిక డాక్టరేట్ పొందారు. కేయూ గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్ కుమార్ పర్యవేక్షణలో హారిక పరిశోధన పూర్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన హారిక తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ వరంగల్ పశ్చిమ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. వరంగల్ నిట్‌లో ఎంఎస్సీ పూర్తి చేశారు. అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో 6 పరిశోధన పత్రాలను ప్రచురించారు. ప్రతిష్ఠాత్మకమైన టీసీఎస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. డాక్టరేట్ సాధించిన హారికను కిట్స్ ప్రొఫెసర్ రాజయ్య, అరుణ, సుదర్శన్‌రెడ్డిలతో పాటు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల సెక్రటరీ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

కంప్యూటర్ సైన్స్‌లో కోటేశ్వర్‌కు..



ఆంధ్రప్రదేశ్ కర్నూల్‌లోని రాయలసీమ వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం పరిశోధకుడు మద్రిపల్లి కోటేశ్వర్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఆదివారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ వి.వెంకటబసవరావు కోటేశ్వర్‌కు డాక్టరేట్ ప్రకటించారు 'ఇన్వెస్టిగేషన్ ఆఫ్‌సైబర్ క్రైమ్ ఫోరెనిక్స్ ప్రిన్సిపుల్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు కోటేశ్వర్ డాక్టరేట్ పొందారు. రాయలసీమ వర్సిటీ పరిధిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ బిపిన్‌బిహారీ జయసింగ్ పర్యవేక్షణలో కోటేశ్వర్ పరిశోధన పూర్తి చేశారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌కు చెందిన కోటేశ్వర్ రిటైర్డు రైల్వే ఉద్యోగి మద్రిపల్లి సరోజన కొడుకు. డాక్టరేట్ సాధించిన కోటేశ్వర్‌ను పలువురు అభినందించారు.

కండక్టర్ల నియామకాల్లో వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

- ఆర్టీసీ ఆర్ఎం డి.విజయభాను

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హనుమకొండ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ కండక్టర్ల నియామకాల్లో వసూళ్లకు పాల్పడుతున్నారని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆర్టీసీ ఆర్ఎం డి.విజయభాను ఆదివారం స్పందించారు. ఆర్టీసీలో కండక్టర్ల నియామకాల్లో బేరాల జోరు కొనసాగుతున్నట్లు వచ్చిన వార్త కథనంపై వరంగల్ రీజినల్ పరిధిలోని పలు డిపోలలో కాంట్రాక్టర్ల వివరాల గురించి ఆరా తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. ఎవరైనా కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. ఆరు నెలల ఔట్ సోర్సింగ్ కండక్టర్ ఉద్యోగానికి ఎవరు కూడా నిరుద్యోగులు డబ్బులు ఇవ్వవద్దని ఈసందర్భంగా ఆర్ఎం కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మడికొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మడికొండ ఎస్సై జి.రామ్మోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట మండలం భట్టుపల్లికి చెందిన పైడిపాల రమేశ్(39) జీవనోపాధికి ఎలాంటి పనిదొరకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 8న ఇంట్లో ఉండే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు గమనించి రమేష్‌ను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.రామ్మోహన్ పేర్కొన్నారు.


ఎండు గంజాయి స్వాధీనం

- ముగ్గురు అరెస్టు

కాజీపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాజీటలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఎండు గంజాయి కవర్‌లతో ఉన్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాజీపేట ఎస్సై వి.లవన్‌కుమార్ బృందం ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా ఎఫ్‌సీఐ వెనకాల సోమిడి సమీపంలో విష్ణుపురి ఎస్సీకాలనీకి చెందిన ఇమ్మడి విష్ణువర్ధన్, తిలక్‌నగర్‌కు చెందిన గండికోట వేణుగోపాల్, సోమిడికి చెందిన పాలడుగుల ఉదయ్‌కుమార్‌లు ఎండు గంజాయి ప్యాకెట్‌లతో పట్టుబడ్డారు. వీరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. పట్టుబడ్డ 100 గ్రాముల గంజాయి విలువ రూ.6వేలు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు.

ఆర్మీ జవాన్ అదృశ్యం

- పూసలతండాలో కలకలం



నవీన్ (ఫైల్)

మరిపెడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్మీ జవాన్ అదృశ్యమైన ఘటన మరిపెడ మండలం గిరిపురం శివారు పూసలతండాలో ఆదివారం కలకలం రేపింది. ఆ తండాకు చెందిన మూడ్ నవీన్ గత ఆరేళ్ల నుంచి ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్నారు. ఇటీవలఆయన భార్యకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో సెలవుపై పూసలతండాకు వచ్చారు. భార్యను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి శస్త్ర చికిత్స చేయించారు. డ్యూటీకి వెళ్తున్నానని కుటుంబ సభ్యులతో చెప్పి తన కారులో ఆస్పత్రి నుంచి బయలుదేరారు. ఆయన బయటికి వెళ్లిన తర్వాత కొన్ని గంటల్లో సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు ఆరా తీయగా ఏపీలోని శ్రీశైలం డ్యామ్ వద్ద కారు నిలిపివేసి సెల్‌ఫోన్ కారులోనే వదిలేసి జవాన్ అదృశ్యం అయ్యారు. ఆయన కుటుంబ సభ్యులు, తండా వాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జవాన్ నవీన్ అదృశ్యంపై మరిపెడ పీఎస్, శ్రీశైలం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సెలవుల విషయంలో ఆర్మీ ఉన్నతాధికారులకు జవాన్ నవీన్‌కు తేడాలు రావడంతో ఆయన అదృశ్యమైనట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

కాటారం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని విలాసాగర్ మానేరు నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను శనివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు కమలాపూర్ క్రాస్ సమీపంలో పట్టుకుని సీజ్ చేసినట్లు వెల్లడించారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌లో పెట్టి డ్రైవర్లు సంతోష్, తిరుపతి, నవీన్, జనార్దన్, తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బానిసైతే.. గేమ్ ఓవర్

- మొబైల్ ఆటలతో జీవితాలు విచ్ఛిన్నం
- లక్షల్లో బెట్టింగ్‌లు.. మోసపోయి అవస్థలు
- ఆన్‌లైన్ గేమింగ్స్‌తో కుటుంబాలు చిన్నాభిన్నం
- బాధితుల్లో పోలీసులూ, సింగరేణి ఉద్యోగులు!

భూపాలపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఆటలు, బెట్టింగ్‌లకు యువత, విద్యార్థులు బానిసలుగా మారుతున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆశలు వారిని ఈ విష వలయంలోకి దిగేలా చేస్తోంది. మొదట్లో సరదాగా మొదలవుతున్న ఆన్‌లైన్ గేమ్, బెట్టింగ్‌లు క్రమంగా వ్యసనంగా మారి ఆస్తులను అమ్ముకొని, అప్పులు చేసి అయినా ఆటల్లో పెట్టుబడి పెట్టేలా కొన్ని యాప్‌లు ప్రేరేపిస్తున్నాయి. మొబైల్ సాధనంగా మొదలవుతున్న ఈ ఆన్‌లైన్ గేమ్‌ల వలలో చిక్కుకుంటున్న విద్యార్థులు, యువకులే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఆ ఉచ్చులోంచి బయట పడలేక విలవిలలాడి పోతున్నారు. దీంతో ఆటల కోసం చేసిన అప్పులు తీర్చలేక బయట ఎవరికీ చెప్పుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతుండటంతో కుటుంబాలకు కుటుంబాలే చిన్నాభిన్నమైపోతున్నాయి. మరి ముఖ్యంగా ఆన్‌లైన్‌లో నిర్వహించే పెయిడ్ గేమ్స్‌కు బాధ్యతయుతమైన ఉద్యోగాల్లో ఉన్న పోలీసుల వంటి వారు కూడా బానిసలుగా మారి లక్షల్లో నష్టపోయిన పరిస్థితి జిల్లాలో ఉందని తెలుస్తోంది. అంతేకాదు.. సింగరేణి గనుల్లో పని చేసే వందలాది మంది కార్మికులు, జెన్కోలో పని చేసే ఉద్యోగులు ఈ ఆన్‌లైన్ వలలో చిక్కుకొని లక్షల్లో నష్టపోయినట్టు పోలీస్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు చెబుతుండటం విస్మయం కలిగిస్తోంది.

రూట్ మార్చిన నిర్వాహకులు

ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌ల అరచకాలు భారీగా పెరిగిపోవటంతో కొంత కాలంగా పోలీసులు ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాపై దృష్టించారు. ఇందులో కొన్నింటిని అరెస్టు కూడా చేశారు. దాంతో యాప్‌ల నిర్వాహకులు రూట్ మార్చి టెలిగ్రాం, వాట్సాప్ వంటి ప్లాట్‌ఫాంల ద్వారా లింక్‌లను పంపుతూ యథాతథంగా ఈ మాయదారి బెట్టింగ్‌ల వ్యవహారాన్ని కొనసాగిస్తున్నట్టు గుర్తించారు.



ఇదిలా ఉంటే.. విద్యార్థులు, యువకులు సరదాగా మొదలెడుతున్న ఆన్‌లైన్ ఆటల మూలంగా గంటలకు గంటలు సమయాన్ని వెచ్చిస్తూ శారీరకంగా, మానసికంగా అనేక సమస్యలకు గురవుతున్నారు. ముఖ్యంగా గంటల కొద్దీ ఆన్‌లైన్ గేమింగ్‌లో మునిగి పోతుండటం వల్ల వారి మానసిక స్థితిపై తీవ్రప్రభావం చూపటమేకాకుండా చదువులపై ఏకాగ్రత కోల్పోతున్నట్టు మానసిక వైద్యులు చెబుతున్నారు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడకుండా తల్లిదండ్రులు వారించే ప్రయత్నం చేస్తే వారిపైన తిరుగబడుతూ సైకో మాదిరిగా ప్రవర్తిస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. ఆన్‌లైన్ గేమింగ్ వల్ల చిన్న పిల్లల ప్రవర్తనలో తీవ్రమైన దుష్ప్రవర్తనలు కన్పిస్తున్నాయి. గేమ్స్ ఆడుతున్న సమయంలో అన్న పానీయాలు తీసుకోవటం లేదు.

మోసాలు జరుగుతున్నాయి ఇలా..

బోగస్ వెబ్ సైట్లు, నకిలీ యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లు, గేమింగ్‌ల ఆటలు ఆడుతున్న వ్యక్తుల డాటా, బ్యాంకుల వివరాలను సేకరించి కేవైసీ పేరుతో వ్యక్తిగత సమాచారం తీసుకొని డబ్బులు వేసినట్టుగా మొదటి, రెండో దఫాల్లో లాభాలు చూయిస్తారు. ఆ తర్వాత మరింత పెట్టుబడి పెట్టేల ప్రేరేపిస్తారు. ఆ పెట్టుబడి స్థాయి రూ.50 నుంచి లక్షలకు చేరిన తర్వాత కొత్త రిజిస్ట్రేషన్ కావాలని మెలిక పెడుతున్నారు. కొత్త రిజిస్ట్రేషన్ పూర్తి అయితే విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలాగే ఆడుతున్న వారు వ్యక్తిగత బ్యాంకు వివరాలను వారికి అందజేయగానే ఖాతాల్లో ఉన్న డబ్బులంతా ఊడ్చేసి మాయమైపోతారు. తీరా మోసపోయామని గుర్తించి ధైర్యం చేసి పోలీస్‌స్టేషన్లకు వెళ్తే ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ఉనికి అందుబాటులో ఉండదు. ఈ లింక్‌లన్నీ కూడా విదేశాల్లో ఉండే ప్రాంక్సీ సర్వర్ల ద్వారానే నిర్వహిస్తారు. ఈ తరహా వెబ్‌సైట్‌లు ఎక్కువగా తీన్‌పత్తి, రమ్మీసర్కిల్, డ్రీం-11, ఎంపీఎల్ వంటి ఆన్‌లైన్ గేమ్స్‌తో పాటు వన్‌విన్, బెట్‌పే, వన్ ఇంటుబెట్ వంటి బెట్టింగ్ యాప్‌లు, క్యాసినో తరహాలో ఉండే డైస్, పిన్‌విల్స్ వాటి ద్వారానే లక్షల్లో బెట్టింగ్ పెట్టేలాప్రేరేపిస్తున్నారు. చిన్న మొత్తాలు గెలిపించి నమ్మకం కల్పిస్తారు. పెద్దమొత్తాలు పెట్టిన తర్వాత అసలు మోసాలు మొదలవుతాయి. ఈ వలయంలో చిక్కుకున్న బాధితులు ఇంకా డబ్బు వస్తుందన్న ఆశతో ఉన్నదంతా ఊడ్చేసి మరి పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ తరహా మోసాలకు సంబంధించి ఇప్పటి వరకు భూపాలపల్లి జిల్లాలో అధికారికంగా 11 కేసులు మాత్రమే నమోదు కాగా, అనధికారికంగా ఈ సంఖ్య వందల్లో ఉంటుందని ఎస్పీ కార్యాలయ సిబ్బందే చెబుతుండటం గమనార్హం.

సరదాగా మొదలై..

సరదాగా మొదలెట్టిన ఈ ఆన్‌గేమ్‌లు క్రమంగా ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనానికి కూడా దారి తీస్తున్నాయని తెలుస్తోంది. . ముఖ్యంగా డ్రీం-11 క్రికెట్, ఫుట్‌బాల్, క్యాసినో, రూలేట్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పెడుతూ మానసికంగా ఆర్థికంగా నష్టపోతున్నారు. చేతిలో మొబైల్ గాల్లో డబ్బుల ఆశ అన్నట్టుగా చిన్న మొత్తాలు మొదలయ్యే బెట్టింగ్ వ్యవహారం క్రమంగా లక్షల్లో పెట్టుబడులు పెట్టే స్థాయికి చేరుకుంటోందని ఇటీవల పోలీసులు జరిపిన పరిశీలనలో తేలింది. ఈ తరహా ఆటల్లో మొదట్లో యాప్ నిర్వాహకులు స్వల్పంగా విజయాలు చూయించినా డబ్బుపై ఆశతో పెట్టుబడి పెడుతున్న వారి మానసిక పరిస్థితిని ఆసరాగా చేసుకొని భారీ స్థాయికి చేరుకోగానే ముఖం చాటేస్తున్నారు. మోసపోయిన వారిని గుర్తించే లోపే సదరు యాప్ నిర్వాహకులు బెట్టింగ్ వారి నెంబర్లను బ్లాక్ చేసి అందుబాటులో లేకుండా ఉడాయిస్తున్నారు. దీంతో లక్షల్లో నష్టపోయిన బాధితులు మోసపోయామన్న విషయాన్ని బయటకు చెప్పుకోలేక, పరువు పోతుందని పోలీసులకు ఫిర్యాదు చేయలేక లోలోనే కుమిలి పోతున్నారు. మరికొంత మంది అప్పులు చేసి మరి పెట్టుబడులు పెట్టిన వారు వాటి తీర్చే మార్గం కన్పించక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. భూపాలపల్లి జిల్లాలో దాదాపు పది మంది విద్యార్థులు, యువకులు బలవర్మరణం పాల్పడినట్టు పోలీసులు చెబుతున్నారు. అయితే.. ఈ ఆత్మహత్యలకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఇతర కారణాలు చూయించారని అంటున్నారు.

విద్య, వైద్యం, మౌలిక రంగాలు నిర్వీర్యం

గత పాలకుల విధానాల వల్ల నష్టాలు » రాష్ట్రాభివృద్ధి నమూనాలో మార్పు రావాలి
ప్రజల చైతన్యంతోనే సమగ్రాభివృద్ధి » సెంట్రల్ వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్



సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్

హనుమకొండ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల విధానాల వల్ల విద్య, వైద్యం, మౌలిక రంగాలు నిర్వీర్యమయ్యాయని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి నమూనాలో మార్పు రావాలని ప్రజల చైతన్యంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధిస్తుందని సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ ఆధ్వర్యంలో 'అప్పుల ఊబిలో చిక్కుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఆర్థిక వ్యవస్థ, కారణాలు పర్యావసనాలు, పరిష్కారాలు' అనే అంశంపై ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు.

ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. గత పాలకుల విధానాల వల్ల విద్య, వైద్యం, మౌలిక రంగాలు నిర్వీర్యమయ్యాయన్నారు. ప్రజల రాజకీయ చైతన్యంతో రాజకీయ పార్టీల స్వభావంలో మార్పుతోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగుపడి సమగ్రాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి నాయకత్వం వహించిన కేసీఆర్.. మేధావుల సూచనలను పట్టించుకోలేదని, ఎవరి మాట వినలేదని అన్నారు. నేటి పాలకులు మేధావుల సూచనలు విన్నప్పటికీ వాటి అమలుపై నిర్లక్ష్యం వహిస్తుండడం సరి కాదన్నారు.

రాజకీయాలు మొత్తంగా డబ్బు మయమయ్యాయని కోట్లు ఖర్చు చేయనిదే ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదని దాని వల్ల ప్రజల మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి అటకెక్కిందన్నారు. పాలకులు, కార్పొరేట్ వ్యాపారులు, అవినీతి ఉన్నతాధికారుల వల్ల ప్రజలకు ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. వ్యవస్థలో విలువలతో కూడిన రాజకీయాలు నిర్మితం కావాలని, పౌర సమాజం నిశబ్ధంగా ఉంటే ప్రజా స్వామ్యానికి ప్రమాదమని తెలిపారు.

హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆర్‌వీ రమణమూర్తి.. మాట్లాడుతూ రూ.50వేల కోట్లు వ్యవసాయానికి వరి ఉత్పత్తికి ఖర్చు చేస్తే, రూ.68వేల కోట్లు వరి ధాన్యం పండిస్తున్నారని, పంటల విధానంలో మార్పులు తీసుకురావాలని అన్నారు.

ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఇట్యాల పురుషోత్తం మాట్లాడుతూ.. విద్యారంగంలో గత ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టి నాణ్యమైన విద్య పేద వర్గాలకు అందకుండా చేశాయని విమర్శించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ పాలనలో అన్నీ తానై ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చారని దీంతో రాష్ట్ర వృద్ధి రేటు పెరిగినప్పటికీ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేశారన్నారు. గత పాలకుల విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడడంతో మిగతా రంగాలన్నీ కుదేలై రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందన్నారు. రాష్ట్రంలో పత్యామ్నాయ వ్యవసాయ అభివృద్ధి, ఉన్నత విద్య అభివృద్ధి చేసుకోవల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సదస్సులో ప్రొఫెసర్ సదానందం, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, వీరమల్ల బాబురావు, పల్లపు సమ్మయ్య, మల్లారెడ్డి, సంపత్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, వల్లాల జగన్‌గౌడ్, సంగాని మల్లేశ్వర్, కొంగ వీరస్వామి, మేకల కేదారి యాదవ్, నలిగింటి చంద్రమౌళి, లంక పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో భక్తుల సందడి



తాడ్వాయి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండం మేడారం వనదేవతలను దర్శించుకోవ డానికి భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా జంపన్నవాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరించి గద్దె వద్దకు చేరుకున్నారు. అనంతరం వనదేవతలకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారే, కొబ్బరికాయలు, ఎత్తుబంగారం(బెల్లం) సమర్పించుకున్నారు. 20వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

← వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

వ్యవసాయ బావిలో మృతదేహం

మృతిపై రేకెత్తుతున్న అనుమానాలు


గండికోట సామ్రాజ్యం (ఫైల్)

ఎల్కతుర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామ శివారులో ఆదివారం ఓ వ్యవసాయ బావిలో అనుమానాస్పద స్థితిలో మృతదేహం లభ్యమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన గండికోట సామ్రాజ్యం (35) అనే వ్యక్తి గ్రామానికి చెందిన గ్రామంలో వ్యవసాయ కూలీ, బండలను కొట్టి జీవనం సాగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సామ్రాజ్యం పావురాల షికారు కోసం బయటకు వెళ్లి ఎంతకూ తిరిగి రాలేదు. అయితే అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భాస్కర్‌రావు వ్యవసాయబావిలో మృతదేహం లభ్యమైంది. ఈ విషయాన్ని ఎల్కతుర్తి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనాస్థలానికి చేరుకున్న ఎస్సై అకినపల్లి ప్రవీణ్‌కుమార్.. మృతదేహన్ని వ్యవసాయ బావి నుంచి బయటకు తీశారు. శవపంచనామా నిర్వహిస్తున్న సమయంలో మృతుడి కాలుకు విద్యుత్ షాక్ తగిలిన గాయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అడవి పందుల కోసం, విద్యుత్ షాక్‌తో కూడిన ఉచ్చులు బిగించగా వాటికి సామ్రాజ్యం తగిలి ప్రమాదానికి గురి కావడంతో మృతి చెంది ఉంటాడని, అనంతరం బావిలో పడేసి ఉంటారని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆయన మృతిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతుడికి ముగ్గురు కుమార్తెలు, భార్య మమత ఉన్నారు. ఈ మేరకు మృతుడి భార్య మమత మూడో కుమార్తె డెలివరీ కోసం వెళ్లింది. ఈ క్రమంలో సామ్రాజ్యం మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


బావిలో నుంచి వెలికితీసిన మృతదేహం

అమృత్ భారత్ — పనులు పట్టాలెక్కేదెప్పుడు?

కాజీపేట రైల్వేస్టేషన్ పనులపై ఎందుకింత నిర్లక్ష్యం?

- రెండేళ్లుగా కొనసాగుతున్న సుందరీకరణ పనులు
- ఎస్కలేటర్లు లేక ప్రయాణికుల ఇబ్బందులు

కాజీపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్‌ల పునరుద్ధరణ పనుల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా 1300 రైల్వేస్టేషన్‌లు, తెలంగాణ వ్యాప్తంగా 70 స్టేషన్‌లు అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించిన రైల్వే శాఖ.. అన్నట్లుగానే దాదాపు అన్ని రైల్వేస్టేషన్‌లు రీమోడలింగ్ పనులు పూర్తి చేసింది. కానీ కాజీపేట రైల్వే జంక్షన్ పనులు మాత్రం ఇంకా నత్తనడక నడుస్తున్నాయి. కాజీపేట రైల్వేస్టేషన్‌కు రూ.24.45 కోట్లు మంజూరుచేసి నిధులు కూడా విడుదల చేసినట్లు చెబుతున్న రైల్వేశాఖ.. కాజీపేట పనులు పూర్తిచేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని పలు విమర్శలు తలెత్తుతున్నాయి. ఫిబ్రవరి 2024లో ప్రారంభించిన పనులు ఏడాదిన్నర గడిచినా పనులు ప్రారంభించి సగంలోనే వదిలేశారు. ఎయిర్‌పోర్టు స్థాయిలో స్టేషన్ పనుల సుందరీకరణ చేస్తామని చెబుతున్న అధికారులు ఆ స్థాయిలో పనులు చేయడం లేదు. కనీస సౌకర్యాలు లేక రైల్వే ప్రయాణికులు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి, అమృత్ భారత్ పనులు పట్టాలెక్కేదెన్నడో అని ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చుతున్నారు.


కాజీపేట స్టేషన్ ముందు కట్టి వదిలేసిన గడులు



స్టేషన్ ముందు మూసివేసిన దారి

ఎస్కలేటర్లు లేక తీవ్ర ఇబ్బందులు


అసంపూర్తిగా ఉన్న ఎస్కలేటర్లు

ఒక ప్లాట్‌ఫామ్‌పై నుంచి మరో ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్లడానికి అందుబాటులో ఎస్కలేటర్‌లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 2వ, 3వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఉన్న రైలెక్కాలంటే ప్లాట్‌ఫామ్ దగ్గరలోని ఉన్న నూతనంగా నిర్మిస్తున్న ఎస్కలేటర్ పనులు ఏడాదిన్నరగా నడుస్తూనే ఉన్నాయి. చాలాదూరంలో ఉన్న ఎస్కలేటర్ వద్దకు వెళ్లేసరికి రైలు మిస్సవుతుందని ప్రతీ రోజు ప్రయాణికులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. కాజీపేట జంక్షన్‌లో మూడు ప్లాట్‌ఫారాలకు అదనంగా మరో రెండు నిర్మించాల్సి ఉందని ఎన్నో ఏళ్లుగా రైల్వే అధికారులు చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. ప్లాట్‌ఫామ్‌లు ఖాళీ లేకపోవడంతో పలు రైళ్లను దూరంగా నిలిపివేసి ఒక రైలు వెళ్లాక మరో రైలును ప్లాట్‌ఫామ్ మీదుకి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. అమృత్ భారత్ స్కీంలో కేవలం బ్యూటిఫికేషన్ పనులు మాత్రమే చేపడతారా..? ప్రయాణికుల సౌకర్యార్థం ప్లాట్‌ఫామ్‌లు సైతం పెంచుతారా? అనేది ఇప్పటికీ స్పష్టత లేదు. సికింద్రాబాద్ డివిజన్‌లోనే అత్యధిక ఆదాయం తీసుకువచ్చే కాజీపేట జంక్షన్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

స్టేషన్ ముందు తవ్వకాలు

పోర్టికో నిర్మాణం పేరుతో రైల్వే స్టేషన్‌లోకి వెళ్లేందుకు ఉన్న ప్రధాన రహదారిని రేకులతో అడ్డంగా కట్టి పనులు చేపడుతున్నారు. స్టేషన్‌లోకి రైలెక్కేందుకు వస్తున్న ప్రయాణికులు దారిమూసివేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్ బయట, ప్లాట్‌ఫామ్‌లపై ఎక్కడ పడితే అక్కడ ఇనుప రైకులు, ఇనుప పైపులు, సిమెంట్ బస్తాలు, వెల్డింగ్ సామగ్రితో అస్తవ్యస్తంగా ఉంది. అమృత్ భారత్ పనులు వేగవంతంగా పూర్తిచేయడానికి ఎంపీ కడియం కావ్య చొరవ తీసుకుని త్వరితగతిన పూర్తిచేయించేందుకు అధికారులపై ఒత్తిడి తెస్తేనే పనులు త్వరగా పూర్తవుతాయని రైల్వే కార్మిక సంఘాల నాయకులు, రైల్వే ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రామాల్లో చెట్ల తీర్థాల సందడి

- మూకుమ్మడిగా వన భోజనాలకు వెళ్తున్న ప్రజలు
- ఆషాఢమాసంలో ప్రాముఖ్యత
- శ్రావణ మాసంలోనూ వనానికి..
- వర్షాలు కురిసి పంటలు పండాలని పూజలు

వర్ధన్నపేట రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం అంటేనే గ్రామ దేవతల పండుగ. గ్రామాల్లోని పోచమ్మ, కట్ట మైసమ్మ, పెద్దమ్మ తల్లి, ఎల్లమ్మ, మారెమ్మ తదితర దేవతలకు ఆషాఢమాసం ఎంతో ప్రీతిపాత్రం. పాడిపంటలు చల్లంగా చూడాలని, సకాలంలో వర్షాలు కురవాలని, పిల్ల పాప గొడ్డు గోదా ఆరోగ్యంగా ఉండాలని మొక్కుతూ చెట్ల తీర్థం వెళ్లడం అనాదిగా వస్తోంది. గ్రామ శివారుల్లోని చెట్ల మధ్య, వాగులు, నదీ ప్రవాహాల వెంట మూకుమ్మడిగా వెళ్తుంటారు. ప్రస్తుతం వరంగల్ జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో చెట్ల తీర్థం సందడి నెలకొంది.

గ్రామాలు, కులాలు, వర్గాల వారిగా వన భోజనాలకు తరలివెళ్తున్నారు. అయితే కొన్ని చోట్ల ఇదే పండుగలను సైతం భిన్నంగా జరుపుకుంటారు. ఆయా గ్రామాల్లో ఆషాఢంలో వన భోజనాలకు వెళితే, మరికొన్ని ప్రాంతాల్లో శ్రావణ మాసంలో వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

ఐకమత్యానికి దోహదం

తెలంగాణలో సంస్కృతి, సంప్రదాయానికి వనభోజనాలు, బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తాయి. అందరూ కలిసి వనభోజనాలకు వెళ్లడం, ఒకచోట చేరి పిండి వంటలు చేసుకుని ఆనందంగా గడపడం ఐకమత్యాన్ని పెంచుతోంది. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో బోనాల పండుగను కులాల వారిగా జరుపుకుంటారు. వన భోజనాల్లో కుటుంబసభ్యులే గాక, బంధువు, మిత్రులు కలిసి ఓ ఆత్మీయ సమావేశంలా నిర్వహిస్తారు. మానవ సంబంధాలను పెంచే ఈ సంస్కృతిని ప్రజలు చాలా సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. ఈ తరం యువకులూ వనభోజనాలకు వెళ్లడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. ఆటపాటలతో గడుపుతున్నారు.

ఆరోగ్యంగా ఉండాలని బయటి వంటలు

తమ కుటుంబసభ్యుల ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ఆషాఢమాసంలో వంటలకు వెళ్లడం ఆనవాయితీ. ఇందులో రెండు రకాలుగా వనభోజనాలకు వెళ్లడం కనిపిస్తుంది. కొన్ని గ్రామాల్లో గురు, ఆదివారం రోజుల్లో బయటి వంట పేరిట ఉదయం తెల్లవారుజామునే గ్రామ శివారులో ఉన్న వనంకు వెళ్తారు. అక్కడే వంటలు చేసుకుని పచ్చకూర, జంతు మాంసాలు వండి వారి సంప్రదాయం ప్రకారం పూజలు చేస్తారు. తమ కుటుంబసభ్యులు పిల్లల ఆరోగ్యాలు బాగుండాలని, గొడ్డు, గోదకు ఏ శక్తి ఆవహించవద్దని మొక్కులు చెల్లిస్తారు. కొంత మంది జంతు బలులు కూడా చేస్తారు. ఇక్కడ వండిన వంటలను తిరిగి ఇంటికి తీసుకురాకుండా చూసుకుంటారు. ఇక పుషి వంటలు (మంచి వంటలు) పేరుతో ముహూర్తాలు చూసుకుని వెళ్తారు. ఈ వన భోజనాలకు తమ శక్తి కొద్ది బంధుమిత్రులను పిలుచుకుని ఆనందంగా గడుపుతారు.


వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లందలో భోజనం చేస్తున్న కుటుంబ సభ్యులు

ఇక బోనాల సందడి

హైదరాబాద్ లాంటి ప్రధాన నగరాల్లో ఆషాఢమాసంలో బోనాలు ప్రారంభమవుతాయి. వరంగల్ నగరంలో సైతం కొన్ని చోట్ల బోనాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. కానీ ఈ ప్రాంతాల్లోని ప్రజలు శ్రావణ మాసంలో బోనాలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. తొలి ఏకాదశి ప్రారంభం కాగానే కులాల వారిగా, వర్గాల వారిగా గ్రామ పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి, జంతు బలులు చేస్తారు. అయితే కొన్ని చోట్ల జంతు బలులు లేకుండా బోనాలు చేయడం సంప్రదాయంగా వస్తోందని పండితులు చెపుతున్నారు. బోనాల పండుగలో సైతం దాదాపు అన్ని కులాలు సమ్మిళితం, ఐకమత్యంగా పనిచేయడం కనిపిస్తుంది. చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, హరిజన కులాలు దేవతలకు సంప్రదాయంగా సేవలు చేయడం ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

మన సంస్కృతికి అద్దం పడుతుంది
బొల్లు యాదవరెడ్డి, సీనియర్ సిటిజన్



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేవే మన పండుగలు. బతుకమ్మ, దసరా, బోనాలు, వనభోజనాలు, మేడారం, పీరీల పండుగలు మన సంస్కృతికి ప్రతీక. ఆషాఢమాసంలో కొత్త అల్లుడు ఇంటికి రావద్దని, ఆడబిడ్డలు తల్లిగారింటి వద్దే ఉండాలనేది మన సంప్రదాయం. ఇలాంటి కట్టుబాట్లను రేపటి తరం పాటించాలి. పండుగల విశేషాలు తెలుసుకోవాలి. తల్లిదండ్రులు వాటిని తెలియజెప్పాలి.

ధ్రువపత్రాలు లేకుండా సర్టిఫికెట్లు ఇవ్వొద్దు

- సీఐ మచ్చ శివకుమార్

వరంగల్ క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీ-సేవ కేంద్రాల నిర్వాహకులకు హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ధ్రువపత్రాలు లేకుండా సర్టిఫికెట్‌ల కోసం చేసుకున్న దరఖాస్తులను స్వీకరించొద్దని సూచించారు. కావాలని నకిలీ సర్టిఫికెట్స్ జారీ చేసే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పరశురాములు, కిషోర్ పాల్గొన్నారు.


మీ-సేవ కేంద్ర నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ శివకుమార్


వైద్య శిబిరంలో పాల్గొన్నవారితో ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

జర్నలిస్టులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి

వడ్డెపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాలంతో పోటీ పడుతూ, నిత్యం ఉరుకుల పరుగులతో వార్తలు సేకరించి సమాజానికి అందించే జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆదివారం ప్రారంభించారు. వైద్య పరీక్షలను వైద్యులు నిర్వహించి మందులను సైతం ఉచితంగా పంపిణీ చేశారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ ప్రశాంత్ రెడ్డితో పాటు ఏకశిల ఆస్పత్రి చైర్మన్ కుందూరు కరుణాకర్‌రెడ్డి మట్లాడారు. జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ శిబిరంలో కార్డియాలజిస్టు డాక్టర్లు మల్లికార్జున్, కూరపాటి మధు, వివేక్, లావణ్య, న్యూరో వైద్యులు సాయికిరణ్, శ్రీచరణ్, ఫిజీషియన్లు వైద్యం గౌతమ్, మహేష్ తదితరులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కోశాధికారి బోళ్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యామ్, కొడిపెల్లి దుర్గాప్రసాద్‌రావు, అల్లం రాజేష్‌వర్మ, యాంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు సంపెట సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, పొడిశెట్టి విష్ణువర్ధన్, వలిశెట్టి సుధాకర్‌తో పాటు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

జాతీయ సమావేశాలకు జిల్లా నాయకులు

గిర్మాజీపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్‌లో ఆదివారం ప్రారంభమైన ఎంసీపీఐయూ పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ సమావేశాలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్‌తో పాటు కేంద్ర కమిటీ నాయకులు మోర్తాల చందర్ రావు, ఎం.వెంకటరెడ్డి, ఎల్.శ్రీనివాసరెడ్డి, ఎస్.సాంబయ్య, బి.బాబు, ఎం. తిరుపతి, పి.సంధ్య, ఉదయ్ కుమార్ హాజరయ్యారు. పార్టీ కేంద్ర కమిటీ నాయకుడు ప్రేమ్‌సింగ్ భంగ్ అధ్యక్షతన గోపి కిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మూడు రోజుల జాతీయ సమావేశాల్లో భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన యుద్ధంతో పాటు ఇరాన్-ఇజ్రాయిల్-పాలస్తీనా, ఉక్రెయిన్-రష్యా యుద్ధాలు, దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అమలుచేస్తోన్న అప్రజాస్వామిక, నిరంకుశ, ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. అదేవిధంగా ప్రజా సమస్యలపై పార్టీ కార్యక్రమాల రూపకల్పన చేయనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ ఆదివారం సాయంత్రం ఫోన్‌లో తెలిపారు.

కార్మిక చట్టాలను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

కరీమాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికుల చట్టాలను, హక్కులను హరిస్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, కోశాధికారి వంగూరి రాములు ఆరోపించారు. ఆదివారం ఉర్సు గుట్ట రామ సురేందర్ భవనంలో భారతీయ కమ్యూనిస్టు పార్టీ సీపీఎం(ఐ)అనుబంధం (సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సిఐటీయు జిల్లా అధ్యక్షుడు మహ్మద్ బషీర్ అహ్మద్ అధ్యక్షత వహించిన ఈ జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర నాయకులు కాసు మాధవి, వంగూరి రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రతకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో వివిధ కార్మిక సంఘాలకు చెందిన కార్మికులలో ఐక్యత అవసరమని అన్నారు. కేంద్రంలో బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు చేసిన మంచి పని ఒక్కటీ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆరూరి కుమార్, సింగారపు బాబు, జన్న ప్రకాష్, కమిటీ సభ్యులు బ్రహ్మాచారి, కొమురయ్య, కృష్ణ, ప్రభాకర్, వాణి, ఉపేందర్, శ్రీనివాస్, యాదగిరి, పలువురు కార్మిక నాయకులు, కార్మికుల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం, మారుతీనగర్, ప్రణయ్‌భాస్కర్ కాలనీ, ప్రశాంత్‌నగర్ ఏరియా, కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని సుబేదారి, శాంతినగర్, పోస్టల్‌కాలనీ, ఎక్సైజ్ కాలనీ, అదాలత్ జంక్షన్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఈద్గా, పోచమ్మకుంట, ఏరియాలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

యూనివర్సిటీ భూములను కాపాడాలి

పోచమ్మమైదాన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపట్టవద్దని, యూనివర్సిటీ భూములు కాపాడాలని కేయూ విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్‌కు వరంగల్ నగరంలో కలిసి వినతి పత్రం అందజేశారు. భావితరాలకు యూనివర్సిటీ భూములు అందించాలని, భూములను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు గడ్డం నాగార్జున, కామగోని శ్రావణ్, మర్రి మహేష్, ఎల్తూరి సాయికుమార్, మధుసూదన్, ఉప్పుల శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం

» కబ్జాల నియంత్రణలో అధికారుల ఉదాసీనత
చోద్యం చూస్తున్న పాలకులు » ఆందోళనలో బాధితులు

హసన్‌పర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల కబ్జాల నియంత్రణలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, శిఖం భూములు కబ్జాకు గురవుతున్నప్పటికి సంబంధిత శాఖల అధికారులు మిన్నకుండడంపై పలు అనుమానాలకు తావిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. హసన్‌పర్తిలో ఎస్‌బీఐ బ్యాంకు పక్క నుండి మొదలైన పెద్ద చెరువు కట్టను మాయం చేసి చెరువులోనే డ్రైనేజీ కాలువను ఏర్పాటు చేశారు. శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు గత బీఆర్ఎస్ పాలకులు, రెవెన్యూ, ఐబీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే శిఖం భూములు కబ్జాకు గురయ్యాయని గ్రామస్తులు గగ్గోలు పెట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా చెన్నంగి చెరువు, చౌదరి కుంట రిజర్వాయర్‌తో పాటు భీమారం శ్యామల చెరువు, హసన్‌పర్తి రెవెన్యూ శివారులోని సర్వే నెంబర్ 127 ప్రభుత్వ ఆసుపత్రి,


శ్యామల చెరువులో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలు

సంస్కృతి విహార్ భూములు, ఎల్లాపూర్ సాంబ చెరువు కుంట కట్ట శిఖం భూములు అన్యాక్రాంతం అవుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు కనీసం స్పందన లేకపోవడం పట్ల ప్రజా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

ప్రస్తుతం భీమారం సర్వే నెంబర్ 642 శ్యామల చెరువు భూమిలో గత కొన్ని సంవత్సరాలుగా అప్పటి గ్రామ పంచాయతీ సూచన మేరకు కొంత భాగాన్ని శ్మశాన వాటికగా ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలోనే కొంత మంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణ ముసుగులో ప్రైవేటు వ్యక్తులు చెరువు శిఖం భూమిని కబ్జా చేసి ప్రయోజనం పొందేలా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలిసిన కొంత మంది యువకులు చెరువు శిఖం భూముల కబ్జాపై అధికారుల దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆర్‌డీవో రమేష్ రాథోడ్ ఎల్లాపూర్ సాంబ చెరువు కుంటకట్టను, ఆర్ఐ ఫాజిల్ భీమారం శ్యామల చెరువును సందర్శించి సంబంధిత శాఖల అధికారులను నివేదిక తయారు చేసి కబ్జా భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం
రమేష్ రాథోడ్, హనుమకొండ ఆర్డీవో

మండల పరిధిలోని ఆయా గ్రామాలలో చెరువు, కుంట, కుంట కట్టల, శిఖం భూముల కబ్జాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసుల నమోదుకు కృషి చేస్తున్నాం. ఎక్కడైతే గ్రామస్తుల నుంచి ఆరోపణలు వచ్చాయో సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసి నివేదిక రూపొందించి వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేయించి ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం.


సాంబ చెరువు కుంట శిఖం భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో రమేష్ రాథోడ్

గురువులే మార్గదర్శకులు

» జమ్మూ కేంద్రియ విశ్వవిద్యాలయ వీసీ అనిశెట్టి రవీంద్రనాథ్ » ఘనంగా ప్రభుత్వ మర్కజీ గోల్డెన్ జూబ్లీ వేడుకలు


ఆర్‌వి.స్వామి, చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

హనుమకొండ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాల కిందట ఆరోజుల్లో జంగిలి లక్ష్మయ్యలాంటి ఎంతో నిబద్ధత కలిగిన గురువర్యుల విద్యాబోధనలే తమ భావిజీవితానికి మార్గదర్శనంగా నిలిచాయని ప్రస్తుత జమ్మూ కాశ్మీర్ జమ్మూ కేంద్రియ విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్, అక్కడి నిట్ డైరెక్టర్ కూడా అయిన అనిశెట్టి రవీంద్రనాథ్ అన్నారు. 1975లో ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన ఏబీసీ సెక్షన్ల పూర్వ విద్యార్థులు ఆదివారం హనుమకొండలోని ఆఫీసర్స్ క్లబ్ వేదికగా గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఆనందోత్సవాల మధ్య అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ మూడు గంటలపాటు నేత్రపర్వంగా నిర్వహించారు.

ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థి పొట్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ శాఖలో డీఐజీగా ఉద్యోగ విరమణ చేసిన పరిటాల సుబ్బారావు మాట్లాడుతూ.. గురువుల బోధనలు మార్గదర్శనం, తమపై మెండుగా ఉన్నాయన్నారు.

ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్‌గా పని చేసిన రాజశేఖర్, హైకోర్టు అడకేట్ దయానంద్, జర్నలిస్టుగా సుదీర్ఘకాలం పని చేసిన పింగిళి నళినికాంత్, నాటకరంగ ప్రయోక్త రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు సదానందం, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ సంపత్ కుమార్, టి.ప్రకాశ్‌రావు, కృష్ణమూర్తి, కారొనెట్ రాంచందర్ తదితరులతోపాటు వివిధ హోదాల్లో పనిచేసిన బ్యాంక్, పోలీసు, ఇంజనీరింగ్ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల వాస్తవ జీవితాలే గురుదక్షణగా భావిస్తున్నట్లు సత్కారం అందుకున్న ఆర్‌వి.స్వామి అన్నారు. ఇంత కాలమైనా గుర్తుంచుకొని సత్కరించిన విద్యార్థులను ఆశీర్వదించారు.

ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు

కేయూ క్యాంపస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్ఆర్ఎం విభాగాధిపతి ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాసరావుకు ప్రతిష్ఠాత్మకమైన అల్లూరి సీతారామరాజు మెమోరియల్ ఆర్గనైజేషన్ విశాఖపట్నం వారి సేవ జ్యోతి లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు-2025 అందుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో సేవజ్యోతి లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డును అందజేశారు. అవార్డును సాధించిన శ్రీనివాసరావును పలువురు అభినందించారు.


నిర్వాహకుల నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

భవానినగర్‌లో ఉచిత వైద్య శిబిరం


భవానినగర్‌లో వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

వడ్డెపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని భవాని నగర్ కమ్యూనిటీ హాల్‌లో భవాని నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గురిజపల్లి ప్రకాశ్‌రావు, ఉపాధ్యక్షుడు చాడా శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపెట వీరయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె.నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్లు అజిత్ మహ్మద్, శిరీష్, డి.ప్రసన్నకుమార్, కె.రాజేశ్వరి, నరేష్‌కుమార్, రాంరెడ్డి, గీతాంజలి, వంశీ, సముద్రాల నరేష్ తదితరులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులతో పాటు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు దొమ్మటి సాంబయ్య, చీటూరి అశోక్, కాంగ్రెస్ శ్రేణులు కేతిడి దీపక్‌రెడ్డి, తేళ్ల సుగణకిశోర్‌తో పాటు ప్రొఫెసర్ రాంరెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ అసిస్టెంట్ మేనేజర్ న్యాతగాని లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

వరంగల్ క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందినట్లు హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం గుండ్లకార్తీ గ్రామానికి చెందిన పోతుల కౌసల్య (45) హనుమకొండ హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటూ సుప్రభ హోటల్‌లో క్లీనింగ్ వర్కర్‌గా పని చేస్తోంది. ఈమెను ఆదివారం ఉదయం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా తీవ్రగాయాలవడంతో స్థానికులు ఎంజీఎంకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మరణించినట్లు సీఐ తెలిపారు.


మృతి చెందిన కౌసల్య

బాధిత కుటుంబానికి చేయూత


బాధిత కుటుంబానికి డిపాజిట్ బాండ్‌ను అందిస్తున్న స్నేహితులు

హసన్‌పర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పోరండ్ల వెంకటేశ్వర్లు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. 1996-97 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు రూ.64వేలను మృతుడి కుమారుడి పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ కుటుంబానికి ఆదివారం బాండ్ అందజేశారు. కార్యక్రమంలో ఇమ్మడి రాజేందర్, చాతళ్ల వేణుగోపాల్, శ్రీనివాస్, ముప్పు అశోక్, సంపత్, పురుషోత్తంరెడ్డి, కనకస్వామి, రజనీకాంత్, యుగంధర్, వంశీ, కుమారస్వామి, బతుకయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శాకంబరి వేడుకలు

వరంగల్ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి అమ్మవారి దేవాలయంలో 16 రోజుల పాటు అంగరంగ వైభవంగా కొనసాగిన శాకంబరి వేడుకలు ఆదివారం ముగిశాయి. ఉత్సవాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిళ్లు, క్యూ లైన్లను తొలగించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనం కోసం తరలి వచ్చారు. భక్తులకు దేవస్థానం అన్నదాన సత్రంలో భోజన ప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యాలను ఈవో శేష భారతి పర్యవేక్షించారు.

పద్మశాలీల సామూహిక వన భోజనాలు

హనుమకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని శ్రీ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక వనభోజనాలు, ఆషాఢమాస వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. భీమారంలో సుమారు 108 పద్మశాలీ కుటుంబాలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సామూహిక వనభోజనాల సందర్భంగా నిర్వహించిన ఆటపాట కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ సేవా సంఘం అధ్యక్షుడు మేరుగు సత్తయ్య, ప్రధాన కార్యదర్శి తేరాల నరసింగరావు, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, హనుమకొండ జిల్లా మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, పద్మశాలీ సంఘం కమలాపూర్ మండల అధ్యక్షుడు బొప్ప శివశంకర్, గాడిపల్లి శంకరయ్య, మామిడాల ప్రకాశ్, కనకయ్య, పద్మశాలీలు పాల్గొన్నారు.


వన మహోత్సవంలో పాల్గొన్న పద్మశాలీల కుటుంబాలు

ముురుగు పారదు.. దోమలు వదలవు

» అస్తవ్యస్తంగా డ్రెయినేజీ కాలువలు
» పట్టించుకోని అధికారులు


బాలసముద్రంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో రోడ్డుపై ఉన్న చెత్తాచెదారం

హనుమకొండ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని బాలసముద్రంలో డ్రెయినేజీ కాల్వల్లో మురుగు నీరు నిలిచిపోయి కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో వర్షాలకు మురుగు నీరు రోడ్లపైకి చేరడంతో నగర వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రెయినేజీ కాల్వల్లో పూడిక మట్టితో నిండిపోవడంతో డ్రెయినేజీ కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో నగర ప్రజలు మురుగునీరు కాల్వలు, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని నగర వాసులు వాపోతున్నారు.

- బాలసముద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం నుంచి కూరగాయల మార్కెట్ సమీపంలోని డ్రెయినేజీ కాలువ శిథిలావస్థలోకి చేరి మురుగు నీరు పారడం లేదు. దీంతో దోమలు వృద్ధి చెంది కాలనీ ప్రజలకు రాత్రివేళల్లో కంటిమీద కునుకులేకుండా చేస్తున్నట్లు వాపోతున్నారు. పలు కాలనీలు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నట్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

రోడ్డు పైనే చెత్త

నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద చెత్తసేకరణ కోసం మున్సిపాలిటీ అధికారులు చెత్తకుండీలు ఏర్పాటు చేశారు. రెండు, మూడు రోజులకు కూడా చెత్త తరలించకపోవడంతో గాలికి చెత్త రోడ్లపైకి చేరి అస్తవ్యస్తంగా మారుతున్నట్లు చెబుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో చెత్త తరలింపులో నిర్లక్ష్యం చేస్తున్నారని కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు. జూన్ మొదటి వారంలో వర్షాలు కురిసినప్పటికీ డ్రెయినేజీ కాల్వలు శుభ్రం చేయకపోవడంతో ఎక్కడపడితే అక్కడ చెత్త కాల్వల్లో పేరుకుపోయి డ్రెయినేజీ మురుగు నీరుతో దుర్వాసన వెదజల్లుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శిథిలావస్థలో ఉన్న డ్రెయినేజీ కాల్వలను శుభ్రం చేసి అవసరమైన కాల్వలకు మరమ్మతు పనులుచేపట్టి రోడ్డుపైన చెత్తకుండీలు ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని నగర ప్రజలు అధికారులను కోరుతున్నారు.





కోట శ్రీనివాసరావు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

కోట తెరాభినిష్క్రమణం

(మొదటిపేజీ తరువాయి)

పరిమితమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున.. హైదరాబాద్ ఫిలింనగర్‌లోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు! కోట శ్రీనివాసరావుకు భార్య రుక్మిణీ, కుమార్తెలు పావని, పల్లవి ఉన్నారు. ఆయన కుమారుడు కోట వెంకట అంజనేయ ప్రసాద్ కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో.. పెద్ద మనవడు శ్రీనివాస్.. అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఫిలింనగర్‌లోని కోట నివాసం నుంచి అభిమానులు, కుటుంబసభ్యుల కన్నీటి వీడ్కోలు నడుమ అంతిమ యాత్ర ప్రారంభమైంది. సాయంత్రం 4.30 గంటల సమయంలో జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు ముగిశాయి. అంత్యక్రియల్లో సినీనటులు అలీ, కోట శంకరరావు, మాదాల రవితో పాటు సినీ ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ ఒడిలో పెరిగి.. కళామతల్లి సేవలో ఎదిగి

కోట శ్రీనివాసరావు 1942 జూలై 10వ తేదీన.. కృష్ణా జిల్లా కంకిపాడులో సీతారామాంజనేయులు, సుశీల దంపతులకు జన్మించారు. కంకిపాడు పరిసర ప్రాంతాల ప్రజలకు సీతారామాంజనేయులు ఓ గొప్ప వైద్యుడిగా తెలుసు. ఆయనకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వారిలో రెండవ కుమారుడు కోట శ్రీనివాసరావు. కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలో కోట చదువుకున్నారు. కళాశాలలో చదుకునే రోజుల్లోనే నాటకాలు వేసేవారు. అనంతరం కంకిపాడు బస్టాండ్ సమీపంలోని స్టేట్ బ్యాంకులో చేరి కొన్నాళ్లు ఉద్యోగం కూడా చేశారు. బ్యాంకు ఉద్యోగం చేస్తున్నా.. నటనపై ఆసక్తితో నాటకాలలో వేషాలు వేస్తూ ఉండేవారు. నిజానికి తాను కూడా తన తండ్రిలాగానే వైద్యుణ్ని కావాలనుకున్నానని.. కానీ, ప్రవేశ పరీక్షలో రెండు శాతం మార్కులు తక్కువగా రావడంతో ఆ అవకాశాన్ని కోల్పోయి, మామూలు గ్రాడ్యుయేట్‌ని అయ్యానని చెప్పేవారాయన. ఈ క్రమంలోనే.. ఒకసారి హైదరాబాద్‌లో ఆయన తన బృందంతో 'ప్రాణం ఖరీదు' నాటిక వేస్తే.. ప్రముఖ దర్శకుడు క్రాంతి కుమార్ చూసి దాన్ని సినిమాగా తీయాలనుకున్నారు. ఆ సినిమాలో రావుగోపాలరావు వేసిన పాత్ర.. స్టేజీ మీద కోట శ్రీనివాసరావే వేసేవారు. ఆ నాటిక స్ఫూర్తితో తీస్తున్న సినిమా కాబట్టి అందులోని పాత్రధారులందరికీ సినిమాలో కూడా చిన్నచిన్న పాత్రలు ఇవ్వాలని క్రాంతి కుమార్ అనుకున్నారు. అలా కోట ఆ సినిమాలో నాలుగైదు సీన్లున్న చిన్న పాత్ర చేశారు. ఆ తర్వాత.. తెలంగాణ ప్రాంతంలో బడుగుల జీవితాలపై యండమూరి వీరేంద్రనాథ్ రాసిన 'కుక్క' అనే నాటికను నటుడు నారాయణరావు సినిమాగా తీశారు. అందులో కోట 'దొర' పాత్ర వేశారు. 1982లో.. 'మీరైతే ఏం చేస్తారు?' అనే నాటికలో కోట నటన చూసిన దర్శకుడు టి.కృష్ణ ఆయనకు 'వందేమాతరం' సినిమాలో ఒక పాత్ర ఇచ్చారు. అలా చిన్నా చితకా వేషాలు వేస్తున్న కోట శ్రీనివాసరావు సిసలైన సత్తాను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసింది.. 'ప్రతిఘటన' సినిమా. అందులో మినిస్టర్ కాశయ్యగా తెలంగాణ యాసలో అదరగొట్టిన కోట బలమైన ముద్ర వేశారు. కైకాల సత్యనారాయణ, రావుగోపాలరావు, గిరిబాబు, గొల్లపూడి వంటి మేటి విలన్లు ఉన్న రోజులు కావడంతో ఆయనకు పెద్ద హీరోల సినిమాల్లో విలన్ పాత్రలు దొరికేవి కావు. అలా సాగిపోతున్న ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా వచ్చింది.. 'అహ నా పెళ్లంట' సినిమా. అందులో పిసినారి లక్ష్మీపతి పాత్రకు కోట శ్రీనివాసరావును దర్శకుడు జంధ్యాల ఏరికోరి ఎంచుకున్నారు. క్రమంగా.. అటు విలనీ, ఇటు కామెడీ.. మధ్యమధ్యలో కామెడీవిలనీ చేస్తూ కోట శ్రీనివాసరావు తనదైన ముద్ర వేశారు. ఒకటా రెండా.. వందలాది చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకుల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. ప్రతిఘటన హిందీ రీమేక్‌లో, సర్కార్ సినిమాలో అమితాబ్ బచ్చన్‌తో నటించి.. హిందీ ప్రేక్షకులకు కూడా ఆయన పరిచయమయ్యారు. 1999లో అనూహ్యంగా రాజకీయ రంగప్రవేశం చేసిన కోట.. బీజేపీ తరఫున విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ప్రత్యర్థి ఐలాపురం వెంకయ్యపై 57వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచారు. విజయవాడకు మొదటి ఫ్లైఓవర్‌గా నిలిచే అజిత్‌సింగ్ ఫ్లైఓవర్ నిర్మాణం ఆయన హయాంలోనే జరిగింది. 2004 తర్వాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. చిరంజీవితోపాటే మొదలైన కోట సినీ కెరీర్.. ఆయన సోదరుడైన పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు'తో ముగియడం గమనార్హం.

తరలి వచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు..

కోట శ్రీనివాస్ మరణంతో తెలుగు చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. ఆయన్ను చివరిసారి చూసి నివాళులర్పించేందుకు తారాలోకమంతా ఆయన ఇంటికి తరలివచ్చింది. పలువురు రాజకీయ ప్రముఖులు కూడా ఆయన ఇంటికి చేరుకుని పుష్పాంజలి ఘటించారు. ప్రధాని నరేంద్ర మోదీ.. కోట శ్రీనివాసరావు మృతి పట్ల 'ఎక్స్' వేదికగా సంతాపం తెలిపారు. ఆయన తన అద్భుత నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారని.. సామాజిక సేవలో కూడా ముందుండేవారని, పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు కోట ఇంటికి చేరుకుని ఆయనకు నివాళులర్పించారు. కోట మృతి పట్ల.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కోట శ్రీనివాసరావు మృతి చాలా బాధాకరమని.. ఎమ్మెల్యేగా ఆయన గొప్పగా ప్రజాసేవ చేశారని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కోట శ్రీనివాసరావు తెలుగు సినీ రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కోట ఇక లేరన్న వార్త విని చాలా బాధపడ్డానని.. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఏపీ మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్.. ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. కోట మృతి సినీరంగానికి తీరని లోటని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు.



కోట శ్రీనివాసరావు అంతిమయాత్ర



పుత్రశోకం..

అలా చేస్తే దిష్టి పోయేదేమో!

వందలాది సినిమాల్లో నటించి ఎంతో ఖ్యాతి ఆర్జించిన కోట శ్రీనివాసరావును కొన్ని విషాదాలు వెంటాడాయి. ముఖ్యంగా కుమారుడు ప్రసాద్ మరణం ఆయన్ను బాగా కుంగదీసింది. కుమారుడి మృతిపై ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కోట భావోద్వేగానికి గురయ్యారు. "గాయం-2 సినిమాలో నేను, ప్రసాద్ కలిసి పనిచేశాం. ప్రసాద్‌కు అదే తొలి సినిమా. అందులో ప్రసాద్ చనిపోయే సన్నివేశం ఉంది. ఆ సీన్ తీయొద్దని, అది చూడడం నావల్ల కాదని చిత్ర బృందానికి చెప్పా. అది జగపతిబాబు అర్థం చేసుకుని నా డూప్‌తో ఆ సన్నివేశం తీయించారు. ఆ సన్నివేశం చిత్రీకరించిన నాలుగు రోజులకే ప్రసాద్ బైక్ యాక్సిడెంట్‌లో చనిపోయాడు. ఆ సన్నివేశంలో నేనే నటించి ఉంటే దిష్టి పోయేదేమో. కళ్లముందు వాడే మెదులుతుంటాడు. నా రెండో కూతురికి ప్రమాదంలో కాలు పోయిందనే బాధ కూడా వెంటాడుతుంటుంది" అని కోట బాధపడ్డారు.

'కోట' జీవితంలో విశిష్ట ఘట్టం

కోట శ్రీనివాసరావు జీవితంలో విశిష్ట ఘట్టం 1994లో జరిగింది. దక్షిణ భారత చలనచిత్ర సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర సమాఖ్య మధ్య ఏర్పడిన వివాదంతో యావత్ సినీ పరిశ్రమ స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో రెండు వర్గాల కార్మికుల సంక్షేమం కోసం కోట శ్రీనివాసరావు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ప్రముఖులంతా మద్దతు ఇచ్చారు. దీక్ష విరమణ రోజు చిరంజీవి శిబిరానికి రాగా.. ఆయన ఇచ్చిన నిమ్మరసం తాగేందుకు కోట ఒప్పుకోలేదు. రాజేంద్రప్రసాద్‌కు చెప్పి దీక్ష మొదలుపెట్టానని, ఆయన నిమ్మరసం ఇస్తే తాగి విరమిస్తానని చెప్పారు. చివరకు హీరోలంతా వచ్చి నిమ్మరసం తాగించి కోట దీక్ష విరమింపజేశారు. ఆ ఏడాది నవంబరు 30న హైదరాబాద్‌లో మొక్కుబడిగానైనా షూటింగ్‌లు ప్రారంభమయ్యాయంటే అందుకు కోట చేపట్టిన దీక్షే కారణం.

నందులు నడిచొచ్చాయి

కోట శ్రీనివాసరావు తన నట జీవితంలో తొమ్మిది సార్లు నంది అవార్డులు అందుకున్నారు. ప్రతిఘటన చిత్రంలోని కాశయ్య పాత్రకు తొలిసారిగా కోట స్పెషల్ జ్యూరీ నంది అవార్డు అందుకున్నారు. ఆ తర్వాత గాయం(1993), తీర్పు (1994), లిటిల్ సోల్జర్స్(1996), గణేశ్(1998), చిన్న (2000), ఆ నలుగురు(2004), పృథ్వీనారాయణ(2002), పెళ్లయిన కొత్తలో(2006) చిత్రాల్లో ఆయన చేసిన పాత్రలకు నందులు వరించాయి. ఇక, 2015లో భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం పొందారు.



నవ్వులు పూయించే హాస్యపు ఊట..

విలనిజానికి కేరాఫ్.. కోట



విషం చిమ్మే విలన్‌గా.. నవ్వులు పూయించే కమెడియన్‌గా.. ప్రధాన ప్రతినాయకుడి పక్కన ఉంటూనే గోతులు తవ్వే కామెడీ విలన్‌గా.. మంచి తండ్రిగా, తాతగా.. ఇలా ఎన్నో పాత్రలు చేశారు కోట! దాదాపు నాలుగున్నర దశాబ్దాల సినీ ప్రస్థానంలో.. 750 సినిమాల్లో నటించిన ఆయన కీర్తికిరీటంలో కలికితురాయిల్లాంటి పాత్రలు లెక్కకు మిక్కిలిగానే ఉన్నాయి. వాటిలోంచి కొన్ని మేలిముత్యాలను ఏరితే..





మంత్రి కాశయ్య (ప్రతిఘటన)

'ప్రాణం ఖరీదు' సినిమాతో 1978లోనే తెరంగేట్రం చేసినా.. చిన్నాచితకా పాత్రలతోనే నెట్టుకొస్తున్న కోట శ్రీనివాసరావును 'ప్రతిఘటన' సినిమా.. అందులో 'గుడిసెల కాశయ్య' వేషం.. ఓవర్‌నైట్ స్టార్‌ని చేసేశాయి! 'నమస్తే తమ్మీ.. దావత్‌కు సిద్ధం జెయ్'... 'మీ అమ్మలకి మీ అక్కలకి మీ నాన్నలకి అందరికీ పెడ్తాండా.. దండం'.. 'గీ దేశంలో దరిద్రమనేది పోయేటంతవరకూ ఈ నెత్తి మీద బొచ్చు మొల్సేటందుకు ఈల్లేదని పద్దినాలకొక్కసారి యాదగిరి గుట్ట పోతాండ.. గుండు కొట్టించుకుంటాండ..' అంటూ తెలంగాణ యాసలో చెప్పిన డైలాగులతో కోట తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాలపై చెరగని ముద్ర వేశారు.

మినిస్టర్ సాంబశివుడు (గణేశ్)

విలనీలో కోట శ్రీనివాసరావు పతాకస్థాయి నటనను చూడాలంటే.. 'గణేశ్' సినిమా చూడాల్సిందే! హెల్త్ మినిస్టర్ సాంబశివుడుగా ఆ సినిమాలో ఆయన చేసిన నటన నభూతో. "తమ్మీ.. నేను 50 కోట్ల కుంబకోణం జేసిన. కాదంటలే. మరి నాకైతే చార్మినార్‌కున్నంత హిస్టరీ ఉంది. ఒక ముష్టోనికి కుప్పతొట్లో దొరికినానంట. గప్పటి సంది ముష్టోళ్లతో ముష్టెత్తిన. కుష్టోళ్లతో దుప్పట్లో పండిన. నా పెహలీ మర్డర్ ఎప్పుడు జేసినాననుకున్నవ్? పద్నాలుగేళ్లకే.. బచ్చాగాణ్ని. అంటే చెడ్డీ మీద మర్డరన్నట్టు" అంటూ కోట చెప్పిన డైలాగులు ఇప్పటికీ చాలామందికి గుర్తే!

సెల్వర్ మణి (సర్కార్)

అప్పటిదాకా తెలుగువారికి మాత్రమే తెలిసిన కోట శ్రీనివాసరావు విలనీ విశ్వరూపం.. 2005లో వచ్చిన 'సర్కార్' సినిమాతో ఉత్తరాది ప్రేక్షకులకూ బాగా పరిచయమైంది. 'సెల్వర్ మణి లైట్ మ్యాటర్స్ మే కామెడీ కర్తేహై.. సీరియస్ మ్యాటర్స్ మే మర్డర్' అంటూ తనదైన శైలిలో నవ్వుతూ హిందీ ప్రేక్షకులను అబ్బురపరిచారు. అంతే కాదు.. ఆ సినిమాలో తన సొంత గొంతుతో హిందీలో ఏకబిగిన డైలాగులు చెప్పి సత్తా చాటారు కోట.

కాంట్రాక్టర్ వెంకటరత్నం (శత్రువు)

'నెక్స్ట్ ట్రిప్పు మన్దేరా బాబూ'.. 'సెప్పవయ్యా బాబూ'.. 'ఫోన్ మోగుతోందిరా బాబూ'... 'ఇది కల కదరా బాబూ'.. అంటూ ఒక టిపికల్ సాగదీతతో మాట్లాడుతూ 'శత్రువు' సినిమాలో కాంట్రాక్టర్ వెంకటరత్నం పాత్రలో కోట పండించిన విలనీ విలక్షణం. ఈ సినిమాలో కోటకున్న మరో ఊత పదం.. 'థ్యాంక్స్'! అప్పట్లో అది చాలామందికి ఊతపదంగా మారిపోయిందంటే అతిశయోక్తి కాదు.

గురునారాయణ (గాయం)

కోట శ్రీనివాసరావు పేరు చెప్పగానే చాలామందికి గుర్తొచ్చే పాత్రల్లో ఒకటి.. 'గాయం' సినిమాలో మంత్రి గురునారాయణ పాత్ర. ముఠా తగాదాలు, హత్యల గురించి ఒక జర్నలిస్టు ప్రశ్నిస్తే.. 'గద్దైతే నేను ఖండిస్తన్న.. ఏం యాక్షన్ తీసుకుంటం? పోలీసోళ్లకు జెప్పినం.. ఏంరా నువ్వే గద డీఎస్పీతో ఫోన్ల మాట్లాడినవ్..' అంటూ ఆయన చెప్పిన డైలాగ్ ఇప్పటికీ పాపులర్.

అక్క (రెండిళ్ల పూజారి)

'గా పాటేందిరా.. ఆ.. చందమామ రావే జాబిల్లి రావే.. కత్తి పట్కరావే.. ఖతం జేసి పోవే' అంటూ హిజ్రా పాత్రలో 'రెండిళ్ల పూజారి' సినిమాలో కోట మెత్తటి కత్తిలా కనిపిస్తారు! పైకి సుకుమారంగా కనిపిస్తూనే.. కళ్లల్లో మాత్రం క్రౌర్యాన్ని చూపించిన తీరు అద్భుతం.

మాచిరాజు (శివ)

ఎలాంటి కామెడీ లేకుండా.. పూర్తిస్థాయిలో సీరియస్ విలన్‌గా కోట నటించిన సినిమాల్లో ప్రముఖమైనది.. 'శివ'. అందులో 'మాచిరాజు' పాత్రలో ఆయన కళ్లతోనే కపటత్వాన్ని పలికించిన తీరు ఔత్సాహిక నటీనటులకో పాఠంలాంటిది.

లక్ష్మీపతి (అహ నా పెళ్లంట):

తెలుగు సినిమా చరిత్ర మొదలైనప్పటి నుంచీ వెండితెరపై ఎన్నో పిసినారి పాత్రలు ఉన్నాయి గానీ.. తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన పీనాసి పాత్రలు మాత్రం రెండే! వాటిలో ఒకటి.. 'అహనా పెళ్లంట' సినిమాలో 'లక్ష్మీపతి' పాత్ర. రెండోది 'ఆమె' సినిమాలో పిసినారి శ్రీనివాసరావు పాత్ర. రెండూ కోట పండించిన నవ్వుల తోటలే!! మరీ ముఖ్యంగా 'అహ నా పెళ్లంట' సినిమాలో నూతన్ ప్రసాద్ పాత్ర.. 'లక్ష్మీపతా? వాడా.. ఆ మలపత్రాష్టుడా' అనగానే.. 'అవున్నేనే' అనే డైలాగ్‌తో కనిపించే కోట ఆ సినిమాని ఒంటిచేత్తో విజయతీరాలవైపు నడిపించారంటే అందులో ఇసుమంత కూడా అబద్ధం లేదు. 'నాకేంటి.. అహ నాకేంటి' అని డబ్బులు అడగకుండానే అడగడం.. కోడిని తాడుతో కట్టి దాన్ని చూస్తూ భోంచేస్తూ చికెన్ తిన్నంత తృప్తిగా ఉందనడం.. బస్టాండ్‌లో టీ అమ్ముకుంటూ బావమరిది కంటపడినప్పుడు కనుగుడ్లు పూర్తిగా పైకి ఎత్తేసి, తెల్ల గుడ్డు మాత్రమే కనిపించేలా చేసి, కుంటుకుంటూ నడుస్తూ 'చాయ్ పీవోజీ.. అచ్చా చాయ్ పీవోజీ' అంటూ కోట చేసే యాక్టింగ్‌ని వర్ణించడానికి మాటల్లేవంతే!

జంబలకిడి పంబ:

కోట శ్రీనివాసరావు కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్రల్లో ఒకటి.. 'జంబ లకిడి పంబ' సినిమాలో ఆయన చేసిన హీరోయిన్ తండ్రి పాత్ర. అణిగిమణిగి ఉండే భార్యను, కొడుకును అదిలిస్తూ బెదిరించే పాత్రలో తొలి సగంలోనూ.. మహిళలా మారి, భర్తగా మారిన భార్యకు అణిగిమణిగి ఉండే భార్య లాంటి భర్త పాత్రలో మలిసగంలోనూ.. కోట చెలరేగిపోయారు. 'ఒత్తిలో పత్తి.. గిలకలో చిలక' అంటూ ఆ పాత్రకు ఈవీవీ ఒక టిపికల్ మేనరిజాన్ని పెట్టారు.

బంగారం.. సింగారం (వినోదం)

ద్విపాత్రాభినయం సినిమాల్లో కొత్త కాన్సెప్ట్ కాదుగానీ.. లేని సోదరుడి పాత్రను ఉన్నట్టుగా 'కల'గంటూ.. ఆ పాత్రలో కూడా తనే జీవించే ఓ అమాయక/అహంభావి తండ్రి పాత్ర మాత్రం కొత్తే. 'వినోదం' సినిమాలో కోట ఆ పాత్రలో నటించారనడం కంటే జీవించారనడం కరెక్ట్. ధనవంతుడైన బంగారం పాత్రలో.. కార్మిక నాయకుడు సింగారం పాత్రలో విజృంభించారాయన.

తాడి మట్టయ్య (హలో బ్రదర్)

కోట శ్రీనివాసరావు తన కెరీర్‌లో హాస్యనటుడిగా పండించిన పాత్రల్లో అందరికీ గుర్తుండిపోయేది.. 'హలో బ్రదర్' సినిమాలో 'తాడి మట్టయ్య' అనే పోలీసు పాత్ర. మరో ప్రముఖ హాస్యనటుడు మల్లికార్జునరావుతో కలిసి చేసే అల్లరి అంతా ఇంతా కాదు. నవ్వించడమే కాదు.. సినిమా చివర్లో మల్లికార్జునరావు పాత్ర చనిపోయినప్పుడు.. 'రేయ్, చిట్టీ లేవరా.. నా మీద రివెంజ్ తీర్చుకోరా..' అంటూ తన నటనతో కన్నీళ్లు పెట్టించేస్తారు కోట.

అల్లావుద్దీన్ (మనీ)

'భద్రం బీకేర్‌ఫుల్ బ్రదరూ.. భర్తగా మారకు బ్యాచిలరూ' అంటూ.. పెళ్లొద్దని భయపెట్టే పాత్రలో కోట పండించిన హాస్యం దశాబ్దాలు గడిచిపోతున్నా తెలుగు ప్రేక్షకుల మనసుల్లో ఇంకా ఫ్రెష్‌గానే ఉంది.

పోతురాజు (మామగారు)

పనీపాటా లేకుండా వీధి అరుగు మీద కూర్చుని.. పేక ముక్కలు చేతుల్లో పట్టుకుని.. వచ్చేపోయే వాళ్లందరినీ ఆపి 'ఒక దెబ్బేసుకుందామా?' అని అడిగే క్యారెక్టర్‌లో కోట చెలరేగిపోయారీ సినిమాలో. 'పోతురాజు' పాత్రలో బాబూమోహన్‌తో కలిసి అయన చేసిన అల్లరి కామెడీ అదుర్స్.

గారపాటి బుల్లబ్బాయ్ (సీతారత్నంగారి అబ్బాయి)

'జల్లింది జీలకర్ర.. మొలిసింది తోటకూర.. పూసింది మల్లెపువ్వు.. ఏసింది అరటిగెల'.. 'కొబ్బరితోటలో జీడిపిక్కలేరుతున్నాను.. వంగతోటలో పనసగింజ లేరుతున్నాను' అంటూ కామెడీ డైలాగ్స్‌తో 'సీతారత్నంగారి అబ్బాయి' సినిమాలో కోట శ్రీనివాసరావు చేసిన 'గారపాటి బుల్లబ్బాయ్' పాత్ర కూడా అయన కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర.

దిక్సూచి

ఎయిర్‌పోర్టుల్లో ఉద్యోగాలు

దేశ వ్యాప్తంగా ఉన్న ఎయిర్‌పోర్టుల్లో గ్రౌండ్ స్టాఫ్, లోడర్ ఖాళీల భర్తీకి ఐజీఐ ఏవియేషన్ సర్వీసెస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను కోరుతోంది. పది, ఇంటర్ అర్హత ఉన్నవారు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేయవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక చేస్తారు.

పోస్టులు:

- ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్: **1017**
- లోడర్(పురుషులు మాత్రమే): **429**

అర్హత: ఎయిర్ పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్‌కి ఇంటర్ పాసై ఉండాలి. పురుషులు, మహిళలు ఇద్దరు కూడా దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఐటీఐ విద్యార్థులు కూడా పోటీ పడవచ్చు. వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. జీతం 25 వేల నుంచి 35 వేల వరకు ఉంటుంది.

- లోడర్ పోస్టుకి పది పాసైన పురుషులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. రెండు ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలంటే విడివిడిగా దరఖాస్తు పంపాలి. వయస్సు 20 నుంచి 40 సంవత్సరాల మధ్యలో ఉండాలి. జీతం 15 వేల నుంచి 25 వేల వరకు ఉంటుంది.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 21
వెబ్‌సైట్: igiaviationdelhi.com/

ఇండియన్ కోస్ట్ గార్డ్ అసిస్టెంట్ కమాండెంట్ రిక్రూట్‌మెంట్

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కోస్ట్ గార్డ్ జనరల్ డ్యూటీ(జీడీ), టెక్నికల్ (ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్) విభాగాల్లో 2027 బ్యాచ్‌కు సంబంధించిన అసిస్టెంట్ కమాండెంట్ గ్రూప్ 'ఏ' గెజిటెడ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అసిస్టెంట్ కమాండెంట్(జనరల్ డ్యూటీ-జీడీ) - **140 పోస్టులు**
- అసిస్టెంట్ కమాండెంట్(టెక్నికల్ - ఇంజనీరింగ్ అండ్ ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్) - **30 పోస్టులు**

అర్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు జీడీ డ్యూటీ కోసం అర్హులు. అయితే ఇంటర్ లేదా డిప్లొమాలో ఫిజిక్స్, మేథ్స్ చదివి ఉండాలి. అలాగే టెక్నికల్ బ్రాంచ్ కోసం సంబంధిత ఇంజనీరింగ్ శాఖ డిగ్రీ ఉండాలి.
వయస్సు: 21 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 2001 జూలై 1 నుంచి 2005 జూన్ 30 తేదీలోపు జన్మించి ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయస్సు సడలింపు ఉంటుంది.
చివరి తేదీ: 2025 జూలై 23
వెబ్‌సైట్: joinindiancoastguard.cdac.in/

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ పీజీ



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 17 బ్రాంచ్‌లకు సంబంధించిన ఇంటిగ్రేటెడ్ అడ్మిషన్ 2025-26 కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఐదు సంవత్సరాల సీయూఈటీ (యూజీ) 2025 ఆధారంగా అడ్మిషన్ ఇస్తారు.
ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, అప్లైడ్ జియాలజీ, సైకాలజీల్లో ఈ కోర్సులను అందిస్తున్నారు. ఇందులో మేథ్స్, ఫిజిక్స్‌లో 40 సీట్లు, బయాలజీల్లో 60 సీట్లు, సైకాలజీ, కెమిస్ట్రీల్లో 20 సీట్లు, అప్లైడ్ జియాలజీలో 18 సీట్లు ఉన్నాయి.
మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ: ఇందులో 28 సీట్లు ఉన్నాయి.
బీఎస్ ఆనర్స్: నాలుగు సంవత్సరాల బీఎస్ ఆనర్స్ కోర్సు ఉంది. ఇందులో 20 సీట్లు ఉన్నాయి.
ఇంటిగ్రేటెడ్ ఎంఏ: తెలుగు, హిందీ, లాంగ్వేజ్ సైన్సెస్, ఉర్దూ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఆంథ్రో పాలజీల్లో ఎంఏ కోర్సులను అందిస్తున్నారు. ఇందులో తెలుగు, లాంగ్వేజ్ సైన్సెస్‌లో 19 సీట్లు, హిందీ, ఆంథ్రోపాలజీల్లో 20 సీట్లు, ఉర్దూలో 14 సీట్లు, ఎకనామిక్స్‌లో 17 సీట్లు, హిస్టరీలో 35 సీట్లు, పొలిటికల్ సైన్స్‌లో 50 సీట్లు, సోషియాలజీలో 25 సీట్లు ఉన్నాయి.
దరఖాస్తులకు చివరి తేదీ: 2025 జూలై 30
వెబ్‌సైట్: http://acad.uohyd.ac.in/

టీజీ సీపీజీఈటీ

'తెలంగాణ స్టేట్ లెవెల్ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్'(టీజీ సీపీజీఈటీ-2025) నోటిఫికేషన్ వెలువడింది. తెలంగాణలోని వివిధ యూనివర్సిటీల్లో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సులతోపాటు, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ డిప్లొమాలో అడ్మిషన్ కోసం ఉస్మానియా యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన వర్సిటీలతోపాటు, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూలోని 45 కోర్సుల్లోని సీట్లను భర్తీ చేస్తారు. దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ 2025 జూలై 17. ఆలస్య రుసుము రూ.500/-తో జూలై 24, ఆలస్య రుసుము రూ.2000/-తో జూలై 28 వరకు దరఖాస్తులు దాఖలు చేయవచ్చు.

- 2025 ఆగస్ట్4వ తేదీ నుంచి ఎంట్రెన్స్‌లు ప్రారంభం అవుతాయి. ఇది పూర్తిగా కంప్యూటర్ బేస్ట్ టెస్ట్(సీబీటీ). పూర్తి వివరాలు త్వరలో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు.

నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి

జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 సంవత్సరం ప్రవేశాల దరఖాస్తు స్వీకరణ గడువు 2025 జూలై 29. దేశ వ్యాప్తంగా 654 జేఎన్‌వీల్లో ప్రవేశాలు నిర్వహిస్తుండగా తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 పాఠశాలలు ఉన్నాయి. డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష జరుగుతుంది.

- ఒక్కో పాఠశాలలో 80 సీట్లు ఉంటాయి. ఇందులో 75 శాతం సీట్లను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కేటాయించారు. మిగిలిన 25 సీట్లకు ఎవరైన పోటీ పడవచ్చు. గ్రామీణ ప్రాంతాల సీటు కావాలనుకునే విద్యార్థులు 3, 4, 5 తరగతులు పూర్తిగా గ్రామీణ ప్రాంతంలో చదివి ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 29
వెబ్‌సైట్: cbseitms.rcil.gov.in/nvs/?Aspx

అన్నా యూనివర్సిటీలో ఎంటెక్, ఎంఈ

తమిళనాడులోని అన్నా యూనివర్సిటీ 2025-26 సంవత్సరానికి సంబంధించి మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ), మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఎంటెక్), మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(ఎంఆర్క్), మాస్టర్ ఆఫ్ ప్లానింగ్(ఎంప్లానింగ్) కోర్సుల్లో అడ్మిషన్స్ ప్రారంభించింది. వీటిలో 2023, 2024, 2025 గేట్ స్కోరు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు 2025 జూలై 20వ తేదీలోపు ceap.annauniv.edu పోర్టల్‌లోకి లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవచ్చు.

హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్‌లో అప్రెంటిస్‌షిప్

నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ ఖాళీల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నారు.

- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: **129**
- డిప్లొమా అప్రెంటిస్: **76**
- ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్: **156**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీకామ్, బీటెక్/బీఈ, ఎల్ఎల్‌బీ, డిప్లొమా, ఐటీఐ, బీఎస్‌డబ్ల్యూ, ఎంఏ, ఎంబీఏ, పీజీ డిప్లొమా పాసై ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఆగస్ట్ 11
వెబ్‌సైట్: www.nhpcindia.com/welcome/job

కాలేజ్, యూనివర్సిటీ విద్యార్థులకు సెంట్రల్ స్కాలర్‌షిప్స్

భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా ప్రోత్సాహన్ యోజన(పీఎం యూఎస్‌పీ యోజన) కింద సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్ ఫర్ కాలేజ్ అండ్ యూనివర్సిటీ స్కీమ్‌ను ప్రకటించింది. ఆర్థికంగా వెనకబడిన ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ఉద్దేశించిన స్కీమ్ ఇది. దీని కింద పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మూడు సంవత్సరాలపాటు రూ. 12000/- చొప్పున, పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు రూ.20000/- చొప్పున ప్రోత్సాహకంగా ఇస్తారు. ప్రతీ సంవత్సరం 82000 కొత్త ఉపకార వేతనాలను అందిస్తారు. మొత్తం స్కాలర్‌షిప్‌లో 50 శాతం మహిళలకు కేటాయించారు.

అర్హత: ఇంటర్‌లో 80 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. కోర్సులు రెగ్యులర్ విధానంలో చదువుతూ ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం 4.5 లక్షలకు మించ కూడదు.
వయస్సు: 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. **చివరి తేదీ:** 2025 అక్టోబర్ 31
దరఖాస్తు: నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో చేయాలి.
అవసరమైన ధ్రువపత్రాలు: ఇంటర్ మార్కుల మెమో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు, కాలేజీ/ యూనివర్సిటీలో అడ్మిషన్ రుజువు, సంస్థ కోడ్
వెబ్‌సైట్: https://scholarships.gov.in/

SCHOLARSHIP ALERT

Infosys Foundation STEM Stars

Description: An initiative of Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) disciplines.

Eligibility:

- The applicants must be female students from India.
- They should have successfully completed their Class 12 examinations.
- Eligible students include those enrolled in the first year of undergraduate STEM courses at recognised NIRF-accredited institutions. Additionally, second-year B.Arch students and those pursuing five-year Integrated or Dual Degree programs are also welcome to apply.
- Female students intending to pursue engineering and medical courses in government colleges not listed in the NIRF rankings are also eligible to apply.
- The annual family income of the applicants must not exceed 8,00,000.

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1,00,000 per annum, covering actual expenses, for the duration of the course.
Last Date to Apply: 15-09-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ISTS3

Raman Kant Munjal



Description: The Raman Kant Munjal Scholarship 2025-26 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.


Eligibility:

- Students enrolled in the BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, or any other finance-related degree courses are eligible.
- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12. (70% marks for PwD students)
- The annual family income of the applicants should be less than INR 6 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years
Last Date to Apply: 31-07-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/RMKSP5

చిత్రజ్యోతి SINCE 1965

విలక్షణ నటనకు వినమ్ర నివాళి



తన విలక్షణ నటనతో తెలుగు సినీరంగంపై చెరగని ముద్రవేసిన దిగ్గజ నటుడు కోట శ్రీనివాసరావు మృతితో చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. వృత్తిపరమైన, వ్యక్తిగత అనుబంధం కలిగిన పలువురు సినీ ప్రముఖులు ఆయన మృతిపట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. నటులు రాజేంద్రప్రసాద్, మురళీ మోహన్, ప్రకాశ్‌రాజ్, తనికెళ్ల భరణి, నిర్మాత సురేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ తదితరులు కోట శ్రీనివాసరావు భౌతిక కాయానికి నివాళులర్పించారు.

కోట శ్రీనివాసరావుగారు తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తన విలక్షణ నటనతో ఎన్నో పాత్రలకు జీవం పోశారు. ఇతర భాషల్లోనూ నటించి మెప్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజా జీవితంలోనూ మంచి నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన మరణం తెలుగు సినీ రంగానికి తీరని లోటు.

- నందమూరి బాలకృష్ణ

నాకెంతో ఇష్టమైన వ్యక్తి కోట శ్రీనివాసరావు గారు. ఆయన ప్రతిభ, ఉనికి, మంచి మనసును ఎప్పటికీ మర్చిపోలేం. మాటల్లో చెప్పలేని దుఃఖం కలుగుతోంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలి.

- మోహన్‌బాబు

తన విలక్షణ నటనతో తెలుగు ప్రేక్షకులను అలరించిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు. తన నటనతో ప్రేక్షక హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు.

- మహేశ్‌బాబు

కోట శ్రీనివాసరావు గారి మరణం తెలుగు పరిశ్రమతో పాటు వ్యక్తిగతంగా నాకు తీరని లోటు. ఆయనతో గడిపిన క్షణాలు మరువలేనివి. గొప్ప నటుడు, మంచి మనిషిని కోల్పోయాం.

- నాగార్జున

కోట శ్రీనివాసరావు గారు ఇక లేరనే వార్త కలచివేసింది. పోషించిన ప్రతి పాత్రకు తన ప్రతిభతో ప్రాణం పోశారు. ఆయన స్థానాన్ని భర్తీ చేయగల నటులు లేరు. వారి ఆత్మకు శాంతి చేకూరాలి.

- రాజమౌళి

మద్రాస్‌లో ఉన్నప్పటి నుంచే మా కుటుంబానికి కోట గారితో అనుబంధం ఉంది. మా నాన్నగారికి ఆయనంటే చాలా ఇష్టం. వారితో ఉన్నప్పుడు సమయమే తెలిసేది కాదు. వారి వ్యక్తిత్వం మర్చిపోలేం. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి

- అల్లు అరవింద్

ఎనలేని నటనా చాతుర్యంతో ప్రతి పాత్రకూ తనదైన శైలిలో ప్రాణం పోసిన మహానటుడు కోట శ్రీనివాసరావు గారు. నా సినీ ప్రయాణంలో ఆయనతో నటించిన క్షణాలు ఎప్పటికీ చిరస్మరణీయం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులు, ఆత్మీయులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా

- ఎన్టీఆర్

సినీ పరిశ్రమ కోట శ్రీనివాసరావు గారి లాంటి విలక్షణ నటుణ్ణి కోల్పోయింది. ఆయన మృతి సినీరంగానికి తీరని లోటు. ఆయన చేసిన అద్భుతమైన పాత్రలు మనకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. కోట శ్రీనివాసరావు గారి ఆత్మకు శాంతి చేకూర్చి, ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

- రామ్‌చరణ్

కామెడీ త్రయం



కోట శ్రీనివాసరావు, బాబూ మోహన్, బ్రహ్మానందం ముగ్గురూ కలసి అనేక చిత్రాల్లో నటించారు. కామెడీ త్రయంగా వీరు పంచిన వినోదం ఆల్‌టైమ్ సూపర్ హిట్. వీరి ముగ్గురిని కలిపి సినిమా చేసేందుకు నిర్మాతలకు డేట్స్ దొరకడం కష్టమయ్యేది. చాలా సినిమాల్లో కోట శ్రీనివాసరావు విలన్‌గా నటించగా... బాబూ మోహన్, బ్రహ్మానందం హాస్యనటులుగా, సహాయకులుగా రక్తి కట్టించారు. వెండి తెరపై వీరు ముగ్గురు కలసి చేసిన కామెడీ సన్నివేశాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఒక రకంగా చెప్పాలంటే వీరిది ఎవర్‌గ్రీన్ కాంబినేషన్. 'అల్లరి మొగుడు', 'గ్యాంగ్ లీడర్, 'అందాల రాక్షసి', 'అల్లరి ప్రియుడు', 'సమరసింహారెడ్డి' వంటివి వీరు నటించిన పలు విజయవంతమైన చిత్రాలు. కాగా, కోట శ్రీనివాసరావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ బాబూ మోహన్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 'కోటన్న లేడంటే నమ్మలేకపోతున్నా..' అంటూ భోరున విలపించారు.

ఇద్దరూ కలసి వందకు పైగా



కోట శ్రీనివాసరావు, బాబూ మోహన్ కలసి వందకు పైగా సినిమాల్లో నటించారు. 'మామగారు' సినిమాలో బాబూ మోహన్‌ను కోట శ్రీనివాసరావు వెనుక నుంచి తన్నే సన్నివేశాలు ప్రేక్షకుల మదిలో చిరకాలం గుర్తుండిపోతాయి. తన చేతుల్లో బాబూ మోహన్ ఎక్కువ దెబ్బలు తినేవాడని అందరూ అనుకుంటారని కానీ, తాను అలా టచ్ చేస్తే వెళ్లిపడిపోయేవాడని కోట ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. కోట- బాబూ మోహన్ కాంబినేషన్ తమ చిత్రాల్లో ఉండాలని హీరోలు డిమాండ్ చేసిన సందర్భాలూ ఉన్నాయి.

ఎన్టీఆర్‌ను అనుకరిస్తూ సినిమా.. వివాదం



ఎన్నో సినిమాల్లో విలక్షణ పాత్రలతో ఆకట్టుకున్నారు కోట శ్రీనివాసరావు. అయితే ఓ సినిమాలోని పాత్రతో ఆయనను వివాదాలు చుట్టుముట్టాయి. అది ఆయన కెరీర్ తొలినాళ్లలో చేసిన 'మండలాధీశుడు'. ఎన్టీఆర్ జీవితం ఆధారంగా తీసిన ఈ సినిమా సమయంలో జరిగిన పరిణామాలను ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు కోట శ్రీనివాసరావు. 'నా పిలుపే ప్రభంజనం' అనే సినిమాలో నేను ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్ చెప్పాను. అది ప్రేక్షకులకు నచ్చింది. ఈ సినిమా చూసి నాకు 'మండలాధీశుడు'లో అవకాశం ఇచ్చారు దర్శకుడు ప్రభాకర్ రెడ్డి. అది ఎన్టీఆర్‌ను అనుకరిస్తూ చేసే పాత్ర. మొదట నేను చేయననే చెప్పాను. రామారావు అప్పటి ముఖ్యమంత్రి కాబట్టి ఒకవేళ పాత్ర క్లిక్ అయితే మంచి అవకాశాలొస్తాయి అనే ఉద్దేశంతో అంగీకరించాను. ఆ సినిమా చూస్తే ఎక్కడా ఎన్టీఆర్‌ను విమర్శించినట్లు ఉండదు. ఎన్టీఆర్‌కు జీవితంలో ఎదురైన సంఘటనలు, ఇతరులతో ఆయన వ్యవహరించే తీరు మాత్రమే ఇందులో ఉంటుంది. కానీ ఈ సినిమా విడుదలయ్యాక ఓ ఏడాది పాటు కష్టాలు నన్ను వెంటాడాయి. విజయవాడలో ఎన్టీఆర్ అభిమానులు నాపై దాడి చేయడం ఎంతో బాధించింది. ఆ తర్వాత కొన్నాళ్లకు 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' సినిమా సమయంలో డబ్బింగ్ కోసం ఎన్టీఆర్ చెన్నై వచ్చారు. అప్పుడు ఆయన్ను కలవొద్దని చాలా మంది హెచ్చరించారు. కానీ నేను వెళ్లి ఆయన్ని పలకరించా. ఆయన నన్ను చూసి 'మీరు గొప్ప నటుడని విన్నా బ్రదర్. మీరెన్నో గొప్ప పాత్రలు చేయాలి' అని ప్రోత్సహించారు. వెంటనే ఆయన కాళ్లపై పడిపోయా. ఆ తర్వాత బాలకృష్ణతో 'రౌడీ ఇన్స్పెక్టర్' సినిమాలో అవకాశం దక్కింది. నేను నటించడానికి బాలకృష్ణ కూడా అభ్యంతరం వ్యక్తం చేయలేదు. దాంతో 'మండలాధీశుడు'తో ఏర్పడిన వివాదం సమసిపోయింది' అని తెలిపారు.

నటనకు పరిపూర్ణ రూపం



కోట శ్రీనివాసరావుగారు ఇకలేరనే వార్త వారి కుటుంబానికే కాదు, పరిశ్రమకూ తీరని లోటు. అలాంటి వైవిధ్యమైన పాత్రలు పోషించే నటుడు మళ్లీ వస్తారని నేను అనుకోవడం లేదు. మా ఇద్దరి నట ప్రస్థానం 'ప్రాణం ఖరీదు' సినిమాతో ప్రారంభమైంది. సుదీర్ఘమైన నట ప్రస్థానంలో మా అనుబంధం ఎంతగానో పెనవేసుకుంది. తెరమీద ఆయన నటన అద్భుతం. బయట ఆయన హాస్యచమత్కారం కూడా అంతే అద్భుతం.

- చిరంజీవి

ఆయన మాట నన్ను కదిలించింది



బాబూమోహన్, కోటగారి కాంబినేషన్‌ను మేం విపరీతంగా ఎంజాయ్ చేసేవాళ్లం. నా తొలి చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'తో మొదలై 'అత్తారింటికి దారేది' వరకూ ఆయనతో కలసి నటించా. నా మనసుకు దగ్గరైన వ్యక్తి. నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను నాతో పంచుకునేవారు. కోట గారి మృతి చిత్రపరిశ్రమకు తీరని లోటు. పదిమంది బాగుకోరే వ్యక్తి. అత్తారింటికి దారేది చిత్రంలో నటించేటప్పుడు ఆయన్ను ఈ వయసులో నటిస్తూ ఇబ్బంది పడడం ఎందుకు అని అడిగితే 'నా బాధను మరిచిపోవడానికి నటనే నాకు మందు' అన్నారు. అది నన్ను బాగా కదిలించింది.

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

వ్యక్తిగతంగా తీరని లోటు



నా తొలి చిత్రం నుంచి కోట శ్రీనివాసరావుతో దగ్గరి అనుబంధం ఉంది. సురేశ్ ప్రొడక్షన్స్ ప్రతి సినిమాలో కోట గారు నటించారు. ఇద్దరం కలసి 'శత్రువు, గణేశ్, ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' లాంటి ఎన్నో మంచి చిత్రాలు చేశాం. వారి మృతి నాకు వ్యక్తిగతంగా తీరని లోటు.

- వెంకటేశ్

సొంత అన్నదమ్ముల్లా ఉండేవాళ్లం

రెండు రోజుల కిందటే ఇద్దరం మాట్లాడుకున్నాం, ఇంటికి వచ్చి కలుస్తానని చెప్పా. నేనొచ్చేసరికి ఆయన లేడు. నా కోటన్న వెళ్లిపోయాడు. ఇంటికొచ్చినప్పుడు ఎంతో సంతోషంగా అప్యాయంగా మాట్లాడేవారు. ఆయనకు అన్నదమ్ములున్నా, నన్నే తన సొంత తమ్ముడిగా భావించేవాడు. షూటింగ్‌కు సమయం తక్కువగా ఉన్నప్పుడు అన్నం కలిపి పెట్టేవాడు. ఏ ఊరికి షూటింగ్‌కు వెళ్లినా, పక్కపక్క గదుల్లోనే ఉండేవాళ్లం. ఇలా మా జీవితంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి.

- బాబూమోహన్

కోట మహానటుడు

ఒక దశకంలో నేను, కోట శ్రీనివాసరావు, బాబూమోహన్... మేం ముగ్గురం ప్రతి సినిమాలో ఉండేవాళ్లం. ఆయన మహానటుడు. రోజుకి 18, 20 గంటలు పనిచేసేవాళ్లం. 'అరేయ్ ఒరేయ్' అని పిలుచుకునే వాళ్లం. కోట లేడని అంటే నమ్మలేకపోతున్నా. నటన ఉన్నంత వరకు కోట మన హృదయాల్లో జీవించే ఉంటారు.

- బ్రహ్మానందం

కవితపై మల్లన్న వ్యాఖ్యల్ని ఖండిస్తున్నాం

» ఆయన కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకమే..

» చట్టపరిధిలో అందరూ పనిచేసుకోవాలి: మహేశ్ గౌడ్



హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని.. కవితపై మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే మల్లన్న కార్యాలయంపై దాడి చట్టవ్యతిరేకమని మండిపడ్డారు. చట్ట పరిధిలో అందరూ పనిచేసుకోవాలని ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. మల్లన్న కార్యాలయంపై దాడి, గన్‌మెన్ కాల్పులు జరిపిన అంశాలపైన వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరుగుతుందని తెలిపారు. బీసీ బిల్లు, రిజర్వేషన్లు అన్నీ కాంగ్రెస్ కృషి ఫలితమేనని పునరుద్ఘాటించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో ఇతరులు లబ్ధి పొందాలని చూడడం సమంజసం కాదని హితవు పలికారు.

కవితకు తీన్మార్ మల్లన్న క్షమాపణలు చెప్పాలి

» నోటికొచ్చినట్లు మాట్లాడితే మరిన్ని దాడులు..

» తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్

బర్కత్‌పుర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బేషరతుగా తీన్మార్ మల్లన్న క్షమాపణలు చెప్పాలని తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ నేతలు డిమాండ్ చేశారు. బీసీల కోసం కవిత ఉద్యమిస్తుంటే జీర్ణించుకోలేని తీన్మార్ మల్లన్న.. ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ బొల్ల శివశంకర్, తెలంగాణ జాగృతి అధికార ప్రతినిధి ఎలిజాల దత్తాత్రేయ మాట్లాడారు. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వ్యక్తిగత దూషణల కారణంగా క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి జరిగిందని, నోటి దురుసును తగ్గించుకోకపోతే మరిన్ని దాడులు తప్పవని హెచ్చరించారు. బీసీ ఉద్యమాన్ని భుజాన ఎత్తుకున్న ఎమ్మెల్సీ కవిత.. ఏ కులంలో పుడితే మల్లన్నకు ఎందుకని ప్రశ్నించారు. బెదిరింపులు, ఆర్థిక నేరాలకు పాల్పడే మల్లన్న స్వార్థ రాజకీయాల కోసం ఎంతకైనా దిగజారతాడని మండిపడ్డారు.



తీన్మార్ మల్లన్నతో బీసీ కుల సంఘాల జేఏసీ నేతలు బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, అయిలి వెంకన్న గౌడ్ తదితరులు

మల్లన్నపై దాడిని ఖండిస్తున్నాం: బీసీ సంఘాలు

తార్నాక/రాంనగర్/జహీరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో పాటు ఆయన కార్యాలయంపై జరిగిన దాడిని పలు బీసీ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ దాడికి పాల్పడిన జాగృతి కార్యకర్తలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి. దాడిలో గాయపడ్డ మల్లన్నను బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్, కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ పరామర్శించారు. అనంతరం చిక్కడపల్లిలోని కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. బీసీ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న మల్లన్నపై దాడులు హేయమని మండిపడ్డారు. బీసీలపై ఇప్పుడు ప్రేమ కురిపిస్తున్న కవిత.. ఆనాడు బీఆర్ఎస్ పాలనలో ఏం చేశారని నిలదీశారు. మల్లన్నపై దాడి కేసులో ఏ1గా కల్వకుంట్ల కవితపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, బీసీ నేత వట్టే జానయ్య యాదవ్, పొలిటికల్ జేఏసీ కో చైర్మన్ హరిశంకర్‌గౌడ్ పాల్గొన్నారు. తీన్మార్ మల్లన్నపై దాడిని యావత్ తెలంగాణ బీసీ సమాజంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని ఓయూ జేఏసీ అధ్యక్షుడు బైరు నాగరాజు గౌడ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు తావులేదని, భవిష్యత్తులో ఇలాగే దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తీన్మార్ మల్లన్నతో పాటు ఆయన కార్యాలయంపై దాడిని నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో తీన్మార్ మల్లన్న టీం సభ్యులు ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్సీ కవితకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆమె దిష్టిబొమ్మను దహనం చేశారు. దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ టీం సభ్యులు జ్యోతి పండాల్, నర్సింహ, రంగమ్మ, నగేశ్ తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తీన్మార్ మల్లన్న ఆఫీసుపై దాడి!

కల్వకుంట్ల కవితపై మల్లన్న వ్యాఖ్యలతో జాగృతి కార్యకర్తల ఆగ్రహం

» కార్యాలయం అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం

» మల్లన్నపైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నం

» అడ్డుకున్న గన్‌మెన్, కార్యాలయ సిబ్బంది

» గన్‌మెన్ కాల్పులు..రక్తసిక్తంగా ఆఫీసు

» జాగృతి కార్యకర్త ఒకరికి ఆస్పత్రిలో చికిత్స

» ఇరు వర్గాలపై పోలీసు కేసులు నమోదు

» నాపై హత్యాయత్నం చేయించిన కవిత

» ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి: మల్లన్న

పీర్జాదిగూడ/రాంనగర్/హైదరాబాద్ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్ కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు దాడి చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై మల్లన్న చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహించి ఈ దాడికి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో 30 మంది జాగృతి కార్యకర్తలు బోడుప్పల్‌లోని తీన్మార్ మల్లన్నకు చెందిన క్యూ న్యూస్ కార్యాలయానికి వచ్చారు. 'జై కవితక్క' అంటూ నినాదాలు చేస్తూ మల్లన్న క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆఫీసులోని అద్దాలు, కుర్చీలను ధ్వంసం చేశారు. వారిని అడ్డుకునేందుకు క్యూన్యూస్ సిబ్బంది, మల్లన్న గన్‌మెన్ ప్రయత్నించారు. ఈ క్రమంలో వారి మధ్య తీవ్ర తోపులాట జరుగగా.. పలువురికి గాయాలయ్యాయి. కార్యాలయంలో మల్లన్న కూర్చున్న చాంబర్‌లోకి చొచ్చుకెళ్లేందుకు జాగృతి కార్యకర్తలు ప్రయత్నించగా.. గన్‌మెన్ అడ్డుకున్నారు. అయినా వారు వెనక్కి తగ్గకపోవడంతో కాల్పులు జరిపారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఏం జరుగుతుందో కొద్దిసేపు ఎవరికీ అర్థం కాలేదు. దాడి అనంతరం క్యూ న్యూస్ కార్యాలయంలో ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆ వీడియోల్లో క్యూన్యూస్ కార్యాలయ ప్రాంగణం రక్తసిక్తంగా మారినట్టు కనిపించింది. దాడి క్రమంలో క్యూన్యూస్‌లో పనిచేసే సిబ్బందితోపాటు, జాగృతి కార్యకర్తలకూ గాయాలయ్యాయి. దాడిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేతి వేలికి కూడా గాయమైంది.




కాల్పులు జరుపుతున్న మల్లన్న గన్‌మ్యాన్

జాగృతి కార్యకర్తకు గాయం.. ఆస్పత్రిలో చికిత్స

దాడి ఘటనలో ముషీరాబాద్‌లోని గాంధీనగర్‌కు చెందిన జాగృతి కార్యకర్త సాయి గాయపడ్డారు. ఆయనను రాంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుడి చేతికి బలమైన గాయం కాగా.. తెగిన చోట కుట్లు వేశారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

కవిత హత్యాయత్నం చేయించారు: తీన్మార్ మల్లన్న

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జాగృతి కార్యకర్తలతో తనపై దాడి చేయించి హత్యాయత్నానికి పాల్పడ్డారని తీన్మార్ మల్లన్న ఆరోపించారు. వారి దాడిలో తనకు గాయమైందని తెలిపారు. తన గన్‌మెన్ వద్ద తుపాకీ లాక్కొని కాల్పులు జరిపేందుకు కూడా వారు ప్రయత్నించారని చెప్పారు. తాను చేసిన వ్యాఖ్యల్లో తప్పు లేదని, తెలంగాణలో సాధారణంగానే ఆ పదాలు వాడుతారని అన్నారు. బీసీలందరూ దొరల గడీల వద్ద కాపలా కుక్కల్లా ఉండాలనే ఆలోచనను కవిత మానుకోవాలన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లపై ఉన్న కోపాన్ని తమపై చూపుతామంటే సహించేది లేదన్నారు. వారి దాడులతో బీసీలను అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాను చేస్తున్న ప్రయత్నం మానుకోనని ప్రకటించారు. తమపై దాడిని బీసీ మహిళలు సహించరని, కవితను తరిమి కొడతారని హెచ్చరించారు. తనపై హత్యాయత్నానికి పాల్పడిన కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడ్డ వారిని న్యాయస్థానానికి ఈడ్చి తగిన శిక్ష పడేంత వరకు వదిలిపెట్టబోమని అన్నారు.



అయితే మల్లన్న గన్‌మెన్ జరిపిన కాల్పుల్లో సాయి చేతికి బుల్లెట్ తగలడం వల్లే.. లోతైన గాయమైందని జాగృతి కార్యకర్తలు చెబుతున్నారు. కానీ, కాల్పుల్లో ఎవరికీ బుల్లెట్ గాయాలు కాలేదని మల్కాజ్‌గిరి జోన్ డీసీపీ పద్మజారెడ్డి తెలిపారు. క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి విషయం తెలుసుకున్న డీసీపీ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు అడిగి తెలుసుకోవడంతోపాటు మల్లన్న గన్‌మెన్ కాల్పులు జరిపిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బుల్లెట్‌లకు సంబంధించిన షెల్స్ కోసం గాలింపు చేపట్టారు. కొన్ని బుల్లెట్‌లు రూఫ్‌కి తగలగా, మరికొన్ని గ్లాస్‌కు తగిలినట్లు గుర్తించారు. ఈ ఘటనలో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామని మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి తెలిపారు. ఎమ్మెల్సీ కవిత ప్రోద్బలంతో ఆమె అనుచరులు దాడి చేశారన్న మల్లన్న ఫిర్యాదు మేరకు.. వారిపై బీఎన్ఎస్ సెక్షన్‌లు 191(2), 191(3), 333, 109, 324(4), 351(3), 132, రె/విత్ 190, 49 ప్రకారం కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు తీన్మార్ మల్లన్న అనుచరులు, భద్రతా సిబ్బంది తమపై కత్తులు, తుపాకులతో దాడి చేశారంటూ జాగృతి కార్యకర్త లింగమయ్య అలియాస్ అశోక్‌యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తీన్మార్ మల్లన్నపై, అతని అనుచరులపై బీఎన్ఎస్ 191(2), 191(3), 76, 127(2), 109, 351(3), రె/విత్ 149 ఐపీసీ సెక్షన్ 25, 27 ఆఫ్ ఆర్మ్స్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాదానికి దారితీసిన వ్యాఖ్యలు..

జహీరాబాద్‌లో ఇటీవల బీసీ సంఘాలు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న తీన్మార్ మల్లన్న.. ఎమ్మెల్సీ కవితపై చేసిన వ్యాఖ్యలే వివాదానికి దారితీశాయి. మల్లన్న మాట్లాడుతూ, "బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్టు ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురాగానే కల్వకుంట్ల కవిత రంగులు, గులాల్ చల్లుకుంటున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వస్తే నీకేం సంబంధం? నువ్వు బీసీవా? నీకు, మాకు కంచం పొత్తు ఉందా?" అంటూ మరో అనుచిత వ్యాఖ్య చేశారు. ఇవి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జాగృతి కార్యకర్తలు ఆగ్రహానికి గురయ్యారు.

మల్లన్నను ఎమ్మెల్సీకి అనర్హుడిగా ప్రకటించాలి

మండలి చైర్మన్‌కు కవిత ఫిర్యాదు

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తీన్మార్ మల్లన్న బాధ్యతాయుతమైన ఎమ్మెల్సీ పదవిలో ఉండి.. ఆడబిడ్డ అనే విచక్షణ లేకుండా తనపై వ్యాఖ్యలు చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ అయిన తనపైనే ఇలా మాట్లాడితే రాష్ట్రంలో సాధారణ మహిళల పరిస్థితేంటని ప్రశ్నించారు. మల్లన్నను ఎమ్మెల్సీ పదవికి అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. మల్లన్న అనుచిత వ్యాఖ్యలపై ఎథిక్స్ కమిటీకి రెఫర్ చేయాలని కోరారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. తోటి ఎమ్మెల్సీ, మహిళ అని చూడకుండా మల్లన్న తనపై దారుణమైన వ్యాఖ్యలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడబిడ్డలు రాజకీయాల్లోకి రావద్దా? అని ప్రశ్నించారు. ఏదైనా ఉంటే అంశం ప్రాతిపదికన మాట్లాడాలన్నారు. బీసీ అయినంత మాత్రాన.. ఏది పడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. "నన్ను బయట తిరగనివ్వను అనడానికి మల్లన్న ఎవరు? దీనిపై ఎంతదూరమైనా వెళ్తాను. మల్లన్నపై జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాను. నాపై మల్లన్న తప్పుడు వ్యాఖ్యలు చేశారన్న ఆవేశంతో.. జాగృతి కార్యకర్తలు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు వెళ్లారు. అంతమాత్రాన వారిపై తుపాకులతో కాల్పులు జరుపుతారా? మనుషులను చంపేస్తారా?" అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం పోరాటం చేస్తున్నామని, ఒక ఆడబిడ్డ ప్రశ్నిస్తే సహించలేకపోతున్నారా? అని నిలదీశారు. ఏనాడూ ఒక్కమాట కూడా అనని తనను మల్లన్న ఎందుకు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తక్షణమే మల్లన్నను అరెస్ట్ చేయించాలని, లేదంటే ముఖ్యమంత్రే వెనక ఉండి మాట్లాడించినట్లు భావించాల్సి ఉంటుందని అన్నారు.

మల్లన్నపై హత్యాయత్నం కేసు పెట్టాలి..

తెలంగాణలో మహిళలకు ప్రత్యేక గౌరవం ఉంటుందని, ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో మహిళలు రాజకీయాల్లోకి వస్తూ.. ప్రజా సమస్యలపై మాట్లాడుతున్నారని కవిత అన్నారు. ఈ సమయంలో బాధ్యతాయుత పదవుల్లో ఉన్న వ్యక్తులు ఇలాంటి పదజాలంతో విమర్శలు చేస్తే వచ్చేవాళ్లు కూడా వెనక్కి తగ్గే పరిస్థితి ఉంటుందని తెలిపారు. మరోవైపు తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీ కార్యాలయంలో ఏఐజీ రమణకుమార్‌కు కవిత ఫిర్యాదు చేశారు. నిరసన తెలిపేందుకు వెళ్లిన జాగృతి కార్యకర్తలపై గన్‌మెన్లతో కాల్పులు జరిపించిన మల్లన్నపై, ఆయన గన్‌మెన్లపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ మల్లన్న గన్‌మెన్‌ను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేయాలని, ఆయనకు ఇచ్చిన గన్‌మెన్ల భద్రతను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. తన ఫిర్యాదును తీసుకోవడానికి డీజీపీ అందుబాటులో లేకపోవడాన్ని గమనిస్తుంటే తీన్మార్ మల్లన్న వ్యాఖ్యల వెనుక ప్రభుత్వం ఉందా అని అనుమానించాల్సి వస్తోందన్నారు.



మండలి చైర్మన్‌ను కలిసేందుకు వస్తున్న కవిత

కవిత ఎపిసోడ్‌పై స్పందించని బీఆర్ఎస్ పెద్దలు

కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు, తెలంగాణ జాగృతి శ్రేణులు ఆయన కార్యాలయంపై దాడి చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారినా బీఆర్ఎస్ శ్రేణులు ఏమాత్రం స్పందించలేదు. కవిత శాసనమండలి చైర్మన్‌ను కలసి తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై ఫిర్యాదు చేశారు. డీజీపీ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలోనూ ఈ అంశం విస్తృతంగా ప్రచారమైంది. కానీ బీఆర్ఎస్ పెద్దలు, ఇతర కీలక నాయకులు ఏమాత్రం స్పందించలేదు. ఓ మహిళా ఎమ్మెల్సీగానైనా ఆమెకు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు మద్దతుగా స్పందించకపోవడం బాధాకరమని తెలంగాణ జాగృతి కార్యకర్తలు వాపోతున్నారు. అయితే ఈ వ్యవహారంపై మండలి బీఆర్ఎస్ ప్రతిపక్షనేత మధుసూదనాచారి స్పందించారు. మల్లన్న చేసిన అసభ్యకర వ్యాఖ్యలను ఖండిస్తున్నానంటూ ప్రకటన విడుదల చేశారు. ఆడబిడ్డల గురించి మాట్లాడేటప్పుడు సోయితో వ్యవహరించడం మంచిదని సూచించారు. మల్లన్న క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నోట్ల కట్టల గుట్టలు!

లిక్కర్ స్కామ్‌లో వీడియోల రికవరీ

» డెన్‌లలో నోట్ల కట్టల పంపిణీ దృశ్యాలు

» టెక్నాలజీ సాయంతో ఎఫ్ఎస్ఎల్ వెలికితీత

» నాడు ముడుపుల పంపిణీపై వీడియోలు

» వాటిని 'పెద్దల'కు పంపిన నిందితులు

» కట్టల మధ్యలో రాయలసీమ నేత అనుచరుడు

» 17న కోర్టుకు చార్జిషీట్ సమర్పించనున్న సిట్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



గత జగన్ ప్రభుత్వంలో జరిగిన మూడున్నర వేల కోట్ల మద్యం కుంభకోణంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు కీలక ఆధారాలు కనుగొన్నారు. అధునాతన టెక్నాలజీ సాయంతో మద్యం ముడుపుల పంపిణీకి సంబంధించిన వీడియోలను సేకరించారు. డెన్‌లలో దాచిన డబ్బుల వివరాలు అప్పటి ప్రభుత్వ, అధికార పార్టీ పెద్దలకు తెలియజేసేందుకు నిందితులు సెల్‌ఫోన్లలో చిత్రీకరించిన దృశ్యాలు ఆ వీడియోల్లో ఉన్నట్టు విశ్వసనీయసమాచారం. కేసు విచారణలో భాగంగా నిందితుల నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల నుంచి ఈ వీడియోలను బయటికి తీశారు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయాక నిందితులు ముందుజాగ్రత్తగా తమ సెల్‌ఫోన్ల నుంచి ఆ వీడియోలను డిలీట్ చేశారు. అయితే అధికారులు సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)కి పంపి డిలీట్ చేసిన వీడియోలను వెలికి తీయించారు.

ఆధారాలు ధ్వంసం

జగన్ పాలనలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో ముడుపుల వసూళ్ల నుంచి పంపిణీ వరకూ పక్కా పథకం ప్రకారం చేశారు. మద్యం డీలర్ల నుంచి ముడుపులు వసూలు చేశాక 'పెద్దల'కు చేరవేసేవారు. ఇదంతా లిక్కర్ స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి డైరెక్షన్‌లో జరిగింది. నిందితులు లిక్కర్ సొమ్ము పంపిణీకి ముందు వీడియోలు తీశారు. డెన్‌లలో దాచిన డబ్బుల వివరాలను సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. ఈ వీడియోలను సంబంధిత వ్యక్తులకు పంపారు. ఎన్నికల తర్వాత ఊహించని ఫలితం రావడంతో అప్రమత్తమైన రాజ్ కసిరెడ్డి తాను ఏర్పాటు చేసుకున్న వసూళ్ల నెట్ వర్క్‌లోని ప్రతి వ్యక్తిని హైదరాబాద్‌కు పిలిపించి వారి సెల్‌ఫోన్లు తీసుకున్నాడు. ప్రతి ఫోన్‌కు కనీసం రూ.లక్షకు తగ్గకుండా వారికి ఇచ్చి కొత్త ఫోన్ తీసుకోవాలని సూచించాడు. ఇక లిక్కర్ ఆర్డర్లు పెట్టిన కంప్యూటర్లను డిపోల్లో ధ్వంసం చేశారు. ఇలా సాక్ష్యాలు దొరక్కుండా జాగ్రత్తలు తీసుకున్నారు. లిక్కర్ స్కామ్ నిందితులు ఆధారాలు లభించకుండా ధ్వంసం చేసినా సిట్ బృందంలో టెక్నాలజీపై పట్టున్న అధికారులు రికవరీకి మార్గం వెతికారు. కసిరెడ్డి టీమ్ నుంచి సెల్‌ఫోన్లు దొరక్కపోయినా, వారు వీడియోలు పంపిన కొందరు నిందితుల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారూ ఆ వీడియోలను డిలీట్ చేసేశారు. అయితే అధికారులు ఏపీఎఫ్ఎస్ఎల్ వద్ద ఎలాంటి రిట్రీవల్ పరికరాలు ఉన్నాయో తెలుసుకుని.. 'డిలీట్ డేటా రిట్రీవల్' కోసం తాము స్వాధీనం చేసుకున్న నిందితుల ఫోన్లు పంపారు. దీంతో వీడియోలతో పాటు చాటింగ్‌లు, సందేశాలు, ఫొటోలు సైతం బయట పడ్డాయి. రెండు వేలు, ఐదు వందల నోట్ల కట్టలతో కూడిన డెన్‌లు చూసి.. 'సినిమాల్లోనే ఇలాంటి దృశ్యాలు చూశాం'అంటూ అధికారులు విస్తుపోయారు.

వీడియోల్లో ఏముందంటే...

● ఓ వీడియోలో నల్లటి దుస్తులు ధరించిన ఓ వ్యక్తి నోట్ల కట్టల మధ్యలో నిల్చున్నాడు. 'ఈ ఐదు కోట్లు అక్కడికి.. ఈ ఏడు కోట్లు ఇక్కడికి.. ఆ 2వేల నోట్ల కట్టల బాక్సు ఫలానా చోటుకు..' అంటూ ఎదురుగా ఉన్న వ్యక్తులకు చెప్పాడు. రాయలసీమలో వైసీపీలో కీలక నాయకుల్లో ఒకరికి ఆ వ్యక్తి అత్యంత సన్నిహితుడిగా సిట్ అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఆ డబ్బు ఎవరెవరికి చేర్చాడు? ఎన్నిసార్లు తరలించాడు? ఆ సమయంలో అక్కడున్న వ్యక్తులెవరు? అనే దానిపై కూపీ లాగినట్టు తెలుస్తోంది.

● మరో వీడియోలో పుస్తకాల షాపులో బుక్కులు పేర్చినట్లు భారీగా నోట్ల కట్టలు కనిపించాయి. అరెస్టయి రిమాండ్‌లో ఉన్న ఒక కీలక నిందితుడి సెల్‌ఫోన్ నుంచి ఈ వీడియోను రిట్రీవల్ చేసినట్లు తెలుస్తోంది.

మద్యం కుంభకోణంలో ప్రణాళికా బద్ధంగా దోపిడీ జరిగింది. సిట్ ఇప్పటి వరకూ 40మందిని నిందితులుగా చేర్చింది. రాజ్ కసిరెడ్డితోపాటు జగన్ సెక్రటరీ ధనుంజయ్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు 9 మందిని అరెస్టు చేసింది. సాక్షులు, అనుమానితులను 200 మందికి పైగా విచారించింది. ఈ కేసులో భాగస్వామ్యం ఉన్న పది మందికిపైగా విదేశాలకు పారిపోయారు. విచారణలో 3 నెలలకుపైగా సిట్ సేకరించిన ఆధారాలు ఈనెల 17న విజయవాడ ఏసీబీ కోర్టుకు చేరనున్నాయి. మద్యం ముడుపుల వసూళ్లు, డెన్‌లలో దాచడం, ఎన్నికల్లో అభ్యర్థులకు పంపిణీ, కీలక వ్యక్తుల పాత్ర, బినామీల ఆస్తులు, హవాలా మార్గంలో విదేశాలకు తరలింపు తదితర విషయాలపై చార్జిషీట్ దాఖలు చేయబోతున్నారు. 21నాటికి రిమాండ్ ఖైదీగా రాజ్ కసిరెడ్డికి 90 రోజులు పూర్తి అవుతుంది. ఈలోపు చార్జిషీట్ దాఖలు చేయకపోతే డిఫాల్ట్ బెయిల్ వస్తుంది. దీంతో అభియోగ పత్రాన్ని సిద్ధం చేసిన సిట్.. గురువారం కోర్టులో దాఖలు చేయనున్నట్లు సమాచారం.

ఉప్పు ముప్పు తగ్గిద్దాం!

అడ్డగోలుగా ఉప్పు వాడుతున్న భారతీయులు

» రోజూ వాడాల్సింది 5 గ్రాములకన్నా తక్కువ

» వాడుతున్నది 9.2 గ్రాములపైనే

» పెరిగిపోతున్న అధిక రక్తపోటు, గుండె, కిడ్నీ సంబంధ సమస్యలు

» ఎన్ఐఈ శాస్త్రవేత్తల ఆందోళన

» తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో కొనసాగుతున్న అధ్యయనం

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): 'వంటలో అన్నీ వేసి చూడు.. నన్ను వేసి చూడు' అంటుంది ఉప్పు. నాలుకకు రుచి తగలాలంటే ఉప్పు ఉండాల్సిందే. కానీ ఆ ఉప్పు ముప్పుగా మారిందని, నిశ్శబ్ద మహమ్మారికి ఊపిరి పోస్తోందని ఐసీఎంఆర్ (భారత వైద్య పరిశోధన మండలి)కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ (ఎన్ఐఈ) నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ప్రతి వ్యక్తి రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవాలని, కానీ భారత్‌లోని పట్టణ ప్రాంతాల్లో సగటున 9.2 గ్రాములు, గ్రామీణ ప్రాంతాల్లో 5.6 గ్రాముల ఉప్పు తీసుకుంటున్నారని చెబుతున్నారు. ఇలా పరిమితికి మించి ఉప్పు వినియోగంతో అధిక రక్తపోటు, గుండె, మూత్రపిండాల సంబంధిత సమస్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. దీనికి సంబంధించి ఐసీఎంఆర్ ఎన్ఐఈ నిపుణులు తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో మూడేళ్ల అధ్యయనాన్ని చేపట్టారు.

చిన్న మార్పుతో పెద్ద ప్రయోజనం..

ఉప్పు వినియోగం, ప్రత్యామ్నాయాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్‌ఐఈ 'పించ్ ఫర్ ఏ చేంజ్' నినాదంతో ప్రచారం చేస్తోంది. ఉప్పు విషయంలో ఒక చిన్నమార్పుతో పెద్ద ప్రయోజనం ఉంటుందని ఎన్ఐఈ నిపుణులు చెబుతున్నారు. "మేం ఆరోగ్య సంరక్షణ కేంద్రాలలోని ఆరోగ్య కార్యకర్తలతో కలిసి పనిచేస్తున్నాం. ఉప్పు వినియోగం తగ్గించే అంశంపై అందరికీ తగిన అవగాహన కల్పించేలా వారికి కౌన్సెలింగ్ పద్ధతులు వివరిస్తున్నాం. ప్రజలను మంచి మార్పు వైపు నడిపించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఉప్పు వాడకం తగ్గించడంలో కౌన్సెలింగ్ ప్రభావాన్ని అంచనా వేస్తున్నాం.." అని డాక్టర్ గణేశ్ వివరించారు. సోడియం తక్కువగా ఉండే ఉప్పును వినియోగిస్తే.. రక్తపోటు సగటున 7/4 ఎంఎంహెచ్‌జీ మేర తగ్గుతుందని డాక్టర్ శరణ్ మురళి చెప్పారు.



ఉప్పు (సోడియం క్లోరైడ్)లోని సోడియం మనలో రక్తపోటును పెంచుతుందని... ఉప్పులో కొంత సోడియంను తగ్గించి రుచిలో మార్పు రాకుండా ఆ మేర పొటాషియం లేదా మెగ్నీషియం లవణాలను కలిపిన ఉప్పును వినియోగించవచ్చని తెలిపారు.

తక్కువ సోడియం ఉప్పు... లభ్యత, ధరతో సమస్య

సోడియం తక్కువగా ఉన్న ఉప్పు లభ్యత, ధర విషయంలో సమస్య ఉందని ఎన్ఐఈ తెలిపింది. చెన్నైలోని 300 రిటైల్ దుకాణాల్లో పరిశీలన చేపట్టగా.. 28శాతం రిటైల్ దుకాణాల్లో, 52శాతం సూపర్ మార్కెట్లలో మాత్రమే ఈ తరహా ఉప్పు లభిస్తోందని తెలిపింది. ఎక్కువ మంది ప్రజలు ఆశ్రయించే చిన్న కిరాణా దుకాణాల్లో 4 శాతం దుకాణాల్లో మాత్రమే ఈ ఉప్పు అందుబాటులో ఉందని పేర్కొంది. ఇక తక్కువ సోడియం ఉప్పు ధర ఎక్కువగా ఉండటమూ సమస్యగా మారిందని తెలిపింది. 100 గ్రాముల సాధారణ ఉప్పు ధర రూ.2.7 ఉంటే.. సోడియం తక్కువున్న ఉప్పు ధర రూ. 5.6గా ఉందని పేర్కొంది.

డెంగ్యూ వ్యాక్సిన్ మూడో దశ ట్రయల్స్!

దేశీయంగా అభివృద్ధి చేస్తున్న మొట్టమొదటి డెంగ్యూ వ్యాక్సిన్ మూడో దశ క్లినికల్ ట్రయల్స్ త్వరలో చేపట్టనున్నట్టు ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలు వెల్లడించారు. దేశవ్యాప్తంగా 20 కేంద్రాల్లో ట్రయల్స్ జరుగుతున్నాయని తెలిపారు. డెంగ్యూ రాకుండా ఒకసారి తీసుకొనే (వన్ షాట్) 'డెంగీఆల్' వ్యాక్సిన్‌ను పనాసియా బయోటెక్ కంపెనీ అభివృద్ధి చేసింది. ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో ఈ వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయి. ప్రస్తుతం భారత్‌లో డెంగ్యూకు ఎలాంటి యాంటీ వైరల్ చికిత్స లేదు. ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తే ప్రయోజనం కలగనుంది.

పేరెంట్స్ మీటింగ్ రోజే అన్నంలో పురుగులు

» తమ పిల్లలకు రోజూ ఇలాంటి భోజనమే పెడుతున్నారా.. అంటూ సిబ్బందిపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

» వికారాబాద్ జిల్లా సిరిపురం ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఘటన

మర్పల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా తమ పిల్లల బాగోగులు తెలుసుకునేందుకు వసతి గృహానికి వచ్చిన తల్లిదండ్రులు భోజనంలో పురుగులు చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలకు రోజూ ఇలాంటి భోజనమే పెడుతున్నారా అంటూ ప్రశ్నించారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం సిరిపురంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో జరిగింది. ఆదివారం వసతి గృహ వార్డెన్ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. వసతి గృహంలో అన్ని వసతులు ఉన్నాయని, పిల్లలు బాగా చదువుతున్నారని చెప్పి సమావేశాన్ని ముగించారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులకు సిబ్బంది భోజనం వడ్డిస్తుండగా కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాత్రలో ఉన్న అన్నాన్ని పరిశీలించారు. పురుగులు కనిపించడంతో వారు ఆగ్రహానికి గురయ్యారు. విద్యార్థులకు ఈ విధమైన భోజనాన్ని వడ్డిస్తారా అంటూ వార్డెన్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహంలో తాము ఉండగానే ఇలాంటి భోజనం వడ్డిస్తున్నారంటే తమ పిల్లలకు ప్రతిరోజూ ఏ విధమైన భోజనం అందిస్తున్నారో అర్థమవుతోందని మండిపడ్డారు. జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణా లోపంతోనే ఇలాంటివి జరుగుతున్నాయని ఆరోపించారు.

భార్య వేధింపులతో యువకుడి ఆత్మహత్య

» సీఐ సహా అయిదుగురిపై కేసు నమోదు

చొప్పదండి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): భార్య, అత్తమామలు, భార్య తరఫు బంధువులతో పాటు సీఐ వేధింపులతోనే చనిపోతున్నానని ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా చొప్పదండిలో జరిగింది. చొప్పదండికి చెందిన కడారి శ్రవణ్‌కుమార్ (34) కరీంనగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి కరీంనగర్‌కు చెందిన నీలిమతో 2021లో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కూతురు ఉంది. నీలిమ కరీంనగర్ డిపోలో బస్ కండక్టర్‌గా పని చేస్తున్నారు. ఏడాదిగా ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో నీలిమ తన భర్త, అత్తమామలు, ఆడపడుచుపై మే నెలలో కరీంనగర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో గృహహింస, వరకట్న వేధింపుల కేసును నమోదు చేసింది. పోలీసుల దర్యాప్తుతో మనస్తాపానికి గురైన శ్రవణ్ ఈనెల 7న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. తన మరణానికి సీఐ శ్రీలత కారణమంటూ ఆత్మహత్యకు ముందు తీసిన సెల్ఫీ వీడియోలో శ్రవణ్‌కుమార్ ఆరోపించాడు. తనపై దొంగ కేసు నమోదు చేశారని, పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినా బలవంతంగా విడాకుల పత్రంపై సంతకం పెట్టించారని తెలిపాడు. శ్రావణ్ తండ్రి నర్సింగం ఫిర్యాదు మేరకు సీఐ శ్రీలత, శ్రవణ్ భార్య నీలిమ, ఆమె తల్లి, ఆమె తరఫున పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మధ్యవర్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌రెడ్డి తెలిపారు.

శుభలేఖలు ఇచ్చేందుకెళ్తూ అనంతలోకాలకు..

» బైక్ అదుపు తప్పి వరుడు, అతని బంధువు మృతి

» నాలుగు రోజుల్లో పెళ్లి అనగా విషాదం

ఖానాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మరో నాలుగు రోజుల్లో ఆ యువకుడి పెళ్లి.. ఎంతో సంతోషంగా బంధుమిత్రులకు శుభలేఖలు ఇచ్చేందుకు వెళుతున్న అతన్ని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. అతనితో పాటు బంధువైన మరో యువకుడు కూడా మృత్యువాత పడ్డాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ శివారులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన చొప్పదండి లక్ష్మణ్ (25)కు ఈ నెల 18న వివాహం నిశ్చయమైంది. నిర్మల్ జిల్లాలోని తన బంధుమిత్రులకు శుభలేఖలు పంచేందుకు వరుసకు బావమరిది అయిన జశ్వంత్ (19)ను తోడు తీసుకొని ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. జశ్వంత్‌ది మంచిర్యాల జిల్లా మురిమడుగు గ్రామం. నిర్మల్ జిల్లా ఖానాపూర్ శివారు డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సమీపంలోని కల్వర్టు వద్ద వారి ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. సుమారు పది అడుగుల ఎత్తు నుంచి ద్విచక్ర వాహనంతో సహా ఎగిరి కల్వర్టు కింద పడడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ దుర్ఘటనతో ఇరువురి కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

షార్ట్ సర్క్యూట్.. దివ్యాంగ బాలిక సజీవదహనం

» నారాయణపేట జిల్లా మక్తల్‌లో విషాదం

మక్తల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఓ 12 ఏళ్ల బాలిక సజీవ దహనమైంది. ఈ ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, మక్తల్ పట్టణంలోని నందినినగర్‌లో నివాసం ఉంటున్న కిష్టప్ప, సుజాత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వారి పెద్ద కుమార్తె భానుప్రియ (13)కు కళ్లు కనిపించవు. దినసరి కూలీలైన కిష్టప్ప, సుజాత పనులకు వెళ్లగా, చిన్నకుమార్తె, కుమారుడు ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. ఇంట్లో భానుప్రియ (13) ఒక్కతే ఉన్న సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని సామగ్రితో పాటు భానుప్రియ సజీవదహనమైంది. ఇంట్లో నుంచి దట్టమైన పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే బాలిక పూర్తిగా అగ్నికి ఆహుతైంది. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

కోర్టు ఉత్తర్వులకూ జగన్ మీడియా వక్రీకరణ

'ఆంధ్రజ్యోతి' ఎండీకి కోర్టు సమన్లంటూ తప్పుడు కథనం

హిందూపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వులనూ జగన్ మీడియా వక్రీకరించింది. 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణకు శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సమన్లు జారీ చేసినట్లు 'సాక్షి' దినపత్రిక, 'సాక్షి' చానల్‌లో ఆదివారం తప్పుడు కథనాలు ప్రచురించి, ప్రసారం చేశారని, అవి పూర్తిగా అవాస్తవాలని న్యాయవాది శివశంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... 2024 జూన్ మొదటి వారంలో హిందూపురం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న రియాజ్ అహ్మద్‌ను అర్ధరాత్రి వీఆర్‌కు పంపారు. దీనిపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వార్తను ప్రచురించింది. 'ఏబీఎన్' చానల్‌లో కూడా కథనం ప్రసారమైంది. దీంతో ఆయన.. 'ఆంధ్రజ్యోతి', 'ఏబీఎన్‌'పై హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో పరువునష్టం దావా వేశారు. ఇందులో డీ1గా 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ, డీ2గా శ్రీనివాస్ (సీఈవో, 'ఆంధ్రజ్యోతి'), డీ3గా స్వప్నిల్ చటర్జీ (ఎడిటర్ ఇన్ చీఫ్, 'ఆంధ్రజ్యోతి'), డీ4గా బాలు ('ఆంధ్రజ్యోతి' రిపోర్టర్, హిందూపురం), డీ5గా శంకర్ ('ఆంధ్రజ్యోతి' శ్రీసత్యసాయి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) పేర్లు చేర్చారు. హిందూపురం కోర్టులో కేసు (ఓఎస్ 41/2024) నమోదైంది. దీనిపై న్యాయవాదులు శివశంకర్, రకీబ్ 2025 జూన్ 9న డీ1 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ, డీ4 బాలు, డీ5 శంకర్ తరఫున వకాల్తా వేసి, అడాప్షన్ మెమోతో పాటు డీ4 తరఫున స్టేట్‌మెంట్ వేసి కోర్టులో వాదనలు వినిపించారు. డీ2 శ్రీనివాస్, డీ3 స్వప్నిల్ చటర్జీ పేరిట ఈ ఏడాది ఏప్రిల్ 10న కోర్టు సమన్లు జారీ చేసింది. కానీ ఆ పేర్లు, హోదాలతో 'ఆంధ్రజ్యోతి' సంస్థల్లో ఎవరూ లేకపోవడంతో ఆ సమన్లు ఎవరికీ చేరలేదు. ఈ నేపథ్యంలో డీ2, డీ3లకు సంబంధించి 'సాక్షి' దినపత్రికలో ప్రకటన ఇచ్చుకోవడానికి అనుమతివ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరడంతో కోర్టు సమ్మతించిందని శివశంకర్ వివరించారు. అయితే కోర్టు ఉత్తర్వులను రోతపత్రిక వక్రీకరించింది. 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణకు, స్థానిక 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్‌కు ఆగస్టు 18న హాజరుకావాలంటూ కోర్టు సమన్లు జారీ చేసినట్లు తప్పుడు కథనం ప్రచురించింది. కోర్టు ఉత్తర్వులను వక్రీకరించడంపై చట్టపరంగా ముందుకెళ్తామని న్యాయవాది శివశంకర్ తెలిపారు.

భాయ్.. బచ్చా ఆగయా..!

గంజాయి స్మగ్లర్ల కోడ్ భాష.. గచ్చిబౌలిలో ఈగల్ స్కెచ్.. 2 గంటలపాటు స్పెషల్ ఆపరేషన్

14 మంది కొనుగోలుదారుల అరెస్టు.. స్పాట్‌లోనే పరీక్ష.. వారందరికీ పాజిటివ్

స్మగ్లర్ సందీప్ కాంటాక్ట్‌లో 100 నంబర్లు.. మిగతా 86 మంది లొంగిపోవాలి: ఈగల్

హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): "భాయ్.. బచ్చా ఆగయా..!" అంటూ కోడ్ భాషలో గంజాయి విక్రయించే మహారాష్ట్ర వాసి సందీప్, మరో 14 మంది వినియోగదారుల ఆటను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ వింగ్ - ఈగల్ కట్టించింది. పట్టుబడ్డ గంజాయి కొనుగోలుదారుల్లో ఎక్కువ మంది ఐటీ ఉద్యోగులే కావడం గమనార్హం.! ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సందీప్ ప్రతీవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలికి గంజాయితో వస్తుంటాడు. తన వినియోగదారులకు "భాయ్.. బచ్చా ఆగయా" అంటూ కోడ్ భాషలో సందేశాలు పంపి.. గంజాయి సరుకు వచ్చిందనే సమాచారం ఇస్తాడు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో అడ్డాను ఏర్పాటు చేసుకుని, 100 మంది రెగ్యులర్ కస్టమర్లకు ఒక్కో ప్యాకెట్‌లో 50 గ్రాముల గంజాయిని పెట్టి, విక్రయిస్తుంటాడు. ఒక్కో ప్యాకెట్‌కు రూ.3 వేలు వసూలు చేస్తుంటాడు. శనివారం కూడా సందీప్ 100 గంజాయి ప్యాకెట్లతో గచ్చిబౌలికి వచ్చాడు. ఉప్పందుకున్న ఈగల్ బృందాలు.. కాపుకాచి, అతణ్ని అరెస్టు చేశాయి. అతని ఫోన్‌లో 100 మంది కస్టమర్ల డేటాను ఈగల్ బృందాలు సేకరించాయి. సందీప్ ఇచ్చిన సమాచారం మేరకు.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్దకు వచ్చే వినియోగదారుల కోసం వలపన్నాయి. ఈ క్రమంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యాపారి నవీన్(31), విద్యార్థి ఆయూష్(22), రేసింగ్ ఇంజనీర్ నిఖిల్(29), ఆర్కిటెక్ట్ సిందూర(26), ప్రాపర్టీ మేనేజర్ హసన్(34), ఐటీ ఉద్యోగులు క్రాంతి(28), తుషార్(24), అర్పిత(24), డెంటల్ టెక్నీషియన్ అఖిల్(28), బిజినెస్ రిలేషన్‌షిప్ మేనేజర్ శివ(32), ఫ్రీలాన్స్ యాడ్స్ ఏజెన్సీ నిర్వాహకుడు సందేశ్(34), రియల్‌ఎస్టేట్ ఎగ్జిక్యూటివ్ సాయిరాజ్(31), ట్రావెల్ ఏజెన్సీ ఉద్యోగి అఖిల్(26), డ్రైవర్ స్వామి(27) ఈగల్ బృందాలకు పట్టుబడ్డారు. వీరందరికీ అప్పటికప్పుడు డ్రగ్స్ టెస్ట్ నిర్వహించగా.. పాజిటివ్ వచ్చింది. దీంతో వీరిని రిహాబిలిటేషన్ కేంద్రానికి తరలించారు. వీరిలో ఇద్దరు దంపతులున్నట్లు పోలీసులు తెలిపారు. సందీప్ కాంటాక్ట్‌లో ఉన్న మిగతా 86 మంది లొంగిపోవాలని, లేనిపక్షంలో వారి ఇంటికి వెళ్లి అరెస్టు చేస్తామని సందీప్ శాండిల్య హెచ్చరించారు.

ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం వల్లే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలు కోల్పోయేందుకూ ఇదే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 8న ఈ ఘటన జరగడానికి కొన్ని నెలల ముందే ఆబ్కారీ అధికారులు హైదరాబాద్ నగరంలో 20 కల్లు నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. అక్కడ జరిపిన కెమికల్ ఎగ్జామినేషన్‌లో ఈ నమూనాల్నింట్లోనూ ప్రమాదకరమైన ఆల్ప్రాజోలం ఉన్నట్లు తేలింది. అయినా.. ఎక్సైజ్ అధికారులు ఈ ల్యాబ్ నివేదికలను తమ వద్దనే పెట్టుకున్నారు తప్ప.. కల్తీ కల్లు వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని సమాచారం. దాంతో కల్తీ కల్లు విక్రయం నిరాటంకంగా కొనసాగింది. చివరికి 8 మంది ప్రాణాలను బలిగొంది. ఈ ఘటన తరువాత కూడా ఈ నెల 8న, 11న ఎస్టీఎఫ్ బృందాలు హైదరాబాద్‌లో మళ్లీ 20 కల్లు నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించాయి. కెమికల్ ఎగ్జామిన్‌లో వీటన్నింటిలోనూ ఆల్ప్రాజోలం ఉన్నట్లు తేలిందని తెలుస్తోంది. అయినా.. కల్లు తాగేవారి తనువంతా విషంతో నింపుతున్న వారిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేని పరిస్థితుల్లో ఎక్సైజ్ శాఖ ఉంది.



విక్రయదారులకు లొసుగులు చెప్పి మరీ..

కల్తీ కల్లు విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి.. ఎక్సైజ్ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, చట్టంలోని లొసుగులను విక్రయదారులకు చెప్పి మరీ అమ్మకాలు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కల్లు కల్తీ జరిగిందని గుర్తిస్తే కనీసం సొసైటీ పాలకవర్గాన్ని తప్పించి.. కొత్త పాలకవర్గం ద్వారా దానిపై ఆధారపడిన సభ్యులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కానీ, పాలకవర్గాన్ని కనీసం హెచ్చరించే సాహసం కూడా ఆబ్కారీ శాఖ చేయడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో కల్తీ కల్లు విక్రయాలకు అడ్డే లేకుండా పోయిందని అంటున్నారు. హైదరాబాద్‌లో తయారవుతున్న కల్లు 90 శాతం కల్తీయేనని అధికారులు ఇప్పటికే గుర్తించారని, అయినా.. ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వమే కఠిన చర్యలు తీసుకునే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

కల్లు తాగిన వారి నమూనాలు పరిశీలిస్తే..

రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల్లో రెండు జిల్లాలు తప్ప.. మిగిలిన ఎనిమిది జిల్లాల్లో కల్తీ విక్రయం యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలున్నాయి. కల్లు తాగి అనారోగ్యాల బారిన పడుతున్న వ్యక్తుల నుంచి రక్త నమూనాలు సేకరించి వాటిని ప్రయోగశాలలో టాక్సికాలజీ పరీక్షలు చేస్తే.. అందులో క్లోరోహైడ్రేట్, డైజోఫాం, ఆల్ప్రాజోలం వంటి కల్తీ పదార్థాల అవశేషాలు ఉన్నాయో లేదో తెలిసే అవకాశం ఉంటుంది. కానీ, ఈ విషయంపై ఆబ్కారీ శాఖ ఏనాడూ కసరత్తు చేసిన దాఖలాలు లేవనే విమర్శలున్నాయి. దీంతో ప్రమాదకర మత్తు పదార్థాలను కల్లులో మోతాదుకు మించి కలిపి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా మెథనాల్, కొన్ని రకాల బ్యాటరీ ఆమ్లాలు కూడా కలుపుతున్నారు. ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్న ఈ అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో కల్తీ కల్లు తాగే వారి ఆయుస్సు 20 ఏళ్లు తగ్గిపోతుందని వైద్యులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాటర్ బాటిల్ కంటే తక్కువ ధరకు కల్తీ కల్లు

రాష్ట్రంలో వాటర్ బాటిల్ కంటే కూడా తక్కువ ధరకు కల్లు సీసా దొరుకుతుండడం గమనార్హం. తాగు నీరు లీటర్ ధర రూ.20 ఉంటుండగా.. 650 మిల్లీ లీటర్ల కల్లు సీసా రూ.11కే దొరుకుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో సీసా ధర గరిష్ఠంగా రూ.15 ఉంటే.. హైదరాబాద్ లాంటి చోట్ల మాత్రం అతి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. తాటి, ఈత చెట్లు లేని చోట సైతం వేల లీటర్ల కల్లు విక్రయాలు జరుగుతున్నాయి. చెట్లున్నా.. వాటిని గీసేవాళ్లే లేరు. అయినా అక్కడ కల్లు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కిలో ఆల్ప్రాజోలం ధర దాదాపు రూ.15 లక్షల వరకు పలుకుతుండగా.. 10 గ్రాములతో దాదాపు 100 పెట్టెలు అంటే.. 1200 సీసాల కల్లు తయారవుతుంది. ఈ ఆల్ప్రాజోలం ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి తెలంగాణకు వస్తోంది. ఇటీవల ట్రెండ్ మార్చి కూడా దీనిని సరఫరా చేస్తున్నారు. రెండురోజుల క్రితం ముషీరాబాద్ ప్రాంతంలోని ఓ మెడికల్ షాప్‌లో రూ.42 లక్షల విలువైన ఆల్ప్రాజోలంతో తయారైన 12లక్షల ట్యాబ్లెట్లు ఎక్సైజ్ అధికారుల తనిఖీలో దొరికాయి. క్లోరోహైడ్రేట్ ఎక్కువగా కర్ణాటక నుంచి దిగుమతి అవుతుంది. కల్తీ ఏ స్థాయిలో జరుగుతుందో ఆబ్కారీ శాఖలో కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారి వరకు ప్రతి ఒక్కరికీ తెలిసినా మౌనంగానే ఉంటున్నారు. వాస్తవానికి 650 మి.లీ. కల్లు అసలైనది. దానిని గరిష్ఠంగా రూ.100 వరకు విక్రయించే అవకాశం ఉంది. కానీ, రాష్ట్రంలో ఎక్కడ చూసినా రూ.11 నుంచి రూ.50కి మించి ధర లేదు. ఇంత తక్కువకే ఎలా విక్రయిస్తున్నారనే అనుమానాలు అందరిలో ఉన్నా.. యంత్రాంగం మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. కల్తీ కల్లుతో ఎవరివైనా ప్రాణాలు పోయినప్పుడు మాత్రమే ఎక్సైజ్‌శాఖ దాడులు చేస్తూ చేతులు దులుపుకొంటోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పదికి చేరిన 'కల్తీ కల్లు' మృతుల సంఖ్య !

నిమ్స్‌లో పదో తేదీన ఒకరి మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మృతుల సంఖ్య పదికి పెరిగింది. కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రిలో చేరిన ఆసోది కురుమయ్య (59) ఈ నెల 10న చికిత్స పొందుతూ మరణించారు. ఈ విషయాన్ని అతని కుమారుడు శివుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కురుమయ్య అంత్యక్రియలు ఈ నెల 11న వనపర్తి జిల్లాలోని స్వగ్రామంలో నిర్వహించారు. అడ్డగుట్ట సొసైటీలోని విజేత సూపర్ మార్కెట్లో సెక్యూరిటీ గార్డుగా పని చేసే కురుమయ్య .. కల్లు తాగి గతవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు అతనిని స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ కురుమయ్య మరణించారు. మరోపక్క, కల్తీ కల్లు బాధితులెవరూ తమ ఆస్పత్రిలో చనిపోలేదని నిమ్స్ వర్గాలు చెబుతుండడం గమనార్హం. కాగా, కల్తీ కల్లు ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

నేడు రెండు అల్పపీడనాలు

ఒడిశా, బెంగాల్ తదితర రాష్ట్రాల్లో కుంభవృష్టి

17 నుంచి ఉత్తర కోస్తాలో పెరగనున్న వర్షాలు

విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్, ఉత్తర ఒడిశాకు ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో ఆదివారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో సోమవారం నాటికి పశ్చిమబెంగాల్, ఉత్తర ఒడిశాకు ఆనుకుని వాయువ్యబంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం మధ్యప్రదేశ్‌లోని వాయువ్య భాగంలో అల్పపీడనం ఏర్పడనుంది. వీటి ప్రభావంతో ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో పలు చోట్ల కుంభవృష్టి కురుస్తుందని వాతావరణశాఖ తెలిపింది. కాగా, రుతుపవనద్రోణి తూర్పుభాగం రానున్న మూడు, నాలుగు రోజుల్లో దక్షిణాది వైపుగా వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. దీంతో ఈ నెల 17 నుంచి ఉత్తరకోస్తాలో వర్షాలు పెరగనున్నాయి.

గీత, రాత పూర్తిగా తెలిసిన వ్యక్తి కార్టూనిస్ట్ శేఖర్

» సీనియర్ జర్నలిస్ట్ వినయ్ కుమార్

» కార్టూనిస్ట్ శేఖర్ స్మారక అవార్డు ప్రదానోత్సవ సభ

పంజాగుట్ట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గీత, రాత పూర్తిగా తెలిసిన వ్యక్తి కార్టూనిస్ట్ శేఖర్ అని, నేటితరం కార్టూనిస్టులు సమకాలీన అంశాలతో పాటు సాహిత్యం మీద కూడా పట్టు సాధించాలని, అప్పుడే తాము చెప్పదలచుకున్న అంశాన్ని ప్రభావవంతంగా చెప్పగలుగుతారని సీనియర్ జర్నలిస్ట్ ఎస్.వినయ్ కుమార్ అన్నారు. కార్టూనిస్ట్ శేఖర్ జయంతి సందర్భంగా ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కార్టూనిస్ట్ శేఖర్ స్మారక అవార్డు-2025' ప్రదానోత్సవ సభ జరిగింది. ప్రముఖ కార్టూనిస్ట్ మృత్యుంజయతో పాటు చిత్రకారుడు చిత్ర ఈ అవార్డులు అందుకున్నారు. వినయ్ కుమార్ మాట్లాడుతూ త్వరలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శేఖర్ కార్టూన్ల ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. 'ఏ బ్రష్ అగైనెస్ట్ ప్రెజుడిస్', 'ది ప్రో-పీపుల్ ఆర్ట్ ఆఫ్ శేఖర్' అనే అంశంపై సీనియర్ జర్నలిస్టు కేవీ కూర్మనాథ్ స్మారకోపన్యాసం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనే శేఖర్ 'గిదీ తెలంగాణ', 'క్యాస్ట్ క్యాన్సర్' అనే పుస్తకాలు తీసుకువచ్చి అగ్రకులాల మీద తన యుద్ధాన్ని ప్రకటించాడని గుర్తు చేశారు. అవార్డు గ్రహీత మృత్యుంజయ మాట్లాడుతూ కార్టూనిస్ట్ శేఖర్‌ను చూసి చాలా విషయాలు నేర్చుకున్నామన్నారు. మరో అవార్డు గ్రహీత చిత్ర మాట్లాడుతూ శేఖర్ బతికుండగా ఆయనకు ఒక బొమ్మ గీసి ఇవ్వలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన గుర్తుగా ఓ అవార్డు తీసుకోవడం జీవితంలో మరచిపోలేని విషయమన్నారు. ప్రభుత్వం తరఫున శేఖర్ పేరుతో ఒక అవార్డు ప్రకటించాలని, మ్యూజియం ఏర్పాటు చేయాలని వక్తలు కోరారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి

» బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకుడు దాసు సురేశ్

గద్వాల, జూలై 13(ఆంధ్రజ్యోతి): బీసీలు సంఘటితంగా ఉంటేనే రాజ్యాధికారం దిశగా అడుగులు వేయవచ్చని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకుడు దాసు సురేశ్ చెప్పారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుపై సీఎం రేవంత్ ప్రధానమంత్రిని అడగటం లేదని సురేశ్ చెప్పారు. 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేంత వరకు బీసీ రాజ్యాధికార సమితి కృషి చేస్తుందని, బీసీ జెండాను ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. త్వరలో జిల్లాలో మహాసభను నిర్వహించి బీసీల ఐక్యతకు కృషి చేస్తామన్నారు.

ఆరేళ్లు సహజీవనం చేసి.. హత్య

సాయం కోసం ఇద్దరు వ్యక్తులకు రూ.లక్ష సుపారీ

» మాయమాటలు చెప్పి.. ఖమ్మం జిల్లా కొణిజర్ల నుంచి తీసుకెళ్లి సూర్యాపేట జిల్లా కిష్టాపురం అడవుల్లో హత్య

» మహిళ అదృశ్యం కేసులో వీడిన మిస్టరీ

కొణిజర్ల/చింతలపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలు పుట్టడం లేదని కట్టుకున్న భార్యను వదిలేశాడు. ఆ తర్వాత ఇద్దరు పిల్లలున్న, భర్త నుంచి విడిపోయిన మహిళతో సహజీవనం ప్రారంభించాడు. ఆపై మరో మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఇద్దర్నీ ఒకే ఇంట్లో ఉంచి కాపురం చేస్తున్న క్రమంలో వారి మధ్య గొడవలతో సహజీవనం చేస్తున్న మహిళను అడ్డు తొలగించుకోవాలని పథకం పన్నాడు. దాని కోసం ఇద్దరు వ్యక్తులకు రూ.లక్ష సుపారీ ఇచ్చి వారి సాయంతో ఆమెను హతమార్చాడు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం విక్రంనగర్ నుంచి కొద్ది రోజుల క్రితం అదృశ్యమైన ఆమె కేసు వెనుక మిస్టరీని పోలీసులు ఛేదించారు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఆమె మృతదేహాన్ని సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం కిష్టాపురం గ్రామ శివారులోని అటవీ భూముల్లో గుర్తించారు. ఆదివారం ఖమ్మం జిల్లా వైరా సీఐ ఎన్‌సాగర్, ఎస్ఐ జి.సూరజ్ వివరాలు తెలిపారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం టేకుల తండాకు చెందిన భూక్యా మదన్‌కు ఏన్కూరు మండలానికి చెందిన మహిళతో సుమారు పదేళ్ల క్రితం వివాహమైంది. పిల్లలు పుట్టడం లేదన్న కారణంతో పెళ్లయిన నాలుగేళ్లకే ఆమెకు విడాకులు ఇచ్చాడు. ఆ తర్వాత టేకులతండాకు చెందిన భూక్యా హస్లీ (40)తో పరిచయం పెరిగింది. హస్లీ అప్పటికే భర్త నుంచి విడాకులు పొందింది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు పెళ్లి కాగా.. రెండో కుమార్తె తండ్రి వద్ద ఉంటోంది. మదన్, హస్లీ కొణిజర్ల మండలం విక్రంనగర్‌లో బంధువుల ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆరేళ్లుగా వారి సహజీవనం కొనసాగుతుండగా... మూడేళ్ల క్రితం మదన్ కొణిజర్ల మండలంలోనే అబ్బల్‌తండాకు చెందిన మరో మహిళను పెళ్లి చేసుకున్నాడు. ఆమెను కూడా హస్లీతో ఉంటున్న ఇంటికే తీసుకొచ్చాడు. ఈ నేపథ్యంలో కొన్ని నెలలుగా వారిద్దరికీ మధ్య గొడవలు తారస్థాయికి చేరాయి. దీంతో మదన్ హస్లీని అడ్డు తొలగించుకోవాలని పథకం పన్నాడు. తమ్మిశెట్టి నరసింహారావు (కొణిజర్ల మండలం బస్వాపురం), చల్లా నాగేశ్వరరావు (కొణిజర్ల)ను సంప్రదించాడు. హస్లీని హతమార్చేందుకు సహకరించాలని, రూ.లక్ష సుపారీ ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ నెల 6న మదన్.. హస్లీకి మాయమాటలు చెప్పి కిరాయి ఆటోలో ఎక్కించుకుని తీసుకెళ్లాడు. నరసింహారావు, నాగేశ్వరరావును కూడా కొణిజర్ల వద్ద ఆటోలో ఎక్కించుకొని సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం కిష్టారం అడవుల వద్దకు తీసుకెళ్లాడు. కిరాయికి వచ్చిన ఆటో వెళ్లిపోయిన తర్వాత హస్లీకి బలవంతంగా విషం తాగించి.. గొంతునులిమి హత్య చేశారు. తర్వాత ఎవరికి వారు ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే హస్లీ కూతుళ్లకు తరచూ ఫోన్ చేస్తూ యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉంటోంది. తమ తల్లి నాలుగు రోజులుగా ఫోన్ చేయకపోవడంతో కూతుళ్లు ఆందోళన చెందారు. తమ తల్లి ఆచూకీ తెలియడం లేదని ఈ నెల 11న కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన కొణిజర్ల పోలీసులు మదన్ తీరుపై అనుమానం వచ్చి ప్రశ్నించడంతో హత్య విషయం బయటపడింది. సీఐ, ఎస్సైలు ఘటనా స్థలానికి వెళ్లగా కుళ్లిన స్థితిలో ఉన్న హస్లీ మృతదేహాన్ని గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. మదన్‌ను అదుపులోకి తీసుకోగా నరసింహారావు, నాగేశ్వరరావు పరారీలో ఉన్నారు.



హత్యకు గురైన హస్లీ (ఫైల్)

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

2 రోజుల్లో మూతపడనున్న గేట్లు!

» 551.10 అడుగులకు సాగర్ నీటిమట్టం

» మేడిగడ్డకు కొనసాగుతున్న వరద

» బ్యారేజీకి 2.89 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

» నెలన్నరలో 256 టీఎంసీలు సముద్రం పాలు

గద్వాల/నాగార్జునసాగర్/మహదేవపూర్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది వరద తగ్గుముఖం పట్టగా.. గోదావరికి మాత్రం కొనసాగుతోంది. కర్ణాటక, మహారాష్ట్రతో పాటు కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గిపోయింది. జలాశయానికి ఆదివారం 73,586 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చింది. ఒక గేటు ఎత్తి 27,296 కూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 68,382 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు రోజుల్లో గేట్లు మూసివేసే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 206.09 టీఎంసీల నిల్వ ఉంది. జూరాల ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఒక గేటు ద్వారా 6,823 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 36,035 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నిలకడగా కొనసాగుతోంది. దీంతో సాగర్ నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 551.10 అడుగులకు చేరుకుంది. సాగర్ నుంచి జంటనగరాల తాగునీటి అవసరాల కోసం ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,650 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఆలమట్టి ప్రాజెక్టుకు కూడా ఇన్‌ఫ్లో 69,084 క్యూసెక్కులకు తగ్గింది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 3 వేల క్యూసెక్కులే ఉంది. తుంగభద్రకు ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో 30,728 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో గోదావరిపై నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం ఇన్‌ఫ్లో 2.89 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. నీటిమట్టం 4.20 మీటర్లు ఉంది. దీంతో కుంగిన ఏడో బ్లాక్‌లోని గేట్లతో పాటు మొత్తం 85 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.